


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


మేడిగడ్డపై కేంద్రం తీరు దారుణం




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 190 | గురువారం 16- 07 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028


## ‘అభయ‘ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనిత



**మహిళల భద్రత కోసం అనకాపల్లి పోలీసులు మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్న అనిత**

**చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని సూచన**

**బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పిల్లలకు హితవు**

2లో

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు చాలా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రజలకు హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై ఓ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనకాపల్లి జిల్లాలోని వేంపాడు

## ముద్రగడ పాడె మోసిన జగన్



**ప్రారంభమైన ముద్రగడ అంత్యక్రియలు**

2లో

**ముద్రగడ కుటుంబ సభ్యులను ఓదార్చిన జగన్**

**భారీ సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు**

మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం భౌతిక కాయానికి వైసీపీ అధినేత జగన్ నివాళులర్పించారు. ముద్రగడ కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పిన జగన్, కుటుంబానికి



# పవిత్ర సంగమం వద్ద జలహారతి

## కృష్ణా–గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి

- నదుల అనుసంధానంతోనే కరువు నివారణ
- పెన్నా- వంశధార నదుల అనుసంధానం లక్ష్యం
- పట్టిసీమతో గోదావరి తరలింపు చేపట్టి చూపాం
- కెఎల్ రావు దార్శనికత వల్లనే అనేక ప్రాజెక్టుల నిర్మాణం
- గంగా-కావేరి నదుల అనుసంధానం చేస్తే తిరుగుండదు
- మార్చి 2027 నాటికి పోలవరం జాతికి అంకితం చేస్తామన్న చంద్రబాబు

మిగతా2లో

నదుల అనుసంధానం పూర్తి చేస్తే.. రాష్ట్రానికి కరవు ఉండదని స్పష్టం ముఖ్యమంత్రి చంద్రబాబు చేశారు. పెన్నా–వంశధార నదుల అనుసంధానం చేయాలనేది లక్ష్యమని పేర్కొన్నారు. . వచ్చే మూడేళ్లలో రూ.35వేల కోట్లు ఖర్చు చేసి.. 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. గంగా–కావేరి నదుల అనుసంధానం చేయగలిగితే దేశానికి తిరుగుండదన్నారు. రెండేళ్లలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై రూ.24వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని కృష్ణా–గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి అనంతరం ఏర్పాటు చేసిన సభలో

## దాల్మియా సిమెంట్ విస్తరణ..



**ఈ విస్తరణ కోసం రూ.3,100 కోట్లు పెట్టుబడిగా పెట్టనున్న సంస్థ**

**ప్లాంట్ విస్తరణతో కొత్తగా 1000 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు**

**సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం 3.6 నుంచి 9.6 మిలియన్ టన్నులకు పెంపు**

**ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు టీజీ భరత్, సవిత, పలువురు ప్రజాప్రతినిధులు**

మిగతా 2లో

రాయలసీమ పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక ముందడుగు పడింది. కడప జిల్లాలో ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థ దాల్మియా భారత్ సిమెంట్ తన కార్యకలాపాలను భారీ స్థాయిలో విస్తరించనుంది. జిల్లాలోని మైలవరం మండలం చిన్నకొమెర్ల వద్ద రూ.3,100 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న రెండో ప్లాంట్ (లైన్–2) విస్తరణ పనులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ విస్తరణ ద్వారా ప్రత్యక్షంగా వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభించనుండటంతో స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి లోకేశ్‌కు దాల్మియా భారత్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పునీత్ దాల్మియా, కంపెనీ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. శంకుస్థాపనకు ముందు మంత్రి, కంపెనీ ప్రాంగణంలోని అడ్మినిస్ట్రేషన్ భవనంలో ఏర్పాటు చేసిన ఆధునిక రోబో ల్యాబ్, సెంట్రల్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. వాటి పనితీరు, సాంకేతిక పరిజ్ఞానం గురించి



## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ



**షాబాద్ ఘటనపై రేవంత్ రెడ్డికి పవన్ కల్యాణ్ లేఖ**

2లో

**పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి**

**పోక్సో కేసు నిందితుడు ఆరుగురిని హత్య చేసిన వైనం**

**పోలీసుల వైఫల్యం వల్లే ఈ ఘోరం జరిగిందని పవన్ ఆరోపణ**

**బాధితులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శ**

తెలంగాణ రాష్ట్రం షాబాద్‌లో చోటుచేసుకున్న ఘోర సామూహిక హత్యల ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బుధవారం ఒక లేఖ రాశారు. పోక్సో చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని, బాధితులకు పూర్తిస్థాయి భద్రత కల్పించేలా కఠిన చర్యలు చేపట్టాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. షాబాద్‌లో జరిగిన ఈ దారుణ ఉదంతాన్ని పవన్ కల్యాణ్ తన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్, 16 ఏళ్ల బాధితురాలితో పాటు ఆమె తల్లి, నానమ్మను

## అమరావతి 2.0 మాస్టర్ ప్లాన్...

### సింగపూర్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమీక్ష



**ఆర్థిక వృద్ధికి కేంద్రంగా అమరావతి నిర్మాణం**

2లో

**అమరావతి 2.0 ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్‌పై సీఎం సమీక్ష**

**ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచన**

**ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లతో అంతర్జాతీయ స్థాయి నగరం**

**ప్రణాళికపై సింగపూర్ ప్రతినిధుల ప్రజెంటేషన్**

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ఆర్థిక ప్రగతికి చోదక శక్తిగా, ప్రపంచ స్థాయి నగరంగా అమరావతిని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి ప్రజలు వచ్చి నివసించేలా రాజధాని ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ ఉండాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమరావతి 2.0 ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఫ్రాూ–2) పనుల పురోగతిపై ఆయన ఉన్నతాధికారులు, సింగపూర్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సింగపూర్ ప్రతినిధులు అమరావతి నిర్మాణానికి సంబంధించిన ప్రాజెక్టు పరిధి, అమలు ప్రణాళిక, దశలవారీ కార్యాచరణను ముఖ్యమంత్రికి వివరించారు. ఏరియా ప్లాన్, మౌలిక వసతుల కల్పన, పెట్టుబడి నమూనా వంటి కీలక అంశాలను ప్రాజెక్టులో భాగంగా చేర్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, ఉద్యోగాలు కల్పించడం ద్వారా అమరావతి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు.

## జగన్‌ది రాక్షస మనస్తత్వం



**జగన్ రైతు ద్రోహి అన్న మంత్రి నిమ్మల**

**ఎల్‌నినో కారణంగా నీరు లేని పరిస్థితి నెలకొందని వెల్లడి**

**రైతన్నలకు పట్టిసీమ ప్రాణం పోస్తోందని వ్యాఖ్య**

వైసీపీ అధినేత జగన్‌పై ఏపీ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాక్షస మనస్తత్వం జగన్‌దని ధ్వజమెత్తారు. కరవు కాటకాలతో రాష్ట్రం అల్లాడిపోవాలనే ఆలోచన ఆయనదని విమర్శించారు. రైతు ద్రోహి జగన్ అని, అలాంటి వ్యక్తికి ఒక పార్టీకి అధ్యక్షుడిగా ఉండే అర్హత కూడా లేదని ఎద్దేవా చేశారు. ఎల్‌నినో కారణంగా ఏపీలో ఎక్కడా ఒక్క చుక్క నీరు కూడా లేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల ప్రాజెక్టుల్లో నీళ్లు లేని పరిస్థితి ఉందన్నారు. సీఎం చంద్రబాబు ముందుచూపుతోనే ఈరోజు రైతన్నలకు

2లో

# పవిత్ర సంగమంవద్ద జలహారతి

సీఎం మాట్లాడారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని కృష్ణా- గోదావరి జలాల పవిత్ర సంగమం వద్ద జలహారతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తుల్లో కృష్ణవేణి - గోదావరి నదుల సంగమ ప్రాంతంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జలాలకు పుష్పమాల, వస్త్రాలు, పసుపు- కుంకుమ సమర్పించారు. కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి ఇచ్చారు. మార్చి 2027 నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణకు ఈనెలలో శంకుస్థాపన చేస్తామని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తయ్యాయని, ఆగస్టు 14న అనకాపల్లిలో గోదావరి జలాలకు జలహారతి ఇస్తామని ప్రకటించారు. సెప్టెంబరు 1న వెలిగొండ ఫేజ్-1

ప్రాజెక్టు జాతికి అంకితం చేస్తామన్నారు. ఎక్కడ నాకు పేరొస్తుందోనని.. నాడు పట్టిసీమ నిర్మిస్తుంటే అందరూ నన్ను విమర్శించారు. పట్టిసీమ ఒట్టిసీమ అన్నారు. విమర్శలు పట్టించుకొని ఉంటే పదేళ్లలో కృష్ణాడెల్టా ఏమయ్యేదో. వారి విమర్శలు పట్టించకోకుండా రూ.1300 కోట్లు ఖర్చు పెట్టి పట్టిసీమ పూర్తిచేశా. గోదావరి నుంచి కృష్ణానదికి 450 టీఎంసీలు తీసుకొచ్చాం. పట్టిసీమ వల్ల కరవు సీమ.. హార్టికల్చర్ హబ్‌గా తయారైంది. నీళ్లుంటే పరిశ్రమలు వస్తాయి, ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆపై ప్రముఖ ఇంజినీర్ కేఎల్ రావు 124వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. శ్రీశైలం, నాగార్జునసాగర్ లాంటి అతిపెద్ద ప్రాజెక్టుల నిర్మాణంలో కేఎల్ రావు కీలకపాత్ర పోషించారు. ఆయన విజయవాడలో జన్మించడం మన అదృష్టం. ముగ్గురు ప్రధానుల దగ్గర పనిచేసిన గొప్ప వ్యక్తి. నీళ్లు ఎక్కడ ఉంటే అక్కడ అభివృద్ధి జరుగుతుంది.ఆంధ్రప్రదేశ్‌కు అన్నపూర్ణగా ఖ్యాతి గడించిందటే కృష్ణా, ఉభయగోదావరి జిల్లాలే కారణం. శ్రీశైలం, నాగార్జునసాగర్ నిర్మించకుంటే ఏపీ ఇబ్బంది పడేది. ఏడాదిలో పట్టిసీమ పూర్తి చేసి కృష్ణాడెల్టాను కాపాడిన ఘనత తెలుగుదేశం పార్టీదని వివరించారు. 80 టీఎంసీలతో 13 లక్షల ఎకరాలు స్థిరీకరించాం. గోదావరి నుంచి ఏటా 2వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తాయి. ఏడాదిలో గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తి చేసి.. కియా ఫ్యాక్టరీ ఏర్పాటు చేశాం. అమరావతిని నిర్మిస్తుంటే విమర్శిస్తున్నారు. విజయవాడ, గుంటూరు, మంగళగిరి కలిపితే అమరావతి. 99శాతానికి పైగా రైతులు అమరావతికి భూములు ఇచ్చారు. ఆగస్టు 15 నాటికి సీడ్ యాక్సిస్ రోడ్డు పూర్తవుతుంది. సీడ్ యాక్సిస్ రోడ్డులో ప్రయాణిస్తే.. అమరావతి విశిష్టత తెలుస్తుందని సీఎం అన్నారు. ఇంజినీర్‌గా కేఎల్ రావు స్ఫూర్తి ప్రతి గ్రామానికీ తీసుకెళ్లేలా ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. పట్టిసీమ నుంచి గోదావరి జలాలు కృష్ణమ్మ చెంతకు చేరి ఈ డెల్టాను సస్యశ్యామలం చేస్తున్నాయన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు కృష్ణా నది నుంచి నీటి ప్రవాహం తగ్గిందని తెలిపారు. రైతులు పండించిన పంటలు తుఫాన్ల బారిన పడి నష్టపోతున్న దుస్థితి నుంచి రక్షించాలనే పట్టిసీమ ప్రాజెక్టు చేపట్టామని సీఎం వెల్లడించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్, హీరాకుడ్, కోసీ లాంటి ప్రధానమైన డ్యామ్‌ల నిర్మాణంలో కేఎల్ రావు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఐక్యరాజ్య సమితి తరపున అంతర్జాతీయ జల నిపుణులుగా ఈజిప్ట్, సూడాన్ లాంటి దేశాల్లోనూ సేవలందించారన్నారు. విజయవాడలో పుట్టి ఎంపీగా ఎన్నికై ముగ్గురు ప్రధానుల వద్ద కేఎల్ రావు కేంద్రమంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. నీటి పారుదల రంగం, జల విద్యుత్ ఉత్పత్తి లాంటి అంశాలపై పనిచేసి దేశానికి సేవలందించారన్నారు. గోదావరి ప్రాంతంలో ధవళేశ్వరం, కృష్ణానదిపై కృష్ణాబ్యారేజీని సర్ ఆర్థర్ కాటన్ నిర్మాణం చేశారని.. ఇది ఏపీని దేశానికే అన్నపూర్ణగా మార్చిన నిర్ణయమని సీఎం చెప్పుకొచ్చారు. కేఎల్ రావు ఈ ప్రాజెక్టులను ఆధునీకరించి డెల్టాను సస్యశ్యామలం చేశారన్నారు. శివరామకృష్ణయ్య, కేఎల్ రావు తర్వాత ఆంధ్రప్రదేశ్ సాగునీటి రంగంపై ఆలోచించిన వ్యక్తి ఎన్టీఆర్ అని.. సాగునీటి రంగాన్ని తీర్చిదిద్దటంలో వీరంతా స్ఫూర్తి అంటూ వెల్లడించారు. వాగులు, వంకలు, నీటి ఊటలు కూడా ఇప్పుడు అడుగంటిపోయాయని, భూగర్భజలాలను పెంచేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారిపోకుండా చర్యలు చేపట్టామని చంద్రబాబు తెలిపారు. గోదావరి- కావేరి అనుసంధానించాలని కేఎల్ రావు ప్రతిపాదించారని గుర్తుచేశారు. నదుల అనుసంధానం జరిగితే భారత్‌కు అద్భుతమైన అవకాశాలు వస్తాయన్నారు. గంగా-కావేరీ అనుసంధానం కోసం మాజీ ప్రధాని వాజ్‌పేయి హయాంలో ఓ టాస్క్‌ఫోర్సును ఏర్పాటు

చేశారన్నారు. 2014లో విభజన తర్వాత బస్సులోనే బస చేసి కృష్ణా డెల్టాకు న్యాయం చేసేలా పట్టిసీమ ప్రారంభించామని ఆనాటి సంగతులను గుర్తుచేశారు. 80 టీఎంసీల గోదావరి నీటిని తీసుకువచ్చి కృష్ణా డెల్టాను సస్యశ్యామలం చేశామన్నారు. నీల వర్ణంలోని కృష్ణా జలాలు, అరుణ వర్ణంలోని గోదావరి జలాలు కలిసి ఈ ప్రాంతంలో బంగారం పండించాయని ఆనందం వ్యక్తం చేశారు. గోదావరి నుంచి కనీసం సగటున ఏడాదికి 2 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్తోందన్నారు. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని... రాష్ట్రానికి జీవనాడిగా మారుస్తామని స్పష్టం చేశారు. పట్టిసీమ వట్టిసీమ అని అవహేళన చేశారని.. ప్రాజెక్టు దండగ అన్నారని... ఇప్పుడు ఆ నీరే డెల్టాను కాపాడుతోందని సీఎం తెలిపారు. ఆ నీరే రాకపోతే కృష్ణా డెల్టా పరిస్థితి ఏమిటన్నది అంతా ఆలోచించాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైటెక్ సిటీ నిర్మిస్తే దండగన్నారని.. ధైర్యంగా ముందుకు వెళ్లబట్టే ఐటీకి కేంద్రంగా హైదరాబాద్ నిలబడిందని చెప్పుకొచ్చారు. ఇప్పుడు అమరావతిని కూడా అద్భుతమైన నగరంగా నిర్మిస్తుంటే కొందరు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షంలోని కొందరు.. రైతుల్ని రెచ్చగొట్టి సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారని సీఎం చంద్రబాబు ఆరోపణలు గుప్పించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఎంపీ కేశినేని శివనాథ్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

# నదుల అనుసంధానమే పరిష్కారం

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాలు వెనక్కి పోయాయి. ఇప్పట్లో వానలు పడతాయన్న భరోసా లేదు. ఈ క్రమంలో తాగు,సాగునీటి సమస్యలతో పాటు ఆహార పదార్థాల లభ్యతపైనా ఆందోళన కలుగుతోంది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ చర్యలపై కేంద్రం నిర్ణయాలు తీసుకోవాలి. ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఈ సమావేశాల్లో ఎల్‌నినో పరిస్థితులు, ప్రత్యామ్నాయాలపై చర్చించాలి. సాగు,తాగునీటికి శాశ్వత ప్రణాళికలపై చర్చించాలి. కేవలం రాజకీయ ఎజెండాలతో ముందుకు సాగకుండా, వాటిని పక్కన పెట్టి ప్రజల కోసం నేతలు ఆలోచన చేయాలి. నదుల అనుసంధానం ఇందులో ప్రధానమైన సమస్య. మనదేశంలో ఎన్నో జీవనదులు ఉన్నాయి. వీటిని సన్మార్గం పట్టిస్తే దేశంలో కరువు కాటకాలకు వీలుండదు. నదులను అనుసంధానించడం, జలరక్షణను జాతీయ విధానంగా తీసుకోవడం తక్షణావసరంగా గుర్తించాలి. రాష్ట్రాల మధ్య తగవులు తీరాలంటే ఇదే మంచి పద్దతి. నదుల్లో నీరు సముద్రంలోకి వృధాగా పోకుండా మళ్లింపు చర్యలు తీసుకోవాలి. దీనికి నదుల అనుసందానం చేయాలి. అలాగే నీటి సంరక్షణను కేంద్రం ఆధీనంలోకి తీసుకుని ఆయా రాష్ట్రాల అవసరాలను నెరవేర్చగలగాలి. ఇది చాలా ప్రధానమైన సమస్య. ఈ వర్షాకాల సమావేశంలో పార్లమెంట్ దీనిపై ఎన్నిరోజులైనా చర్చించాలి. అలాగే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఎన్నివేల కోట్లు అయినా నిధులు కేటాయించాలి. అప్పుడే దేశం ఎల్‌నినో లాంటి పరిస్థితులు వచ్చినా తట్టుకుంటుంది. ఎల్‌నినో ప్రభావాన్ని మనం ఆపలేం కనుక, దాని వల్ల కలిగే నష్టాన్ని తగ్గించవచ్చు. అందుకు ఇప్పటి నుంచే సరైన ప్రణాళిక, శాస్త్రీయ దృష్టి, సమర్థమైన ప్రభుత్వ విధానాలు, రైతులకు సకాలంలో మద్దతు అత్యవసరం. లేకపోతే వాతావరణ సంక్షోభం కేవలం వ్యవసాయాన్నే కాదు.. దేశ ఆహార భద్రతను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, కోట్లాది ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. భారతదేశంలో దాదాపు 60 శాతం వ్యవసాయం ఇప్పటికీ వర్షాలపైనే ఆధారపడి ఉంది. ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, పత్తి వంటి పంటలు ఎక్కువగా వర్షాధార ప్రాంతాల్లోనే సాగవుతాయి. వర్షాలు తగ్గితే దిగుబడులు పడిపోతాయి. రైతుల ఆదాయం తగ్గుతుంది. అప్పులు పెరుగుతాయి. చివరకు దేశ ఆహార భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది. అందుకే వాతావరణ మార్పు అనేది కేవలం ప్రకృతి సమస్య కాదు.. అది ఆర్థిక, సామాజిక, ఆహార భద్రతకు సంబంధించిన పెద్ద సవాల్‌గా గుర్తించాలి. ఇటీవలి సంవత్సరాల్లో భారతదేశం తీవ్ర వాతావరణ వైపరీత్యాలను వరుసగా చూస్తోంది. ఒకవైపు రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మరోవైపు కొద్ది గంటల్లోనే నెల రోజుల వర్షం కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జూన్‌లో భారీ వర్షాలు, ఆగస్టు లేదా అక్టోబరులో తీవ్ర పొడి వాతావరణం వంటి అసాధారణ పరిస్థితులు సాధారణమైపోతున్నాయి. పశ్చిమ వాతావరణ కల్లోలాలు, వేడి గాలులు, ఆకస్మిక తుఫాన్లు సంప్రదాయ వాతావరణ చక్రాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ పరిస్థితుల్లో రైతులు గత అనుభవాల ఆధారంగా పంటలు వేయడం ప్రమాదకరంగా మారుతోంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం కేవలం రైతులకే పరిమితం కాదు. మార్కెట్లో ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతుంది. గోధుమలు, బియ్యం, పప్పులు, వంటనూనెల ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం కూడా అధికమవుతుంది. గతంలో గోధుమలు, కొన్ని రకాల బియ్యం, చక్కెర ఎగుమతులపై ఆంక్షలు విధించాల్సి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం దేశీయ అవసరాలను ముందుగా తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడటమే. వాతావరణ మార్పులు ఇప్పుడు భవిష్యత్ ప్రమాదం కాదు.. వర్తమాన వాస్తవం. ఒకప్పుడు ఋతువులు సమయానికి వచ్చేవి. వర్షాలు ఒక క్రమంలో కురిసేవి. రైతులు వాటిని ఆధారంగా చేసుకుని సాగు ప్రణాళికలు రూపొందించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రపంచ పరిస్థితులు కూడా భారత్‌కు కొత్త సవాళ్లు విసురు తున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు కారణంగా ఇంధనాలు, ఎరువులు, ఖనిజాల ధరలు పెరుగుతున్నాయి. ఇవి వ్యవసాయ వ్యయాన్ని మరింత పెంచుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల నిల్వలు ఉన్నప్పటికీ, రబీ సీజన్‌కు సరిపోతాయా అనే సందేహాలు ఉన్నాయి. వాతావరణ మార్పుల కారణంగా పంటలపై తెగుళ్లు పెరిగితే పురుగుమందుల అవసరం కూడా అధికమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు మాత్రమే సరిపోవు. రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటల ఎంపిక, సాగు పద్ధతులు మార్చుకోవాలి. మట్టిలో సేంద్రియ పదార్థాన్ని పెంచడం కూడా అత్యంత అవసరం. ఆవుపేడ, కంపోస్ట్, పెరటి ఎరువులు, జీవబొగ్గు వంటి సహజ వనరులను వినియోగించడం ద్వారా నేల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీంతో వర్షాలు ఆలస్యమైనా పంటలకు రక్షణ లభిస్తుంది. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో పంటల బీమా వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లోని రైతులంద రికీ బీమా రక్షణ కల్పించాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. అలాగే బహుళ పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా ఒకే పంటపై ఆధారపడే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. దేశ ఆహార భద్రతను కాపాడాలంటే ఉత్పత్తి పెరగడం మాత్రమే కాదు.. నిల్వ సామర్థ్యం కూడా పెరగాలి. ప్రస్తుతం పంట కోత తర్వాత సరైన గిడ్డంగులు లేక లక్షల టన్నుల ధాన్యం వృథా అవుతోంది. ప్రతి గ్రామం లేదా మండల స్థాయిలో ఆధునిక గిడ్డంగులు నిర్మించి, రైతుల భాగస్వామ్యంతో నిర్వహించే విధానాన్ని అమలు చేయాలి. యువ పారిశ్రామికవేత్తలను ఈ రంగంలో ప్రోత్సహిస్తే గ్రామీణ ఉపాధి పెరగడంతో పాటు ఆహార నిల్వ వ్యవస్థ కూడా బలపడుతుంది.వాతావరణ మార్పులు ఇక తాత్కాలిక సమస్య కాదు.

రాబోయే దశాబ్దాల్లో ఇవే వ్యవసాయ విధానాలను నిర్ణయించే ప్రధాన అంశంగా మారనున్నాయి. అందువల్ల ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, రైతులు, సమాజం కలిసి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి.

# నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే దీక్ష

బాల్కొండ నియోజకవర్గం, భీంగల్ ప్రజల దశాబ్దాల కల అయిన అభివృద్ధి పనులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఒకరోజు నిరాహారదీక్ష చేపట్టారు. అయితే తాను తలపెట్టిన శాంతియుత 'కఠోర నిరాహార దీక్ష'ను పోలీసు బలగాలతో అడ్డుకోవడం రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక, రాక్షస చర్య అని ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజా సమస్యల సాధన కోసం తాను అహింసా మార్గంలో నిరసన తెలియజేస్తుంటే, ప్రభుత్వం పోలీసులతో ఉక్కుపాదం మోపాలని చూడటం శోచనీయమన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరై, దాదాపు 75 శాతం పనులు పూర్తి చేసుకున్న భీంగల్ 100 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. అలాగే, భీంగల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేయాలని, మూతపడిన భీంగల్ బస్ డిపోను పునఃప్రారంభించాలని కోరారు. గత మున్సిపల్ ఎన్నికల ముందు రూ. 12 కోట్ల నిధులతో ప్రారంభించిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పెండింగ్ పనుల సాధన కోసమే 15వ తేదీన చుక్క మంచి నీరు కూడా ముట్టకుండా ఒక రోజు కఠోర నిరాహార దీక్షకు పూనుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ఎలాంటి రాస్తారోకోలు, ధర్నాలు చేయకుండా, తనకు తాను శిక్ష వేసుకుంటూ అత్యంత శాంతియుతంగా ఒకరోజు దీక్ష చేస్తానని ప్రకటిస్తే ప్రభుత్వం ఎందుకు ఉలిక్కిపడుతోందని ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. తాను ఉదయం నిద్రలేవక ముందే, కనీసం స్నానం కూడా చేయకముందే వందలాది మంది పోలీసులు తన ఇంటిని చుట్టుముట్టి తనను బయటకు వెళ్లనివ్వకుండా గృహ నిర్బంధం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీ కార్యకర్తలను ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టు చేసి జైళ్లలో పెడుతున్నారని, భీంగల్ లో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని తొలగించి, ఫ్లెక్సీలను సైతం చించేయడం ప్రభుత్వ రాక్షసత్వానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వానికి నిజంగా ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే, ఈ అభివృద్ధి పనులను నెల లేదా రెండు నెలల్లో పూర్తి చేస్తామని అధికారికంగా స్పష్టమైన హామీ ఇస్తే తాను తక్షణమే ఈ ఒక్కరోజు చేపట్టిన దీక్ష విరమిస్తానని వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. అది చేతకాక, పోలీసులతో బెదిరిస్తే భయపడేది లేదని తేల్చిచెప్పారు. ప్రజా ప్రతినిధిగా ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. తనను ఇంట్లో నిర్బంధించినా, పోలీస్ స్టేషన్ కు తరలించినా, లేదా జైల్లో పెట్టినా తన సత్యాగ్రహం, కఠోర నిరాహార దీక్ష ఎక్కడ ఉంటే అక్కడే కొనసాగుతుందని వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. భీంగల్ పట్టణ, మండల ప్రజలు, యువత, కుల సంఘాలు, వీడీసీ సభ్యులు, బాల్కొండ నియోజకవర్గ ప్రజలందరూ ఈ న్యాయమైన పోరాటానికి మరియు నిరాహార దీక్షకు మనస్ఫూర్తిగా మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తలపెట్టిన నిరాహార దీక్షను భగ్నం చేసేందుకు. ఉదయం నుంచి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను ఎక్కడికక్కడ గృహనిర్బంధాలతో పాటు అరెస్టు చేసి పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిని వేల్పూర్‌లోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

## దాల్మియా సిమెంట్ విస్తరణ..

అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను, ఆడియో విజువల్ ప్రజెంటేషన్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా అక్కడి కార్మికులతో కాసేపు ముచ్చటించి, వారితో కలిసి సెల్ఫీ దిగారు. ఆ తర్వాత పునీత్ దాల్మియాతో కలిసి భూమిపూజ నిర్వహించి, ప్లాంట్ విస్తరణ పనులకు లాంఛనంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

**ఉత్పత్తి సామర్థ్యం మూడింతలు పెంపు** దాల్మియా సిమెంట్ ప్రస్తుతం చిన్నకొమెర్లలోని ప్లాంటులో ఏటా 2.5 మిలియన్ టన్నుల క్లింకర్, 3.6 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి చేస్తోంది. తాజాగా చేపట్టిన రెండో లైన్ విస్తరణ పూర్తయితే ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. క్లింకర్ ఉత్పత్తి 6.1 మిలియన్ టన్నులకు, సిమెంట్ ఉత్పత్తి 9.6 మిలియన్ టన్నులకు చేరనుంది. ఇది ప్రస్తుత సామర్థ్యంతో పోలిస్తే దాదాపు మూడు రెట్లు అధికం. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా 1000 మందికి, పరోక్షంగా మరికొందరికి ఉపాధి లభిస్తుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీ.జీ. భరత్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి, కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జ్ సీహెచ్ భూపేష్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, దాల్మియా భారత్ లిమిటెడ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేసీ బిర్లా, నేషనల్ మాన్యుఫ్యాక్చరింగ్ హెడ్ గణేశ్ వామనరావు, ప్లాంట్ హెడ్ అర్పన్ పరేఖ్ తదితరులు హాజరయ్యారు. ఈ భారీ పెట్టుబడితో కడప జిల్లా పారిశ్రామిక రంగంలో మరింత బలోపేతం కానుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## అమరావతి 2.0 మాస్టర్ ప్లాన్...

అమరావతిని ఆర్థికంగా పరిపుష్టం చేసేలా 'క్రియేటివ్ సిటీ' నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణంతో అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. ఎల్‌నినోతో ఇబ్బందులు ఎదురైనా, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా నదికి తరలించడంతో రాజధాని ప్రాంతం జలకళను సంతరించుకుందని గుర్తుచేశారు. గ్లోబల్ బెంచ్‌మార్కింగ్ చేరుకోవడం, రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం గణనీయంగా పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ బిల్డింగ్ విధానాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పి.నారాయణ, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ

పొట్టనబెట్టుకున్నాడు. ఆ తర్వాత తనతో గొడవపడుతుందని భార్య, ఇద్దరు పిల్లలను చంపేసి, ఆపై తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ దారుణం వ్యవస్థీకృత వైఫల్యానికి నిదర్శనమని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. పోక్సో కేసుల్లో దర్యాప్తులో నిర్దిష్ట కాలపరిమితిని పాటించాలని, సాక్ష్యాధారాలు తారుమారుకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సదరు కేసులో నిందితుడికి ముందస్తు బెయిల్ లభించడం, అదే సమయంలో బాధితుల కుటుంబానికి తగిన రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమవడంపై పవన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. పోక్సో కేసులకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సుప్రీంకోర్టు గతంలో పలుమార్లు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

## జగన్‌ది రాక్షస మనస్తత్వం

పట్టిసీమ ప్రాణం పోస్తోందని చెప్పారు. కృష్ణా డెల్టాకు, రాయలసీమకు పట్టిసీమతో భద్రత కల్పించారని తెలిపారు. పోలవరం పూర్తి అయ్యేలోపు పట్టిసీమ ద్వారా నీళ్లు పంపిస్తామని చెప్పారు. పట్టిసీమను వట్టిసీమ అని మాట్లాడిన జగన్ కృష్ణానది ఒడ్డుకొచ్చి ఈరోజు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.1300 కోట్లతో నిర్మించిన పట్టిసీమ నేడు రూ.50 వేల కోట్ల ఆదాయం సృష్టించిందని తెలిపారు. పట్టిసీమ కేవలం కృష్ణాడెల్టాకు మాత్రమే పరిమితం కాదని, రాయలసీమకు సైతం నీటి భద్రత కల్పించిన పథకమని వ్యాఖ్యానించారు.

## ముద్రగడ పాడె మోసిన జగన్

ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ముద్రగడ పార్థివ దేహానికి రాజకీయ ప్రముఖులు, ప్రజలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పిస్తున్నారు. కాసేపటి క్రితం ముద్రగడ అంత్యక్రియలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముద్రగడ పాడెను జగన్, వైసీపీ కీలక నేత బొత్స సత్యనారాయణ మోశారు.

## 'అభయ' కార్యక్రమాన్ని ప్రారంభించిన అనిత

టోల్ ప్లాజా సమీపంలోని భారతి కన్వెన్షన్‌లో 'అభయ' కార్యక్రమాన్ని హోం మంత్రి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా 'అభయ' పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, 'మహిళల భద్రత - మా బాధ్యత' అంటూ అనకాపల్లి పోలీసులు మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ప్రశంసించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఎన్నో పోరాటాల వలన మహిళలకు స్వేచ్ఛ వచ్చిందని గుర్తు చేశారు. మహిళలకు ధైర్యం కల్పించడానికి 'అభయ' కార్యక్రమాన్ని పోలీసులు ప్రారంభించారని తెలిపారు. చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని మంత్రి అనిత అభిప్రాయపడ్డారు. శక్తి యాప్, శక్తి టీమ్స్ ద్వారా మహిళలకు రక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. పిల్లలను తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని... కష్టపడి చదువుకొని, ఉన్నత స్థాయికి వెళ్ళాలని ఈ సందర్భంగా పిల్లలకు ఆమె సూచించారు. ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని అనిత సూచించారు. ఎవరైనా మిమ్మల్ని ఇబ్బంది పెడితే తక్షణమే 112కి కాల్ చేయాలని అన్నారు. చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని వివరించారు. బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకండి అంటూ పిల్లలకు హితవు పలికారు. ప్రతి పాఠశాల, కళాశాలల్లో కూడా అభయ ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

## అమెరికాలో టైమ్ సవరణ విధానానికి చెక్ బిల్లును ఆమోదించిన ప్రతినిధుల సభ

ఏటా రెండుసార్లు గడియారాల్లో సమయాన్ని మార్చే విధానానికి స్వస్తి పలికేందుకు అమెరికా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. 'డేలైట్ సేవింగ్ టైమ్'ను ఏడాది పొడవునా శాశ్వతం చేయడం కోసం ప్రవేశపెట్టిన 'సన్‌÷న్ ప్రొటెక్షన్ యాక్ట్' బిల్లుకు అక్కడి ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. ప్రతినిధుల సభలో మంగళవారం జరిగిన ఓటింగ్‌లో 308-117 ఓట్ల భారీ మెజారిటీతో ఈ బిల్లు ఆమోదం పొందింది. ప్రతినిధుల సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు అధ్యక్షుడు సంతకం చేస్తే అధికారిక చట్టంగా మారుతుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ బిల్లుకు పూర్తి మద్దతు ప్రకటించారు. తాను అధికారంలోకి వస్తే ఈ గడియారాలు మార్చే విధానాన్ని ముగిస్తానని గతంలోనే ఆయన హామీ ఇచ్చారు. ఈ చట్టం వల్ల ప్రజలకు సాయంత్రం పూట ఎక్కువ సమయం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ ఈ బిల్లుపై అతి త్వరలో సంతకం చేయనున్నారు. సూర్యుడు త్వరగా ఉదయించే వేసవి నెలల్లో.. ఉదయం 4 నుంచి 5 గంటలకే ఎండ వచ్చేస్తుంది. ఆ సమయంలో చాలామంది నిద్రపోతుంటారు. చాలా వరకు సమయం నిద్రలోనే వృధా అవుతుంది. గడియారాన్ని ఒక గంట ముందుకు జరపడం వల్ల.. సాయంత్రం పూట సహజమైన సూర్యకాంతిని ఎక్కువ సమయం ఉపయోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. అమెరికా, కెనడా, బ్రిటన్, ఐరోపా దేశాలతో పాటు దాదాపు 70కి పైగా దేశాలు ఈ విధానాన్ని పాటిస్తున్నాయి. అమెరికన్లు వేసవి కాలంలో గడియారాలను ఒక గంట ముందుకు జరుపుతారు. దీన్నే 'స్ప్రింగ్ ఫార్వర్డ్' అంటారు. శీతాకాలంలో మళ్లీ ఒక గంట వెనక్కి జరుపుతారు. దీన్నే 'ఫాల్ బ్యాక్' అంటారు. ఇలా సమయాన్ని మార్చే విధానాన్ని పూర్తిగా ఆపేసి.. ఏడాది పొడవునా ఒకే టైమ్ ఉంచాలనే ఉద్దేశంతోనే అమెరికా ప్రభుత్వం కొత్త బిల్లును తీసుకువచ్చింది.

# దాల్మియా భారత్ విస్తరణతో కడప పారిశ్రామిక రంగానికి స్వర్ణయుగం..!





**పరిశ్రమల శాఖామంత్రి మంత్రి టి.జి. భరత్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సీఎంఆదినారాయణ రెడ్డి**

**చంద్రబాబు దూరదృష్టి, లోకేష్ చొరవతో భారీ పెట్టుబడులు వస్తున్నాయి**

**దాల్మియా ప్రాజెక్టుతో వేలాది మందికి ఉపాధి**

**కడప, జూలై 15:** కడప జిల్లాలో దాల్మియా భారత్ సిమెంట్ రెండో ఉత్పత్తి విభాగం ఏర్పాటుతో పారిశ్రామికాభివృద్ధికి కొత్త అధ్యాయం ప్రారంభమైందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టి.జి. భరత్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డిలు సంయుక్తంగా పేర్కొన్నారు. బుధవారం జమ్మలమడుగు నియోజకవర్గం, మైలవరం మండలం చిన్నకొమర్లలో నిర్వహించిన దాల్మియా భారత్ 2వ యూనిట్ విస్తరణ పనుల శంఖుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ప్రసంగించారు. జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, పరిశ్రమలకు అనుకూల విధానాలు, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నిరంతర సమీక్షలు, పెట్టుబడిదారులకు అందిస్తున్న పూర్తి సహకారం వల్లే ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు అత్యంత విశ్వసనీయ గమ్యస్థానంగా మారిందని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వేగంగా మంజూరు చేయడం, ప్రతి ప్రాజెక్టును ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపు తీసుకొచ్చిందన్నారు. కడప జిల్లాలోని అపారమైన సున్నపురాయి నిల్వలను సద్వినియోగం చేసుకుంటూ దాల్మియా భారత్ రూ.3,100 కోట్లతో భారీ విస్తరణ చేపట్టడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు అనుబంధ పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి టిజి భరత్ మాట్లాడుతూ... దేశంలోని ప్రముఖ సిమెంట్ సంస్థల్లో దాల్మియా భారత్ ఒకటిగా నిలిచిందని, ప్రస్తుతం 12 రాష్ట్రాల్లో 19 అత్యాధునిక తయారీ కేంద్రాలతో 5.47 కోట్ల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి దేశంలో నాలుగో అతిపెద్ద సిమెంట్ తయారీ సంస్థగా కొనసాగుతోందని వివరించారు. ఈ విస్తరణ పూర్తయిన తర్వాత కడపలోనే సంస్థకు దేశంలో అతిపెద్ద సమీకృత సిమెంట్ ఉత్పత్తి కేంద్రం ఏర్పడుతుందని తెలిపారు.పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ తక్కువ కార్బన్ ఉద్గారాలతో ఉత్పత్తి, పునరుత్పాదక ఇంధన వినియోగం, సుస్థిర పారిశ్రామికాభివృద్ధి దిశగా దాల్మియా భారత్ ముందంజలో ఉందని కొనియాడారు. 2040 నాటికి కార్బన్-నెగటివ్ సంస్థగా ఎదగాలనే లక్ష్యంతో సంస్థ పనిచేస్తుండటం అభినందనీయమన్నారు. సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా దాల్మియా భారత్ ఫౌండేషన్ ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉపాధి అవకాశాలు, మహిళల సాధికారత, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతోందని తెలిపారు. దేశవ్యాప్తంగా వేలాది మంది యువతకు శిక్షణ అందించడంతో పాటు గ్రామాల సమగ్రాభివృద్ధికి సంస్థ చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ... జమ్మలమడుగు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం దిశగా దాల్మియా విస్తరణ ప్రాజెక్టు కీలక అడుగని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మంత్రి నారా లోకేష్ చొరవతో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో కొత్త శకానికి నాంది పలుకుతోందని, కడప జిల్లా ఆ అభివృద్ధిలో కీలక కేంద్రంగా అవతరిస్తోందని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి పేర్కొన్నారు.

## ప్యాపిలి మండల బీజేపీ అధ్యక్షుడిగా మూడోసారి కే.బీ. దామోదర్ నాయుడు ఏకగ్రీవం

**నందిపత్రిక -ప్యాపిలి** మండల పరిధిలోని చంద్రపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ నాయకుడు కే.బీ. దామోదర్ నాయుడు భారతీయ జనతా పార్టీ ప్యాపిలి మండల అధ్యక్షుడిగా వరుసగా మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నంద్యాల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమగ్ర సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది.నంద్యాల బీజేపీ జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో దామోదర్ నాయుడు అందించిన సేవలు, పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతను గుర్తించి, కార్యకర్తలు అధిష్ఠానం ఆయనను మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.పార్టీ బలోపేతమే నా లక్ష్యం:



దామోదర్ నాయుడుఈ సందర్భంగా కే.బీ. దామోదర్ నాయుడు మాట్లాడుతూ... తనపై నమ్మకంతో మూడోసారి మండల అధ్యక్ష పదవిని అప్పగించిన జిల్లా నాయకత్వానికి, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "మండలంలోని ప్రతి గ్రామంలోనూ నిత్యం పర్యటిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. అధికార, ప్రతిపక్ష పార్టీలకు దీటుగా ప్యాపిలి మండలంలో బీజేపీని ఒక ఉన్నత స్థాయికి తీసుకెళ్తాం.నన్ను నమ్మి అప్పగించిన బాధ్యతను వమ్ము చేయకుండా, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటాను. అంతేకాకుండా,రాబోయే 2029 నాటికి మండలంలోని ప్రతి గ్రామంలోనూ భారతీయ జనతా పార్టీ జెండాను రెపరెపలాడించడమే లక్ష్యంగా, పార్టీ బలోపేతం కోసం కీలక పాత్ర పోషిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్‌తో జిల్లాను పచ్చని వనంగా తీర్చిదిద్దాలి






**విద్యాసంస్థల్లో పచ్చదనం పెంపే లక్ష్యంగా నెట్ జీరో హెల్తీ క్యాంపస్ కార్యక్రమం**

**పాఠశాలల రూపురేఖలు మార్చేలా పచ్చదనం విస్తరణకు సమిష్టి కృషి అవసరం**

**56 విద్యాసంస్థల్లో అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ అమలు**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, జూలై 15(నంది పత్రిక):-** జిల్లాలో పచ్చదనం పెంపుదలకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విద్యాసంస్థలను పర్యావరణహిత ప్రాంగణాలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. బుధవారం నంద్యాల పట్టణంలోని మానవ వనరుల అభివృద్ధి శిక్షణా కేంద్రంలో "నెట్ జీరో హెల్తీ క్యాంపస్ ఎకాలజీ అండ్ ప్లాంటేషన్" (అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్) కార్యక్రమం అమలు, కార్యాచరణ ప్రణాళికపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమం ద్వారా విద్యాసంస్థల్లో పచ్చదనాన్ని గణనీయంగా పెంచడంతో పాటు విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే అన్ని శాఖల అధికారులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనకాపల్లి జిల్లా పర్యటన సందర్భంగా ఒక పాఠశాలలో అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ ద్వారా నెలకొల్పిన పచ్చదనాన్ని పరిశీలించి ప్రశంసించారని, అదే నమూనాను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని విద్యాసంస్థలను కూడా పచ్చని వాతావరణంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దే దిశగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. మొదటి విడతలో జిల్లాలోని సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ విద్యాసంస్థలు, మోడల్ స్కూల్స్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు), మహాత్మా జ్యోతిబా ఫూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల విద్యాలయాలు సహా మొత్తం 56 విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సంస్థ ప్రతినిధులు ఆయా విద్యాసంస్థలను సందర్శించి కార్యాచరణ చేపడతారని, వారికి అవసరమైన స్థలం, నీటి వసతి, సాంకేతిక సహకారం తదితర అంశాల్లో సంబంధిత అధికారులు, ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు పూర్తి సహకారం అందించాలని సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి విద్యాసంస్థలో పచ్చదనం శాశ్వతంగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యాసంస్థల్లో పచ్చదనం పెరగడం ద్వారా ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం ఏర్పడటంతో పాటు పర్యావరణ సమతుల్యతకు దోహదపడుతుందని, భవిష్యత్ తరాల్లో ప్రకృతి పరిరక్షణపై బాధ్యతాయుతమైన దృక్పథం పెంపొందుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యనారాయణమూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి శివారెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లలితాబాయి, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ కోఆర్డినేటర్ అంకిత, మోడల్ స్కూల్స్, కేజీబీవీల ప్రధానోపాధ్యాయులు, ఎస్సీ, బీసీ, గిరిజన సంక్షేమ శాఖల వార్డెన్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అమెరికాలో ట్రంప్ చిత్రంతో కొత్త డాలర్ నాణెం

అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం 250వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రంతో కొత్త ఒక డాలర్ (వ1) నాణేన్ని ముద్రించనున్నట్లు యునైటెడ్ స్టేట్స్ మింట్ ప్రకటించింది. ఈ విషయాన్ని ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ బుధవారం వెల్లడించారు. ఈ నాణేనికి ఒకవైపు ట్రంప్ చిత్రం ఉండగా, దానిపై "లిబర్టీ", దిగువన "1776-2026" అనే సంవత్సరాలను ముద్రించారు. చిత్రానికి పక్కన "ఇన్ గాడ్ వుయ్ ట్రస్ట్" అని వాక్యం ఉంటుంది. నాణేనికి రెండో వైపు రెక్కలు విప్పిన గద్ద, దాని మధ్యలో 250వ సంఖ్యతో కూడిన రక్షణ కవచం (షీల్డ్) ఉంటుంది. దానిపై "యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా", "వన్ డాలర్" అనే అక్షరాలు ఉంటాయి. ఈ సందర్భంగా స్కాట్ బెస్సెంట్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, "అమెరికా 250 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల వేళ, స్వేచ్ఛకు, దేశభక్తికి చిహ్నంగా ఈ కొత్త బంగార

## స్వయంభూ శ్రీ పుష్పాచలేశ్వర స్వామి తృతీయ సాక్షాత్కార సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి

**అంబాబత్తుల అండకొండరాముడు - దేవస్థానం పునః ప్రారంభకులు, కార్యనిర్వహకులు, అర్చకుడు**



**నంది పత్రిక ఖాజీపేట ప్రతినిధి జూలై 15** వైస్సార్ కడప జిల్లా వల్లూరు మండలం కొట్లూరు పంచాయతీ లోని పుష్పాచలం కొండపై వెలిసిన స్వయంభూ శ్రీ పుష్పాచలేశ్వర స్వామి దేవస్థానం నీ కాకతీయ కాలంనాటి చరిత్ర కలిగిన దేవస్థానం, కాలక్రమేనా శిదిలావస్థకి చేరి దుండిగల చేత ధ్వంసం అయినా దేవస్థానం అయితే 2023 వ సంవత్సరం మే 1 న దేవస్థానం అంబా బత్తుల అండకొండరాముడు చే పునః ప్రారంభించబడినది.2023 జ్యేష్ఠ అమావాస్య రోజు అంబాబత్తుల అండకొండరాముడు కి లింగ రూపంలో శ్రీ పుష్పాచలేశ్వర స్వామి దర్శనం ఇవ్వడం జరిగింది . ఆ యొక్క మధుర ఘట్టాన్ని ప్రతి సంవత్సరం జ్యేష్ఠ అమావాస్య రోజున సాక్షాత్కార సంబరాలు నిర్వహిస్తూ రావడం ఒక ఆనవాయితీగా ఏర్పడింది. శ్రీ పరాభవ నామ సంవత్సరం నిజ జ్యేష్ఠ బహుళ అమావాస్య రోజున తృతీయ వార్షికోత్సవ సాక్షాత్కార సంబరాలలో స్వామివారికి భస్మాభిషేకం, విశేష పూజలు, పంచామృత అభిషేకాలు, అర్చనలు జరిగాయి వచ్చిన భక్తాదులు స్వామివారికి కాయ కర్పూరం సమర్పించారు. శ్రీరామరాజ్యం హిందుత్వ చైతన్య వేదిక ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన కొండ క్రింద అన్నదానం లో పుష్పాచల కొండ చుట్టూ ఉన్న భక్తాదులు పాల్గొని స్వామివారి మహా 500 మంది పైగా మహా నైవేద్యాన్ని స్వీకరించారు. కొట్లూరు పంచాయితీ సర్పంచ్ తెలిదల హేమలత గారి తండ్రి పుల్లయ్య, వల్లూరు మండలం తెలుగుదేశం నాయకులు లేపాక నాగేశ్వర్ రెడ్డి గారు , గ్రామ పెద్దలు, భక్తాదులు తదితరులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు అని స్వయంభూ శ్రీ పుష్పాచలేశ్వర స్వామి దేవస్థానం పునః ప్రారంభకులు, కార్యనిర్వహకులు , అర్చకుడు అంబాబత్తుల అండకొండరాముడు, శ్రీమతి శ్యామలాదేవి, కిషోర్ యాదవ్, అబ్బాయిగారు వెంకట సాయి, శ్రీరామరాజ్యం హిందుత్వ చైతన్య వేదిక ట్రస్ట్ బృందం విశేష సేవలందించారని తెలిపారు

## సిద్ధవటం మండలం మాధవరం -1 వెలసిన శ్రీ శీతల గంగమ్మ తల్లి అమ్మవారి 23వ జాతర వార్షికోత్సవ వేడుకలు...



**సిద్ధవటం, జూలై 15, కడప జిల్లా.** శ్రీ శీతల గంగమ్మ తల్లి 23వ జాతర వార్షికోత్సవ వేడుకలు ఈనెల 29,30 తేదీలలో ఘనంగా జరగనున్నాయి. మాధవరం -1 పంచాయితీ ఎస్ కే ఆర్ నగర్ కు చెందిన స్త్రీ భద్రావతి భవనారాయణ చేనేత సంఘ సొసైటీ సభ్యులు టిడిపి జోనల్ కో-ఆర్డినేటర్ రెడ్డప్ప గారి శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రెడ్డప్ప మాధవి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా జాతర వార్షికోత్సవ వేడుకలకు కుటుంబ సమేతంగా హాజరై శ్రీ శీతల గంగమ్మ తల్లి ఆశీస్సులు పొందాలని వారు కోరారు. ఆహ్వాని స్వీకరించిన రెడ్డప్ప వారి కుటుంబ సభ్యులు జాతర విజయవంతంగా జరగాలని ఆకాంక్షిస్తూ. భద్రావతి భవనారాయణ చేనేత సంఘ సొసైటీ సభ్యుల పిలుపుమేరకు వేడుకలకు హాజరవుతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జొన్నాదుల శ్రీనివాసులు, చేపూరి నర్సింహులు, బిట్టా రాజేంద్ర, జింక శ్రీనివాసులు,....

## కాపు, దళితుల ఐక్యత కృషి చేసిన మహోన్నతుడు ముద్రగడ పద్మనాభం...




**నంది ప్రతినిధి, జూలై 15, కడప జిల్లా.** ముద్రగడ పద్మనాభం నాకు మంచి మిత్రులు చాలా కాలం నుంచి ఆయనతో నాకు అనుబంధం ఉంది. కాపు సామాజిక వర్గానికి పెద్దదిక్కుగా నిలిచి, అలుపెరగని పోరాటం చేశారు. నమ్మిన మాటకు కట్టుబడి, నిబద్ధతతో పనిచేసే స్వభావశీ ఆయన సొంతం. రాష్ట్రంలో ఉన్న దళిత నాయకులు మరియు కాపు నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులకు తానే స్వయంగా ఫోన్ లిఫ్ట్ చేసి ఆహ్వానించారు. రాష్ట్ర చరిత్రలు చిరస్థాయిగా నిలిచిపోయి సభ కిర్లంపూడి లో ముద్రగడ పద్మనాభం నిర్వహించారు. అలాగే అంబేద్కర్ గారిని ఆహ్వానించి మరో సభ ఏర్పాటు చేశారు ఈ సభకు హాజరయ్యాను కాపు, దళితుల ఐక్యత గురించి ప్రసంగించారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాలని ముద్రగడ్డ ఆత్మకు శాంతి చేకూర్చాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. కడప వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ మేయర్ పాక సురేష్, మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, ఏ వన్ అంబులెన్స్ అధినేత నాగరాజు, పులి సునీల్ కుమార్, వార్డ్ మెంబర్ రామకృష్ణారెడ్డి, మహిళా సంఘాల కార్యకర్తలు ముద్రగడ పద్మనాభం ప్రగాఢ సంతాపం తెలియజేశారు

## శివయ్య కోనలో అపరిశుభ్రత తొలగింపు.

**ఇంచార్జ్ ఎండోమెంట్ ఈవో సురేష్ కుమార్ రెడ్డి...**

**సిద్ధవటం మండలం, జూన్ 15, నంది ప్రతినిధి,** కడప జిల్లా. లంక మల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపుజేశ్వర కోనలో పంచలింగాల గుడి వద్ద అపరిశుభ్రత తొలగింపు చేపట్టామని. ఇంచార్జ్ ఎండోమెంట్ ఈవో సురేష్ కుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని వశీ తాటి పల్లె గ్రామం లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజేశ్వర కోన పంచలింగాల గుడి సమీపాన ఉన్న పారిశుద్ద్యం తొలగింపు చేపట్టి బ్లీచింగ్ పిచికారి చేశామన్నారు. వన్యప్రాణుల మనుగడ కోసం పారిశుద్ధాన్ని తొలగించామన్నారు ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ సిబ్బంది చంద్ర పాల్గొన్నారు



# ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం





### యువత ఉపాధి -సృజనాత్మకత నైపుణలపై ఆధారపడి ఉంది. శ్రీ వి . శ్రీకాంత్ రెడ్డి స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్.

**నంద్యాల సిటీ బ్యూరో జులై 15 ( నంది పత్రిక )** ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా శ్రీ రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో వివిధ విభాగల ఆధ్వర్యంలో కళాశాలలోని డిగ్రీ విద్యార్థిని/విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ డాక్టర్ +. రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన వి. శ్రీకాంత్ రెడ్డి జిల్లా స్కిల్స్ డెవలప్మెంట్ అధికారి , పి. సోమశివ రెడ్డి జిల్లా ఎంప్లాయిమెంట్ స్కిన్ డెవలప్మెంట్ ఆఫీసర్ విచ్చేశారు. ఈ సందర్భంగా యువతి, యువకులకు ఉద్యోగ/ ఉపాధి, మంచి పని, మరియు వ్యాపార రంగాలలో రాణించడానికి అవసరమైన నైపుణ్యాల పైన కళాశాల విద్యార్థులకు అవగాహన కలిగిస్తూ తమ ప్రసంగంలో వి. శ్రీకాంత్ రెడ్డి వివరించారు. వారు ఇంకా విద్యార్థులను ఉద్దేశించి అవగాహన కలిగిస్తూ తమ ప్రసంగంలో తెలియజేశారు. నేటి ఆధునిక యుగములో యువతలో సాంకేతికత, వృత్తి, విద్య నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. మారుతున్న ఆర్థిక వ్యవస్థకు అనుకూలంగా యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యంలను చక్కగా ఏర్పరచుకొని జీవితంలో స్థిరపడాలని సూచించారు. మరొక ముఖ్య అతిథి పి. సోమశివ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత కెరియర్ పరంగా రాణించడానికి మంచి ఉద్యోగ/ ఉపాధి అవకాశాలు సాధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశాలు కల్పిస్తున్నాయి. కాబట్టి విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి అని చెప్పారు, కానీ కష్టపడితే ఏదైనా సాధించవచ్చు అని అవగాహన కలిగిస్తూ విద్యార్థులు అడిగిన అనేక సందేహాలకు నివృత్తి చేస్తూ తమ ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత కెరియర్ పరంగా రాణించడానికి మంచి ఉద్యోగ/ ఉపాధి అవకాశాలు సాధించడానికి ముఖ్యంగా రెండు వ్యక్తిగత నైపుణ్యాలు ఏర్పరచుకోవడానికి అనేక అవకాశాలు తమ కళాశాలలో కల్పిస్తున్నామని అందులో భాగంగానే కళాశాలలో విద్యార్థిని/ విద్యార్థుల కోసం డిగ్రీ తో పాటు అదనంగా స్కిల్ డెవలప్మెంట్ సర్టిఫికెట్ కోర్సులు పై ఆన్లైన్ , ఆఫ్లైన్ ద్వారా శిక్షణ అందిస్తున్నాము అన్నారు . ఇలాంటి కార్యక్రమాల వల్ల కూడా స్ఫూర్తిని పొంది నాయకత్వ లక్షణాలతో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే విధంగా విద్యార్థులు ప్రయత్నం చేయాలి. కళాశాల డిన్ . ప్రగతి రెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ లైఫ్ పుణ్యాలు మరియు గ్రీన్ స్కిల్స్ నైపుణ్యాలు నేర్చుకోవడం పై ప్రత్యేక దృష్టి దిష్టితో తమ జీవితాలను చక్కదిద్దుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కేబీవి సుబ్బయ్య మాట్లాడుతూ ప్రపంచ యువజన స్కిల్స్ దినోత్సవ సందర్భంగా ఈ స్కిల్స్ జూలై 15 2014 సంవత్సరంలో పార్లమెంట్లో ఆమోదంపొంది జూలై 15 2015 నుండి అమలు చేస్తున్నారు, ప్రస్తుతం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పట్ల విద్యార్థులు అవగాహన ఏర్పరచుకొని స్ఫూర్తిని పొందాలని అన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన వి. శ్రీకాంత్ రెడ్డి జిల్లా స్కిల్స్ డెవలప్మెంట్ అధికారీ పి. సోమశివ రెడ్డి జిల్లా ఎంప్లాయిమెంట్ స్కిన్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఇరువురిని కళాశాల యాజమాన్యం వారు శాలువా మెమెంటో తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ అధిపతి డాక్టర్ యు వి ఎస్ కుమార్, తెలుగు విభాగం అధినేత్రి డాక్టర్ లలితా సరస్వతి, ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ అధినేత్రి ా. హిమబిందు, కామర్స్ డిపార్ట్మెంట్ అధిపతి డాక్టర్ డి.పుల్లయ్య, బాటని అధిపతి మురళి మోహన్, విజయ్ కాంత్, సత్యనారాయణ, మస్తాన్, శేఖర్, బాలచంద్రుడు, ప్రెస్ రిపోర్టర్స్ మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు, జాతీయ గీతంతో కార్యక్రమము ముగిసింది.

# ఎస్పీని కలిసిన ఏఎస్పీ

**నంద్యాల క్రైం, జూలై15(నంది పత్రిక):-** ఏలూరు జిల్లా జగ్గారెడ్డిగూడెం ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సుస్మిత రామనాథన్ సాధారణ బదిలీలలో భాగంగా నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీగా నియామకం కావడం జరిగింది. నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ను జిల్లా పోలీస్ కార్యాలయంలో పుష్పగుచ్ఛంతో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.



# నంద్యాలలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

### జూలై 18,19వ తేదీలలో

### వేదిక: ఎస్ బి ఐ కాలనీ లో ఉన్న రామకృష్ణ పిజి కళాశాల



**నంద్యాల సిటీ బ్యూరో జులై 15 ( నంది పత్రిక )** ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, నంద్యాల జిల్లా సంఘం నిర్వహణలో ఈనెల 18, 19వ తేదీలలో నంద్యాల ఎస్బిఐ కాలనీలో ఉన్న రామకృష్ణ పిజి కళాశాలలో రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నామని నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ, కార్యదర్శి రామ సుబ్బా రెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. రాష్ట్రం లోని అన్ని జిల్లాల నుండి ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటున్నారు. నంద్యాలలో జరుగుతున్న సీనియర్ చెస్ పోటీలలో విజేతలుగా నిలిచిన వారు జాతీయ స్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొంటారు. నంద్యాలలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ పోటీలలో,ఆసక్తి ఉన్న చెస్ క్రీడాకారులు పాల్గొనాలని ఆహ్వానించారు. ఏపీ చెస్ వెబ్సైట్ ద్వారా క్రీడాకారులు ఈనెల 17 వ తేదీ సాయంత్రం లోపు ఎంట్రీలు నమోదు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు 9010451585 నెంబర్ ను సంప్రదించాలి.

# నంద్యాల పట్టణంలో ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన




### నంది పత్రిక ఎఫెక్ట్.

**నంద్యాల సిటీ బ్యూరో జులై 15 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ స్మశాన వాటిక రోడ్లు, డ్రైనేజీ కల్వర్ట్, టెక్కే నుంచి స్టేట్ బ్యాంక్ కాలనీకి వెళ్లే రహదారి, సమత విద్యానికేతన్ పరిసరాల్లో నెలకొన్న డ్రైనేజీ , రోడ్ల సమస్యలను నంద్యాల మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న , రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్.ఎం.డి. ఫయాజ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెండు రోజుల క్రితం "నంది పత్రిక" లో మురుగు జలపాతం చూడండి అనే వార్త ప్రచురించడంతో టీడీపీ నాయకులు,మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈ సమస్యలను స్థానిక ప్రజలు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు, సామాజిక మాధ్యమాలు, మీడియా ద్వారా కూడా ప్రస్తావించగా, వాటిపై తక్షణ స్పందనగా అధికారులు, ప్రజాప్రతినిధులు స్వయంగా ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల సమస్యలను ఓర్పుగా విన్న అధికారులు, అవసరమైన చర్యలు తీసుకుని రోడ్లు, డ్రైనేజీ మరియు కల్వర్ట్ పనులను వీలైనంత త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మానియార్ ఖలీల్ వార్డు ఇన్చార్జ్ మధు సాయి , పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక వార్డు ప్రజలు పాల్గొన్నారు.





# విద్యార్థులకు ఉపాధి అవకాశాలు



**నంద్యాల సిటీ బ్యూరో జులై 15 ( నంది పత్రిక )** నంద్యాలలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు శ్రీ రామకృష్ణ విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి తెలిపారు ఈ నెల 17 శుక్రవారం ఉదయం 9:30లిబి గంటలకు శ్రీ స్వామి వివేకానంద ఆడిటోరియంలో ముత్తూట్ మైక్రోఫిన్ లిమిటెడ్ వారి చే క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ బిలిడాక్టర్ జి. రామకృష్ణ రెడ్డి బి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్లేస్మెంట్ డ్రైవ్లో ఇంటర్మీడియట్ (12వ తరగతి ఉత్తీర్ణులు) మరియు ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చు. 18 నుండి 30 సంవత్సరాల వయస్సు గల పురుషులు, మహిళలు, ఫ్రెషర్స్ మరియు అనుభవం ఉన్న అభ్యర్థులు అందరూ అర్హులు.

**ఉద్యోగ వివరాలు:** అర్హత: ఇంటర్మీడియట్ / ఏదైనా డిగ్రీ వయస్సు: 1830 సంవత్సరాలు జీతం: నెలకు 19,000 ఇతర ప్రయోజనాలు: ఫ్యూయల్ అలవెన్స్, ఆకర్షణీయమైన ఇన్సెంటివ్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ఉద్యోగ ప్రాంతాలు: నంద్యాల, గిద్దలూరు, నందికొట్కూరు, వెల్దుర్తి, గూడూరు, కోవూరు మరియు కావలి

**మొత్తం ఖాళీలు: 30** అభ్యర్థులకు సొంత ద్విచక్ర వాహనం మరియు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ లేదా లెర్నర్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హతల సర్టిఫికెట్లు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, డ్రైవింగ్ లైసెన్స్/ఎల్ఎల్ఆర్తో ఉదయం 9:30 గంటలకే వేదిక వద్ద హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.బి.వి. సుబ్బయ్య , ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ యు.వి.ఎస్. కుమార్, సంపత్ కుమార్ లు మాట్లాడుతూ అర్హత కలిగిన విద్యార్థులు , ఉద్యోగార్థులు ఈ అరుదైన ఉపాధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# విలీన గ్రామాల అభివృద్ధిలో జాప్యానికి తావివ్వొద్దు





### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశం
### పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే చేపట్టండి
### 36వ వార్డు పరిధిలో విస్తృత పర్యటన

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో విలీనమైన గ్రామాల్లో అభివృద్ధి పనులను ముమ్మరం చేయాలని, ఎలాంటి జాప్యానికి తావివ్వొద్దని కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులకు స్పష్టం చేశారు. బుధవారం ఆయన 36వ వార్డులోని పెద్దపాడు, ఏ.నాగులపురం, రాజీవ్ గృహకల్ప ప్రాంతాల్లో అధికారులు, స్థానిక నాయకులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. సాధారణ నిధులతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా చేపట్టనున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అత్యవసరంగా చేపట్టాల్సిన రహదారులు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. వీధి విద్యుత్ దీపాలను వెంటనే ఏర్పాటు చేయడంతో పాటు, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల మార్పు కోసం విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఉన్న సమస్యలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని పేర్కొన్నారు. అలాగే పారిశుద్ధ్య సిబ్బంది ఖాళీల భర్తీ, వీధి శునకాల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అంతకుముందు రైల్వే స్టేషన్ రోడ్, అశోక్ నగర్, వెంకటరమణ కాలనీ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, డ్రైనేజీ నిర్వహణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. విలీన గ్రామాల్లో ముందుగా మౌలిక వసతుల కల్పనకే ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన రహదారులు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి విద్యుత్ దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యానికి ఆస్కారం ఉండకూడదన్నారు. ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని సానుకూలంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పర్యటనలో ఎంఈ గిరిరాజ్, డిఈఈ శ్రీనివాసన్, ఏఈలు ప్రవీణ్ కుమార్ రెడ్డి, జనార్ధన్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, సానిటరీ ఇన్స్పెక్టర్ ఆలీం బాష, స్థానిక నాయకులు ఆర్.లోకేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, పరమేష్ రెడ్డి, ప్రవీణ్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



# అంగన్వాడి కేంద్రానికి అమ్మ-నాన్న ఫౌండేషన్ చేయూత

**మద్రిపాడు జులై 15నంది పత్రిక :** డి.సి.పల్లి గ్రామానికి చెందిన అమ్మ-నాన్న పౌండేషన్ వ్యవస్థాపకులు చింతలపల్లి మధుసూదన శాస్త్రి గ్రామంలోని అంగన్వాడి కేంద్ర అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలను అందించి అభినందనలు అందుకున్నారు.అంగన్వాడి కేంద్రాన్ని చిన్నారులను ఆకట్టుకునేలా,విద్యాభివృద్ధికి అనుకూలంగా తీర్చిదిద్దే లక్ష్యంతో భవన గోడలపై రంగురంగుల చిత్రాలు,విద్యాపరమైన పెయింటింగ్స్ వేయించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.అలాగే చిన్నారుల రక్షణ కోసం వరండాకు గ్రిల్స్ ఏర్పాటు చేయించి,వారి కోసం ఆట వస్తువులు,కుర్చీలు,ఇతర క్రీడా,వినోద పరికరాలు మరియు విద్యా సామగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి నాగేశ్వర వరప్రసాద్ మాట్లాడుతూ,చిన్నారుల సమగ్ర అభివృద్ధి కోసం మధుసూదన శాస్త్రి అందించిన సహాయం అభినందనీయమని పేర్కొన్నారు.విద్యతో పాటు చిన్నారుల సృజనాత్మకత,ఆటపాటల అభివృద్ధికి ఉపయోగపడే వాతావరణాన్ని కల్పించడం ద్వారా ఆయన సమాజానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.గ్రామాభివృద్ధి,విద్యాభివృద్ధి కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు.దాత మధుసూదన శాస్త్రి మాట్లాడుతూ తన తండ్రి స్వర్గీయ చింతలపల్లి లక్ష్మీనరసయ్య శాస్త్రి జ్ఞాపకార్థం,తన తల్లి నాగమణి ఆధ్వర్యంలో అమ్మ-నాన్న ఫౌండేషన్ ను ఏర్పాటు చేశామని,ఈ ఫౌండేషన్ ద్వారా విద్య,సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి తిరుపతయ్య,సీడీపీఓ శర్మిష్ఠ,అంగన్వాడి సూపర్వైజర్ నారాయణమ్మ,విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి జొన్నా సత్యనారాయణ,పంచాయతీ కార్యదర్శి మహేంద్ర,కలిశెట్టి రాజేంద్ర కుమార్,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి,డి.సి.పల్లి ఎస్సీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్,అంగన్వాడి కార్యకర్త సుజాత,ఆయా రత్నమ్మ,మధుసూధన శాస్త్రి సతీమణి వాణి,గ్రామ పెద్దలు,విద్యార్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# నేటి నుండి కర్నూలు నగర పాలకలో
# ‘ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) మేళా’

**ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులకు ప్రత్యేక పరిష్కారం**

**కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



నంది పత్రిక కర్నూలు బ్యూరో : కర్నూలు నగర పరిధిలో అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్)కు దరఖాస్తు చేసుకుని ప్రక్రియ పూర్తి చేసుకొని దరఖాస్తుదారుల కోసం గురువారం నుంచి ఎల్ఆర్ఎస్ మేళా నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో గురువారం నుంచి శనివారం వరకు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.మొత్తం 2,899 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు అందగా, వాటిలో 1,293 దరఖాస్తులు ఆమోదం పొందినట్లు తెలిపారు. మిగిలిన వాటిలో 448 దరఖాస్తులకు షార్ట్‌ఫాల్ ఇంటిమేషన్, 532 దరఖాస్తులకు ఫీజు చెల్లింపు ఇంటిమేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు రూ.24.10.36 కోట్ల ఫీజు వసూలైనట్లు తెలిపారు.ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు సంబంధించిన షార్ట్‌ఫాల్ పత్రాలు, ఫీజు ఇంటిమేషన్, ఫీజు చెల్లింపులు, ఆమోద ఉత్తర్వులు తదితర సమస్యలను ఒకేచోట పరిష్కరించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకుని ఫీజు చెల్లింపులు లేదా అవసరమైన పత్రాల సమర్పణలో పెండింగ్‌లో ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. పట్టణ ప్రణాళిక అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులు, ఎల్‌టీపీల సహాయంతో అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించుకుని ఆమోద ఉత్తర్వులు పొందవచ్చన్నారు.అర్హులైన ప్రతి దరఖాస్తుదారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఆస్తులకు పూర్తి చట్టబద్ధత కల్పించుకోవాలని కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు.

# దాల్మియా విస్తరణ జిల్లా అభివృద్ధికి ఓ కీలక ఘట్టం..!!

**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

కడప, బ్యూరో చీఫ్ జూలై 15 నంది పత్రిక దాల్మియా భారత్ సిమెంట్ విస్తరణ ప్రాజెక్టు ప్రారంభం జిల్లాకు ఒక కీలక ఘట్టమని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అభివర్ణించారు. బుధవారం జమ్మలమడుగు నియోజకవర్గం, మైలవరం మండలం చిన్నకొమర్లలో నిర్వహించిన దాల్మియా భారత్ 2వ యూనిట్ విస్తరణ పనులకు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖామంత్రి నారా లోకేష్ శంఖుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కడప జిల్లాలో అపారమైన సహజ వనరులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. భారతదేశంలోనే అత్యంత ముఖ్యమైన సున్నపురాయి నిల్వలు కలిగిన జిల్లాల్లో కడపకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. ఈ వనరులను ఆధారంగా చేసుకుని సిమెంట్ పరిశ్రమను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. సిమెంట్ పరిశ్రమ కాలుష్య ప్రభావం కలిగిన రంగమైనప్పటికీ, ఆధునిక సాంకేతికతతో పర్యావరణహిత ఉత్పత్తి విధానాలను అమలు చేస్తూ గ్రీన్ సిమెంట్ తయారీ దిశగా దాల్మియా యాజమాన్యం అడుగులు వేయడం అభినందనీయమని చెప్పారు.పునరుత్పాదక ఇంధన రంగంలోనూ కడప జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందడుగులు వేస్తోందన్నారు. 21 గిగావాట్ల సామర్థ్యంతో సౌర, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయని తెలిపారు. వీటి ద్వారా కడపను పరిశ్రమలతో పాటు హరిత జిల్లాగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నైపుణ్యాభివృద్ధికి దాల్మియా యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. దాల్మియా భారత్ సంస్థ తమ ఉత్పత్తి ఆదాయంపై మాత్రమే ఆలోచించకుండా.. సామాజిక బాధ్యతలో భాగంగా సుమారు రూ.42 కోట్లతో ప్రాజెక్టు పరిసర గ్రామాల్లో విద్య, నైపుణ్య శిక్షణ, మహిళల సాధికారత, ఉపాధి అవకాశాల కల్పన వంటి కార్యక్రమాలను ఖర్చు చేస్తోందని తెలిపారు. ప్రభావిత గ్రామాల ప్రజలకు శిక్షణ అందించేందుకు ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సామాజిక బాధ్యతతో పెట్టుబడులు పెడుతున్న దాల్మియా ప్రాజెక్టు విజయవంతంగా అమలయ్యేలా.. జిల్లా యంత్రాంగం తరపున, రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతంగా భావించిన కడప జిల్లా నేడు అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. జిల్లాలోని లింగాల మండలం ప్రస్తుతం దేశంలోనే వ్యవసాయ, ఉద్యాన పంటల ఉత్పత్తిలో విశేష గుర్తింపు పొందిందని తెలిపారు. ముఖ్యంగా బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్) విస్తరణతో రిజర్వాయర్ల నుండి నీటి వినియోగం తగ్గి, దిగుబడులు పెరిగాయన్నారు.గతంలో



ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఇజ్రాయెల్‌లో అమలవుతున్న ఆధునిక వ్యవసాయ విధానాలను అధ్యయనం చేసి, వాటిని రాష్ట్రంలో ప్రవేశపెట్టడం వల్లే ఈ మార్పు సాధ్యమైందన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు, విలువ ఆధారిత ఉత్పత్తుల ప్రోత్సాహంతో ప్రతి ఏడాది వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అరటి వంటి ఉద్యాన పంటల ఆధారంగా ఏర్పాటు అవుతున్న పరిశ్రమలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు యువతకు స్థిరమైన ఉద్యోగాలను అందిస్తున్నాయని జిల్లా కలెక్టర్ ప్రభుత్వ విధానాలను.ప్రశంసించారు.

# కలెక్టర్ కార్యాలయం ముందు
# ఆందోళనలకు సిద్ధం కండి

నంద్యాల ప్రతినిధి. జూలై 15 . (నంది పత్రిక ):రాష్ట్రవ్యాప్తంగా షెడ్యూల్డ్ పరిశ్రమలలో పనిచేసే కార్మికులందరికీ కనీస వేతనాలను అమలు చేయాలని కార్మికులను కట్టు బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ జులై 30, 31 తేదీల్లో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు వి ఏసురత్నం, ఏ నాగరాజు జిల్లా కార్యదర్శులు లక్ష్మణ్, బాల వెంకట్ నంద్యాల పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కే మహమ్మద్ గౌస్,పి వెంకట లింగంలుపాల్గొన్నారు.అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి యేసురత్నం ఏ నాగరాజు లు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్ యజమానుల వద్ద షాపులు, సంస్థల్లో 50 లక్షల మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారు. కనీస వేతనాల చట్టం ప్రకారం వారికి 5 సంవత్సరాలకోసారి వేతనాలు సవరించాలి. వాటిని యజమానులచే అమలు చేయించాలి. కానీ, 2007 తర్వాత 2012, 2017, 2022 సంవత్సరాల్లో మూడు దఫాలుగా రాష్ట్ర ప్రభుత్వం వీరికి వేతనాలు పెంచలేదు. ఫలితంగా ఇప్పటికీ 2026 ఏప్రిల్ 1 నుండి వచ్చే వీడీఏ ను కలుపుకున్నా కూడా కనీస స్థాయిలో నెలకు రూ. 12 వేల నుండి రూ.13 వేల మధ్యలోనే వేతనాలు ఉన్నాయని,రాష్ట్ర ప్రభుత్వం కాలానుగుణంగా వేతనాలు పెంచి ఉంటే కనీస స్థాయిలో ఈ పాటికి రూ. 19 నుండి రూ. 21 వేల వరకు వచ్చి ఉండేవి. మన ప్రక్కనే ఉన్న కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం అక్కడి కార్మికులకు ఇటీవల 60 శాతం వేతనాలు పెంచింది. ప్రాంతాన్ని బట్టి కనీస స్థాయిలో నెలకు రూ.21,251 నుండి రూ.25,714 లు ప్రకటించిందని,కనీస వేతనాలకు సంబంధించి 1957లో జరిగిన భారత కార్మిక మహాసభ సూచించిన ప్రామాణికాలను, 1992లో సుప్రీంకోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత ధరలలో నెలకు కనీస స్థాయిలో రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని,నిత్యం ధరలు పెరుగుతున్నందున కార్మికుల నిజవేతనాలు పడిపోతున్నాయి. కార్మిక కుటుంబ భారాలు కాలక్రమేణా పెరుగుతున్నాయి. 5 సంవత్సరాలకోసారి కనీస వేతనాలు పెంచడం తప్పనిసరి. కావున మా విజ్ఞప్తిని పరిశీలించి నెలకు రూ. 26 వేలు నిర్ణయించి యజమానులతో అమలు చేయించాలని,71 షెడ్యూల్డ్ పరిశ్రమల కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని,కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలని,పని ప్రదేశాల్లో భద్రత చర్యలు చేపట్టాలని,లేబర్ కోడ్స్ రద్దు చేయాలి. సంక్షేమ పథకాలు అమలు చేయాలని,అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, వెలుగు, సమగ్రశిక్ష, నేషనల్ హెల్త్ మిషన్ ఉపాధి హామీ, 108, 104, తల్లీ బిడ్డ. ఆరోగ్యమిత్ర, అర్బనెల్త్, ఆయూష్ తదితర అన్ని ప్రభుత్వ పథకాల ఉద్యోగులుగా గుర్తించాలి. వేతనాలు పెంచాలి.ఉ ఔట్సోర్సింగ్, ఆప్కాస్, ప్రభుత్వ రంగ, స్థానిక సంస్థల, పథకాల కాంట్రాక్ట్ ఉద్యోగులకు మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చేయాలని,అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, వెలుగు, సమగ్ర్యశిక్ష, నేషనల్ హెల్త్ మిషన్ తదితర ప్రభుత్వ పథకాల ఉద్యోగులు, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ జూలై 30 31 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో పాల్గొని ప్రభుత్వానికి హెచ్చరిక పంపాలని కార్మిక వర్గాల సత్తా ఏందో చూపించేందుకు సిద్ధం కావాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.



# ఏ కోడూరులో పొలం పిలుస్తోంది!

బండి ఆత్మకూరు నంది పత్రిక జూలై 15 : బండి ఆత్మకూరు మండలం అయ్యవారి కోడూరు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ, ప్రస్తుతం నెలకొన్న ఎల్నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని రైతులకు సూచించారు. సాధారణంగా జూలై నెలలో 176 మి.మీ. వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 10మి.మీ. మాత్రమే నమోదైందని తెలిపారు. దీంతో మండలంలోని అన్ని గ్రామాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి, మొక్కజొన్న పంటల సాగును సాధ్యమైనంత వరకు తగ్గించడం మంచిదిని, జూన్లో విత్తిన పంటల్లో వాడిపోతున్న లక్షణాలు కనిపిస్తున్నందున, పంట బెట్ట పరిస్థితులను తట్టుకునేందుకు లీటరు నీటికి 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ చొప్పున కలిపి పిచికారీ చేయాలని రైతులకు తెలిపారు .బోరు బావులు క్రింద సాగు చేస్తున్న మొక్కజొన్న, పత్తి పంటలకు నీటి వినియోగాన్ని ఆదా చేసేందుకు వరుస విడిచి వరుసకు నీటిపారుదల అందించాలని అన్నారు. ఎల్నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ పంట కాలం గల మినుములు, కొర్రలు, సజ్జ పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులు, ప్రభుత్వ సూచనలను పాటిస్తూ పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ సూచించారు. పంటల భీమా పథకం సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి పవన్ కుమార్ తో పాటు వ్యవసాయ విస్తరణ సిబ్బంది శ్రీనివాసరెడ్డి పలువురు రైతులు పాల్గొన్నారు



# పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



బండి ఆత్మకూరు నంది పత్రిక జూలై 15: బండి ఆత్మకూరు మండల పరిధిలోని కడమల కాల్వ గ్రామంలో సామాజిక శంఖారావం లో భాగంగా దళిత కాలనీలో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించడం జరిగింది .కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రత్నమయ్య దేవిడ్,సుబ్బరాయుడు, ఏసేపు,సుబ్బన్న, కుమార్ ల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించడం జరిగింది. ఎస్సీ కాలనీ ప్రజలు అనేక రకాల సమస్యలను ప్రజా సంఘాల నాయకుల దృష్టికి తీసుకుని రావడం జరిగింది. ప్రధానంగా ఎస్సీ కమ్యూనిటీకి కొన్ని ఏళ్ల సంవత్సరాల కిందట ఇచ్చిన ఇండ్ల స్థలాలలో అన్నదమ్ములు వివాహాలు చేసుకుని ఒకే ఇంటిలో కాపురాలు చేస్తున్నారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇల్లు లేని పేదలకు మూడు సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది. నేటికీ ఆ హామీ నెరవేరలేదని ఇరుకైన ఇండ్లలో కాపురాలు చేస్తున్నామని దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగ కమ్యూనిటీకి చెందిన వారికి స్మశాన వాటిక బీసీ ఎస్సీ మాదిగ కమ్యూనిటీకి ఒకే చోట ఉండడం ఉన్న స్మశాన వాటిక పది సెంట్లు కూడా లేకపోవడంతో ఒకే గుంతలో రెండు మూడు మరణించిన మృతదేవాలను అంత్యక్రియలు చేయవలసిన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీళ్లలోకి ప్రవేశిస్తుందని వెంటనే డ్రైనేజ్ కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్సీ కాలనీలోని సుబ్బరాయుడు ఇంటి పక్కన పబ్బతి శిఖామణి ఇంటి వెనక ఉన్న రాస్తాకు సిమెంట్ రోడ్డు లేక డ్రైనేజీ లేక ఎండాకాలం కూడా మురికి నీరు ఏర్పడి తిరగడానికి వీలులేని పరిస్థితి ఉందని వెంటనే సిమెంట్ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. అర్హులైన పేదలకు డప్పు పింఛన్లు మంజూరు చేయాలని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూమి లేని పేదలను గుర్తించి రెండు ఎకరాల భూమి కొనుగోలు చేసి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

# శాంతిరామ్ ఇంజనీరింగ్
# కళాశాల ఐఈఎల్ట్స్ మెగా ఛాలెంజ్



నంద్యాల ప్రతినిధి. జూలై 15 . (నంది పత్రిక ): నంద్యాలలోని శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్), తమ వెర్బల్ వాయేజర్స్ ఇంగ్లీష్ క్లబ్ ద్వారా, జూలై 15, 2026న ఈఎల్సిఎస్ ప్రయోగశాలలో ఐఈఎల్ట్స్ మెగా ఛాలెంజ్ ఎల్ఎస్ఆర్డబ్ల్యూ నైపుణ్యాల మదింపును విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఐఈఎల్ట్స్ పరీక్షపై అవగాహన కల్పించడం మరియు విద్యార్థుల ఆంగ్ల భాషా ప్రావీణ్యాన్ని, ముఖ్యంగా లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్, మరియు రైటింగ్ (ఎల్ఎస్ఆర్డబ్ల్యూ) నైపుణ్యాలను మెరుగుపరచడం. ఈ మదింపును ఐఈఎల్ట్స్ పరీక్షా సరళిని అనుసరించి నిర్వహించారు. దీని ద్వారా విద్యార్థులు పరీక్షా విధానంపై ఆచరణాత్మక అవగాహన పొంది, ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, మరియు ప్రపంచవ్యాప్త ఉద్యోగ అవకాశాల కోసం తమను తాము సిద్ధం చేసుకోగలిగారు.ఈ ఛాలెంజ్‌లో వివిధ విభాగాలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వి. సుబ్రమణ్యం ఇంగ్లీష్ క్లబ్‌ను అభినందించి, విద్యార్థుల ఉత్సాహభరితమైన భాగస్వామ్యాన్ని ప్రశంసించారు. నేటి పోటీ ప్రపంచంలో అంతర్జాతీయ భాషా ప్రావీణ్య పరీక్షలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రపంచవ్యాప్త విద్యా మరియు వృత్తి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి విద్యార్థులను ప్రోత్సహిస్తాయని ఆయన నొక్కి చెప్పారు. అసెస్‌మెంట్‌కు ముందు, ఇంగ్లీష్ క్లబ్ కోఆర్డినేటర్ ఎం. రాజా, పాల్గొన్నవారికి ఇల్ట్స్ పరీక్ష యొక్క నిర్మాణం, సరళి మరియు ప్రాముఖ్యత గురించి వివరించారు.ఈ పరీక్ష రాయడం ద్వారా తాము గొప్ప అనుభవాన్ని పొందామని విద్యార్థులు తమ అభిప్రాయాన్ని పంచుకున్నారు. ప్రశ్నలు చాలా సవాలుగా ఉన్నాయని, ఈ అనుభవం పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి తమకు సహాయపడుతుందని వారు చెప్పారు. ఇది నియామకాల ఇంటర్వ్యూ సరళిపై అనుభవాన్ని పొందడానికి కూడా వారికి సహాయపడుతుంది.మొత్తంమీద, వెర్బల్ వాయేజర్స్ విద్యా ప్రపంచానికి మరియు కార్పొరేట్ ప్రపంచానికి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించే దిశగా ఒక గొప్ప చొరవ తీసుకున్నారు.



# కరమలవారిపల్లిలో మంత్రి
# నారా లోకేష్ 91వ రోజు ప్రజాదర్బార్

**ప్రజలను కలిసి వివిధ సమస్యలపై వినతులు స్వీకరణ**

జమ్మలమడుగు బ్యూరో చీఫ్ జులై 15 నంది పత్రిక కడప జిల్లా మైలవరం మండలం కరమలవారిపల్లిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 91వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్.. వారి నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖకు కేటాయించిన పోస్టులలో ఖాళీగా ఉన్న 520 డైరెక్ట్ రిక్రూట్ మెంట్ ఏఈ పోస్టులను మండల ఇంఛార్జ్ లతో భర్తీ చేయాలని హౌసింగ్ ఏఈ, ఎంఐసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల పరిధిలోని అర్బన్ లోకల్ బాడీస్ నుంచి గత మూడు సంవత్సరాల లైబ్రరీ సెస్ మొత్తాన్ని జమచేయడం, ఆలస్యం అయిన సెస్ పై సర్వీస్ ట్యాక్స్ మినహాయింపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం మంత్రి నారా లోకేష్ ను కలిసి కోరారు. కడప పట్టణంలోని జవహర్ బాల భవన్ లో పనిచేస్తున్న సిబ్బందికి టైమ్ స్కేల్ కల్పించాలని బాలభవన్ పర్యవేక్షకురాలు జి.సునీత కోరారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.





# 950 హెక్టార్లలో వరి సాగు
# ఆశల ఊబిలో అన్నదాతలు

**బండి ఆత్మకూరు నంది పత్రిక జూలై 15:** ఎల్నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ రైతులు వరి సాగుకు పూనుకుంటున్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి కాబట్టి, రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని ఓవైపు వ్యవసాయ శాఖ యంత్రాంగం సూచనలు చేస్తున్నప్పటికీ రైతులు మాత్రం వీటిని ఆచరించే పరిస్థితిలో లేరు. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్లో వరి సాగు చేస్తున్నాము కాబట్టి, వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ వర్షం కురుస్తుందని ఆశతో వరి సాగుకు పూనుకుంటున్నామని రైతులు పేర్కొంటున్నారు. ఆశల ఊబిలో కూరుకొని పోయి, నానా తంటాలు పడుతున్నారు . వర్షాలు కురియక బోర్లలో భూగర్భ జలాలు అటుగంటి పోయినప్పటికీ, రైతులు లెక్కచేయడం లేదు. బండి ఆత్మకూరు మండలం పరిధిలోని ఈర్నపాడు కడమల కాలువ వెంగళ్రెడ్డిపేట ఏ కోడూరు బి కోడూరు ప్రాంతాలలో 1900 ఎకరాలలో వరి సాగుకు పూనుకున్నారని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఇదే గ్రామాలలో కొన్నిచోట్ల డ్రై షోయింగ్ పద్ధతిలో వరిని సాగు చేసుకుంటున్నారు. ఈర్నపాడు గ్రామానికి చెందిన సిద్ధం మౌలాలి రెడ్డి అనే రైతును వరి సాగు విషయంపై ప్రశ్నిస్తే, తన అనుభవాలను గురించి వివరించారు. బుధవారం తనకున్న ఆరు ఎకరాల పొలంలో మూడు ఎకరాల పొలంలో వరినాట్లను వేయడం జరిగిందని పేర్కొన్నారు. 26 రోజుల క్రితమే విత్తనం వడ్లను చల్లడం జరిగిందని తెలిపారు. ఒక్కొక్క ఎకరాకు పొలాన్ని చదును చేసుకునేందుకు 6000 దాకా ఖర్చు అవుతుందని, నాటు కూలీలకు గాను 3500 ఖర్చు అయిందని తెలిపారు. విద్యుత్ సరఫరా కు సంబంధించి



ఎలాంటి ఇబ్బందులు లేవని ఉదయం 8 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు రైతులకు సరఫరా అవుతుందని తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకున్నప్పటికీ, బో ర్లలో భూగర్భ జలాలు అడుగంటి పోవడం ఆందోళన కలిగిస్తూ ఉందని తెలిపారు. ఇలాంటి పరిస్థితులలో వరి సాగును చేయడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయి కదా! అని రైతును ప్రశ్నిస్తే, వర్షం కురుస్తాదన్న ఆశతోనే వరిని సాగు చేసుకుంటున్నానని తెలిపారు. ఎల్నినో ప్రభావం కారణంగా ఆరుతడి పంటలను వేసుకోవాలన్న ఆశ ఉన్నప్పటికీ, భవిష్యత్తులో వర్షం కురిసి, కాలువలు నిండితే, ఆరుతడి పంటలు సాగు వల్ల నష్టపోవాల్సి వస్తుందని సిద్ధం మౌలాలి రెడ్డి వివరించారు.

# ప్రజా ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతి పట్ల
## మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి , వైసీపీ నేతలు తీవ్ర సంతాపం!







**వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన పోరాటాలు చిరస్మరణీయం...**

**మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి**

**నంద్యాల వైఎస్ఆర్సీపీ కార్యాలయంలో ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి.**

**నంద్యాల సిటీ బ్యూరో జులై 15 ( నంది పత్రిక )** ప్రముఖ కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మరణం పట్ల మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శిల్పా మోహన్ రెడ్డి తీవ్ర విచారాన్ని, సంతాపం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ, హైదరాబాదులోని సింధు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముద్రగడ మంగళవారం సాయంత్రం తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆయన మరణవార్త తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో, ముఖ్యంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ నేపథ్యంలో, బుధవారం నంద్యాల స్థానిక వైఎస్ఆర్సీపీ కార్యాలయంలో మాజీమంత్రి శిల్పా మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులు అర్పించారు. ప్రజా జీవితంలో ముద్రగడ చేసిన కృషి అనిర్వచనీయమని ఈ సందర్భంగా నేతలు కొనియాడారు. మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి మాట్లాడుతూ..."ముద్రగడ పద్మనాభం గారి మరణం రాష్ట్ర రాజకీయాలకే కాకుండా, ప్రత్యేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక బలమైన ప్రజా నేతగా ఆయన ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన అలుపెరగని పోరాటాలు ఎప్పటికీ చిరస్మరణీయమని కొనియాడారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, రెండుసార్లు మంత్రిగా ఉంటూ ప్రజలకు ఎనలేని సేవలు అందించిన గొప్ప చరిత్ర కలిగిన నేత అన్నారు. కేవలం ఒక వర్గానికే పరిమితం కాకుండా, రాష్ట్ర ప్రజలందరి ఆదరాభిమానాలను పొందిన నాయకుడు ముద్రగడ. ఒక సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి... ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోశారని తెలిపారు. కాపు రిజర్వేషన్లు, రైతాంగ సమస్యలపై ఆయన చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని.

వైఎస్ఆర్ పార్టీ బలోపేతానికి ఆయన ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సంతాప కార్యక్రమంలో నంద్యాల ప్రాంతానికి చెందిన వైఎస్ఆర్ సీపీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని ముద్రగడకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాసులు, స్టేట్ లీగల్ సెల్ అధికార ప్రతినిధి తిమ్మారెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, వైసిపి నాయకులు కైలాసనాద్, కరెంటు శేఖర్,అడ్వకేట్ శీను, పార్థుడు, కామిని వెంకటేశ్వర్లు, దండే సుధాకర్,చుమ్మా రవి, రెండో వార్డు శ్రీను,దండే శ్రీనివాసులు, నంద్యాల అసెంబ్లీ గ్రీవెన్సెల్ అధ్యక్షులు వివేకానంద రెడ్డి, మాజీ కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, వైసీపీ నాయకులు జిఎం గౌస్, సాయిరాం రెడ్డి, ఎర్రన్న,తదితరులు పాల్గొన్నారు...

# కడప జిల్లాలో మంత్రి నారా లోకేష్ పర్యటన







**దొరసానిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి లోకేష్**

**విద్యార్థుల అభ్యసన ఫలితాలపై ఆరా**

**ప్రొద్దుటూరు: బ్యూరో చీఫ్ జులై 15 నంది పత్రిక** కడప జిల్లాలో పర్యటించిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం మధ్యాహ్నం ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక సదుపాయాలను పరిశీలించడంతో పాటు విద్యార్థుల అభ్యసన ఫలితాలు, పాఠశాల పనితీరుపై ఆరా తీశారు. ముందుగా పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులతో మంత్రి సంభాషించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల అందజేత, వాటి నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇరాన్-అమెరికా యుద్ధాన్ని ఎంతమంది గమనిస్తున్నారని అడిగారు. విద్యతో పాటు శారీరక వ్యాయామం ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. మీకు మార్కులు రాకపోతే నా మార్కులు పోతాయని విద్యార్థులను ఉద్దేశించి ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. నా భవిష్యత్ మీపై ఆధారపడి ఉంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రజాప్రభుత్వం విశేషంగా కృషిచేస్తోంది. అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోంది. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాం, షూ, తల్లికి వందనం పథకాలను అమలుచేస్తోందని వివరించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను ఆరా తీశారు. ఐవీఆర్ఎస్ ద్వారా తల్లిదండ్రులు ఫీడ్ బ్యాక్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజనం బాగుందని ఈ సందర్భంగా విద్యార్థులు మంత్రి నారా లోకేష్ కు వివరించారు.పాఠశాల తనిఖీ సందర్భంగా విద్యార్థుల అభ్యసన ఫలితాలపై మంత్రి ఆరా తీశారు. లెర్నింగ్ అవుట్ కమ్స్ లో పాఠశాల 1.3 స్టార్ రేటింగ్ పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.ధనలక్ష్మిని మంత్రి ప్రశ్నించారు. ఫార్మాటివ్, సమ్మేటివ్ అసెస్ మెంట్ పై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని, లెర్నింగ్ అవుట్ కమ్స్ పై దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. పనితీరులో వెనుకబడిన పాఠశాలల పట్ల ఎంఈవోలు దృష్టిపెట్టాలని, 15 రోజులకోసారి సమీక్ష చేయాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు తక్కువగా ఉండటంపైనా మంత్రి ఆరా తీశారు. హాజరుపై ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులను ఆదేశించారు. అనుమతి లేకుండా ఉపాధ్యాయులు గైర్హాజరయ్యే పరిస్థితిని నివారించాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల ఎన్ రోల్ మెంట్ గతేడాది కంటే తక్కువగా ఉండటంపై మంత్రి ఆరా తీశారు. 10 మంది విద్యార్థులు వసతిగృహాలకు, కేజీబీవీలకు తరలివెళ్లడం వల్ల ఎన్ రోల్ మెంట్ తగ్గిందని ప్రిన్సిపాల్ వివరించారు. గతేడాది కంటే అడకమిక్ ఫెర్ఫార్మెన్స్ మెరుగుపడటం పట్ల మంత్రి ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందుకు ఉపాధ్యాయుల సహకారం కావాలని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ లక్ష్యమని, అందరం కలిసికట్టుగా ఉంటేనే ఇది సాధ్యమని చెప్పారు. విద్యార్థుల డ్రాప్ అవుట్స్ పై దృష్టిపెట్టాలని.. ముఖ్యంగా విద్యార్థినులు డ్రాప్ అవుట్స్ కాకుండా చూడాలన్నారు. ప్రతి విద్యార్థిని ట్రాక్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. లెర్నింగ్ అవుట్ కమ్స్ లో వచ్చే ఏడాదికి 4 స్టార్ రేటింగ్ సాధిస్తామని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హామీ ఇచ్చారు. అనంతరం అందరితో కలిసి మంత్రి ఫోటోలు దిగారు.



# రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూలై 15:** బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న లింగాపురం గ్రామానికి చెందిన చింతకుంట్ల మద్దిలేటి రెడ్డి(61) అనే వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని పోలీసులు పేర్కొన్నారు. మద్దిలేటి రెడ్డి ఈనెల 14న ఉదయం తన సొంత పనిమీద సంత జూటూరు గ్రామానికి వెళ్ళాడని తెలిపారు. పని ముగించుకుని లింగాపురం గ్రామానికి మోటార్ సైకిల్ పై తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలో ఈద్గా వద్ద కింద పడ్డాడని తెలిపారు. దీనితో తలకు ఎడమ కంటి వైపు గాయాలయ్యాయని, అతని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించడం జరిగిందని తెలిపారు. నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున చనిపోయాడని అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# 150 ఏళ్ల తర్వాత.......?
## మర్రిపాడు అడవిలో మళ్లీ కనువిందు చేసిన అరుదైన అతిథి.. (బాహుబలి దున్నపోతు ):
### ఫారెస్ట్ అధికారులు భద్రత కల్పించాలి.....



**మర్రిపాడుజులై 15నంది పత్రిక :** మర్రిపాడు అటవీ గ్రామాల్లో అడవి దున్నపోతులు బర్రెలను తరుమూకొని గ్రామాలకు వచ్చేవని పెద్దలు చెప్తే వినడం తప్ప చూసిన వాళ్ళు తక్కువే. 154 ఏళ్ల తర్వాత నల్లమల అటవీ ప్రాంతానికి అనుకొని ఉన్న నెల్లూరు జిల్లా సరిహద్దు ప్రాంతమైన మర్రిపాడు మండల పరిధిలోని అడవుల్లో అరుదైన అతిథి (బాహుబలి దున్నపోతు )కనిపించింది. మళ్లీ ఇప్పుడు ఒకటి ప్రత్యక్షం కావడంతో అటవీ అధికారులు, పర్యావరణ ప్రేమికులు హర్షం వ్యక్తం చేశారు. అయితే ఈ అరుదైన అతిథి అడవి దున్న చాలా ఏళ్లకు కనిపించడంతో అటవీశాఖ అధికారులు వేటగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు చేపట్టాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు. మహారాష్ట్ర అడవుల నుంచి నల్లమల అడవులకు అక్కడనుంచి సింహాచలం శేషగిరి కొండల వరకు విస్తరించిన క్రమంలో మర్రిపాడు మండలం వెంకటాపురం అడవి జంతువుల అవాసానికి వలస వెళ్ళడానికి ఘాటు ఏర్పాటు ఉంటుందని మండలంలో కొందరు పెద్ద వయస్సు కలిగిన వారు చెప్పుకోవడం విశేషం.అడవి దున్నలకు దట్టమైన అభయారణ్యంలో స్వేచ్ఛగా తిరుగుతూ అప్పుడప్పుడు పర్యాటకులను, అటవి సమీప గ్రామాల ప్రజలకు తారసపడుతుంటాయి. కాని ఈ సారి మాత్రం బాహుబలి దున్నలుగా పిలిచే కవ్వాల్ అడవి దున్నలు కనిపించడంతో ఈ దృశ్యాలను మండల వాసులు తమ సెల్ ఫోన్లలో రికార్డ్ చేశారు.

# శ్రీశైలం ప్రజల ఆరోగ్యమే ఎమ్మెల్యే బుడ్డా రాజన్న లక్ష్యం
## ఆత్మకూరులో నేడు ఉచిత భారీ వైద్య శిబిరం
## రూ.3 వేల విలువైన పరీక్షలు, వైద్యుల సేవలు ఉచితం



**ఆత్మకూరు, జూలై 15 (నంది పత్రిక):** శ్రీశైలం నియోజకవర్గ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి నిరంతరం ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారని ఆత్మకూరు పట్టణ 5వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఖాజా మొహిద్దీన్ తెలిపారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో, ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా బృందం ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన ప్రముఖ శ్రీ చక్ర హాస్పిటల్ వైద్య బృందం సౌజన్యంతో గురువారం (జూలై 16) ఆత్మకూరులో భారీ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ శిబిరం గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆత్మకూరు పట్టణంలోని 5వ వార్డు నీలితొట్ల వీధిలో గల ఖాజా మొహిద్దీన్ నివాస ప్రాంగణంలో నిర్వహించబడుతుంది.ఈ వైద్య శిబిరంలో గుండె సంబంధిత వ్యాధులు, కంటి సమస్యలు, ఎముకలుకీళ్ల నొప్పులు, సాధారణ వ్యాధులకు సంబంధించిన పరీక్షలను నిపుణులు నిర్వహిస్తున్నారని చెప్పారు. సుమారు రూ.3,000 విలువైన ఈసీజీ, 2డి ఎకో, రక్తపోటు పరీక్షలు, కంటి పరీక్షలు పూర్తిగా ఉచితంగా నిర్వహించడంతో పాటు వైద్యుల సలహాలు కూడా ఉచితంగా అందనున్నాయి.అలాగే ఆరోగ్యశ్రీ లేదా ఈహెచ్ఎస్ కార్డులు కలిగిన వారికి కర్నూలులోని శ్రీ చక్ర హాస్పిటల్లో గుండె ఆపరేషన్లు, యాంజియోగ్రామ్, స్టంట్ వంటి చికిత్సలను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా అందజేస్తారని పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా ఆరోగ్యశ్రీ లేదా ఈహెచ్ఎస్ కార్డు, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం కోసం ఈ సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి, శ్రీ చక్ర హాస్పిటల్ చైర్మన్ విజయకుమార్ రెడ్డికి ఖాజా మొహిద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో 79వ బూత్ కన్వీనర్ ఆసిఫ్ బేగ్, 78వ బూత్ కన్వీనర్ పీలి మహబూబ్, అలీషేర్ పాల్గొన్నారు.

# నైపుణ్యమే విజయానికి పునాది

**రుద్రవరం ప్రతినిధి జులై 15 (నంది పత్రిక):** చదువుతోపాటు నైపుణ్యమే విద్యార్థుల విజయానికి పునాది అవుతుందని పాఠశాల తాత్కాలిక ప్రధానోపాధ్యాయురాలు రజని అన్నారు. నంద్యాల జిల్లా రుద్రవరం మండలంలోని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల మరియు కనిష్ఠ కళాశాల (రుద్రవరం)లో ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా వ్యవసాయ మరియు సమాచార సాంకేతిక నైపుణ్యాల కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం, విత్తనాల ఎంపిక, మొక్కల సంరక్షణ, నీటి సంరక్షణ, బహుళ అంచెల అటవీ విధానం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే 'కర్బన ఉద్గార శూన్య ఆరోగ్యకరమైన విద్యా ప్రాంగణ' కార్యక్రమ లక్ష్యాలను వివరించి, ప్రతి విద్యార్థి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలని సూచించారు.సమాచార సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా కంప్యూటర్ పరిజ్ఞానం, సాంకేతిక అక్షరాస్యత, కృత్రిమ మేధస్సు, సంకేత రచన, అంతర్జాల భద్రత, సాంకేతిక సాధనాల వినియోగంపై విద్యార్థులకు ప్రాయోగిక శిక్షణ అందించారు. భవిష్యత్ ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను ఇప్పటి నుంచే అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారుఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపల్ రజినీ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు వ్యవసాయం, సమాచార సాంకేతిక రంగాల్లో కూడా నైపుణ్యాలను పెంపొందించుకుని, స్వయం ఉపాధి మరియు ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునే సమర్థ యువతగా ఎదగాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ శిక్షకురాలు జ్యోతి ప్రియ, సాంకేతిక శిక్షకుడు హరి కృష్ణ, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# శ్రీ జగజ్జనని దేవాలయంలో అమ్మవారికి పుట్టింటి పట్టుచీరే. సారే.







## ..ఆషాఢ శుద్ధ పాడ్యమి నుంచి అమావాస్యవరకు మహోత్సవ వేడుకలు.

**నంద్యాల సిటీ బ్యూరో జులై 15 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతోంది. ప్రపంచంలోనే రెండో శ్రీ జగజ్జననీ దేవాలయంగా విరాజిల్లుతున్న నంద్యాల శ్రీ జగజ్జననీ నగర్ ఆలయంలో ఆషాఢమాస పుట్టింటి పట్టుచీర సారె మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. నేటి నుంచి ఆగస్టు 12వ తేదీ వరకు నెల రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. మహోత్సవాల తొలి రోజే ఆళ్లగడ్డ ప్రాంతం నుంచి సుమారు 250 మందికి పైగా భక్తులు అమ్మవారికి సారె సమర్పించేందుకు ప్రత్యేకంగా నంద్యాలకు చేరుకున్నారు. డప్పుల మోతలు, మంగళ వాయిద్యాలు, భజనలు, అమ్మవారి నామస్మరణల మధ్య భారీ శోభాయాత్ర నిర్వహించారు. పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ఊరేగింపులో భక్తులు భక్తి పారవశ్యంలో కోలాటాలు ఆడుతూ, జై జగజ్జననీ అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ శోభాయాత్రను చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా మహిళలు, యువతులు, చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణలో తలలపై పట్టుచీరలు, సారె పళ్లెలు, పసుపు, కుంకుమ, పండ్లు, కొబ్బరికాయలు, పూలతో కూడిన నైవేద్యాలను మోసుకొచ్చి అమ్మవారికి సమర్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయానికి చేరుకున్న అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి పుట్టింటి పట్టుచీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. దర్శనం, ప్రసాద పంపిణీ, తాగునీరు, అన్నప్రసాదం వంటి సౌకర్యాలను విస్తృతంగా కల్పించారు.

ఆషాఢమాసంలో అమ్మవారికి పుట్టింటి నుంచి పట్టుచీర, సారె సమర్పించడం అత్యంత పవిత్రమైన ఆచారంగా భక్తులు విశ్వసిస్తారు. ఈ సందర్భంగా మొక్కులు తీర్చుకునేందుకు, కుటుంబ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని కోరుతూ వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. నెల రోజుల పాటు కొనసాగే ఈ మహోత్సవాల్లో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.





# మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి.

## ప్లాస్టిక్ వద్దు.. జ్యూటు బ్యాగులు ముద్దు.



**నంద్యాల సిటీ బ్యూరో జులై 15 ( నంది పత్రిక )** ప్రజు చెట్లను నరికివేయడం వల్ల పర్యావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయని మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి,ప్లాస్టిక్ వద్దు,జూట్ బ్యాగులు వాడాలని వెలాసిటీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి,ప్రముఖ న్యాయవాది రామ చంద్రరావు లు పిలుపునిచ్చారు.సూర్య సేన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా కళాశాల విద్యార్థులకు పర్యావరణం పై అవగాహన కల్పించి కరపత్రాలను విడుదల చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ న్యాయవాది రామచంద్ర రావు గారు, వెలాసిటీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస రెడ్డి గారు , సూర్య సేన చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకు కాలుష్యం విపరీతంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు తమ అవసరాల కోసం విపరీతంగా చెట్లను నరికి వేస్తున్నారని వాటి స్థానంలో మొక్కలను పెంచడం లేదని తద్వారా పర్యావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయని హెచ్చరికలు జారీ చేశారు. ఇకనైనా ప్రజలు చెట్ల పెంపకం పై బాధ్యత వహించి ప్రకృతిని కాపాడాలని తెలియజేశారు. అలాగే ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ ప్రభావం విపరీతంగా పెరుగుతుందని ప్రజలు వాటి స్థానంలో జ్యూట్ బ్యాగులు వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి ప్రదీప్ రెడ్డి, అశోక్ కుమార్, విజయ్ కుమార్, వరదరాజులు, కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సమయపాలన తప్పకుండా పాటించాలి

## - డీప్యూటీ ఎంపీడీఓ కె పి ఆర్ శర్మ



**కొత్తపల్లి - నంది పత్రిక :** స్వర్ణగ్రామాల కార్యాలయాలకు సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటిస్తూ రావాలని స్వర్ణగ్రామాల డీప్యూటీ ఎంపీడీఓ కె పి ఆర్ శర్మ సూచించారు. బుధవారం ఆయన దుద్యాల-2 స్వర్ణగ్రామ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ముందుగా అటెండెన్స్ రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్ పరిశీలించారు. అదేవిధంగా అక్షరాంధ్ర వాట్సప్ మనమిత్ర ట్రైనింగ్, ప్రస్తుతం అమలులో ఉన్న ఇతర సర్వేలను పరిశీలించి త్వరితగతిన పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా సిటిజన్ ఫీడ్బ్యాక్ రిజిస్టర్ కూడా మెంటెనెన్స్ చేయాలని సూచించారు. ఈ రిజిస్టర్లపై సీజన్లకు అవగాహన కూడా కల్పించాలని సూచించారు.

# 18న మండల సర్వసభ్య సమావేశం

## - ఎంపీడీవో మేరీ

**కొత్తపల్లి - నంది పత్రిక :** ఈనెల 18 వ తేదిన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మేరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి మూడు నెలలకొకసారి ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశం మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కిచ్చన్నగారి కుసుమలత అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మూడునెలలో మండలంలో జరిగిన అభివృద్ధి పనులు, పథకాల అమలు గురించి, మండలంలో నిర్వహించే అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలుపై చర్చించడం జరుగుతుందని తెలపారు. మండల వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, కో-ఆప్టెడ్ మెంబర్లు అందరు తప్పనిసరిగా హాజరు కావాలని వెల్లడించారు.

# రైతులు పంటల బీమా పథకాన్ని సద్వినియోగించుకోండి.





## ప్రధానమంత్రి ఫసల్ భీమా మార్గదర్శకాలు విడుదల.

**నంద్యాల సిటీ బ్యూరో జులై 15 ( నంది పత్రిక )** దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి ఫసల్ భీమా పథకానికి మార్గదర్శకాలు విడుదలయ్యాయని,రైతులు పంటల బీమా పథకాన్ని సద్వినియోగించుకోవాలని నంద్యాల వ్యవసాయ అధికారి ప్రసాదరావు పేర్కొన్నారు. నంద్యాల మండలంలోని పులిమద్ది, భీమవరం గ్రామాలలో నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడమైనది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఖరీఫ్ కాలంలో సాగు చేసిన పంటలకు భీమా చేయించుకోవాలని తెలియజేశారు. ఈ ఖరీఫ్ కాలంలో సాగు చేసిన పంటలకు ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ భీమా ను వివిధ పంటలకు వర్తింప చేస్తూ మార్గదర్శకాలు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా పథకం లో వరి గ్రామం యూనిట్ గా, మొక్కజొన్న, మినుము, కంది, మిరప మండలం యూనిట్ గా, సజ్జ, కొర్ర, ఉల్లి, ఆముదం, జొన్న జిల్లా యూనిట్ గా ఉన్నదని, వరికి ఎకరాకు 800/-, మొక్కజొన్న కు 660/-, కంది కి 400/- , మినుము మరియు జొన్నకు 190/-, సజ్జ మరియు ఆముదం పంటలకు 160/-, ఉల్లికి 450/- , మిరపకు 2880/- ప్రీమియం చెల్లించి రైతులు పంటల భీమా పథకం లో నమోదు చేసుకోవచ్చునని, అలాగే, వరికి ఆగస్టు 15వ తేదీ వరకు మరియు ఇతర పంటలకు జూలై 31 వరకు గడువు ఉన్నదని తెలిపారు. ఇంకా పూర్తి వివరాలకు రైతులు వారి సమీపంలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని కలవాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో పంటల బీమా పథకం రైతులకు ఎంతో మేలు చేస్తుందని , కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి సూచించారు. అలాగే ప్రస్తుతం ఎల్లినో ప్రభావం వలన ఈ నెలలో ఇప్పటివరకు మండలంలో 1.2 మి. మీ వర్షపాతం మాత్రమే నమోదు కావటం జరిగిందని, దీని వలన ఇదివరకే సాగు చేసిన పంటలు అనగా మొక్కజొన్న, మినుము, సోయచిక్కుడు, ప్రత్తి బెట్టకు గురి కావటం జరుగుతుందని, కావున మొక్కలు బెట్ట ను తట్టుకోవడానికి 13:0:45 అనే పోషకాన్ని లీటర్ నీటికి 5 గ్రాములు కలుపుకొని పంటపై పిచికారి చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, మొక్కజొన్న కు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంపిక చేసుకొని సాగు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది రాము నాయక్, ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

# పనిని బట్టీ వేతన అమలు

## - ఏపీఓ విమలమ్మ



**కొత్తపల్లి:** వీబీజీ రాంజీ పథకంలో నిర్వహించే పనులు చేసిన పనిని బట్టీ వేతనం అమలు అవుతుందని ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ వేతనదారులతో పక్కా కొలతలతో పనులు చేయించాలని వీబీజీ రాంజీ ఏపీఓ విమలమ్మ సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీబీజీ రాంజీ ఫీల్డ్ అసిస్టెంట్లు పనుల వద్ద ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే పూర్తిస్థాయి వేతనం అందుతుందన్నారు. ఇచ్చిన కొలతల ప్రకారం తప్పనిసరిగా పనిచేయించాలన్నారు. అదేవిధంగా జాబు కార్డు కలిగిన ప్రతి శ్రామికుడు ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలన్నారు. అదేవిధంగా ఇచ్చిన టార్గెట్ల ప్రకారం ప్లాంటేషన్ ప్రక్రియ, పిట్టింగ్ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ఆగస్టు 13లోగా మైనారిటీ హాస్టళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

## నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం
## మైనారిటీ సంక్షేమ హాస్టల్ భవనాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్
## నాణ్యతతో పనులు పూర్తి చేసి భవనాలు హ్యాండోవర్ చేయాలి
## పీఎంజెవికే కింద నిర్మిస్తున్న హాస్టళ్ల పురోగతిని సమీక్షించిన కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో,జూలై 15(నంది పత్రిక):-** జిల్లాలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న హాస్టళ్ల పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి వినియోగానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నంద్యాల పట్టణంలోని వైఎస్సార్ నగర్ (మూలసాగరం గ్రామం) ప్రధాన రహదారి సమీపంలో నిర్మాణంలో ఉన్న మైనారిటీ వెల్ఫేర్ హాస్టల్ భవనాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను అడిగి పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. 2022లో హాస్టళ్ల నిర్మాణం కోసం 4.5 ఎకరాల భూమిని కేటాయించగా, కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి జన వికాస్ కార్యక్రమం (పీవీజీఎఖ) కింద వర్కింగ్ ఉమెన్ హాస్టల్, పోస్ట్ మెట్రిక్ గర్ల్స్ హాస్టల్, ప్రీ మెట్రిక్ గర్ల్స్ హాస్టల్, ప్రీ మెట్రిక్ బాయ్స్ హాస్టల్లతో కూడిన మొత్తం నాలుగు భవనాలు నిర్మిస్తున్నట్లు మైనారిటీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్ కలెక్టర్కు వివరించారు. ఒక్కో భవనం నిర్మాణానికి రూ.2.10 కోట్ల వ్యయంతో, కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్మాణ పనులు సుమారు 90 శాతం పూర్తయ్యాయని, నీటి సరఫరా, వాష్రూమ్లు తదితర ప్రధాన పనులు పూర్తి కాగా, విద్యుత్ పనులు, పెయింటింగ్ వంటి మిగిలిన పనులు మాత్రమే కొనసాగుతున్నాయని కలెక్టర్ కు వివరించారు. మిగిలిన పనులను నెల రోజుల్లో పూర్తి చేసి భవనాలను అప్పగిస్తామని ఏపీడబ్ల్యూఐడీసీ ఇంజినీర్లు కలెక్టర్కు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్మాణ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా అన్ని పనులను అత్యున్నత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. మిగిలిన విద్యుత్, పెయింటింగ్, ప్రాంగణ అభివృద్ధి తదితర పనులను వేగవంతం చేసి వచ్చే నెల ఆగస్టు 13వ తేదీలోగా భవనాలను సంబంధిత శాఖకు హ్యాండోవర్ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రతి అంశాన్ని పరిశీలించి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం హాస్టల్ సముదాయం సమీపంలో కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు కోసం కేటాయించిన స్థలాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. ఆ స్థలాన్ని ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా సద్వినియోగం చేసుకునే అంశంపై సంబంధిత అధికారులు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జిల్లా రెవిన్యూ అధికారి రాము నాయక్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి లీలావతి ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఉన్నారు.



# పంట నమోదు తప్పనిసరి

## - ఎ వో అమ్మిరున్నిసా బేగం



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండలం లో పంట వేసిన రైతులందరూ గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రంలో పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఎ వో అమ్మిరున్నిసా బేగం తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట బీమా పథకాలైన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన మరియు వాతావరణ ఆధారిత పంటల బీమా నమోదు చేసుకోవడానికి ఈ నెల 31 వరకు ఆఖరి తేదీని పొడిగించడం జరిగిందన్నారు బ్యాంక్ ద్వారా కిసాన్ క్రెడిట్ కార్డ్ (కె సి సి) / వ్యవసాయ రుణం పొందిన వారు మీ యొక్క బ్యాంక్ శాఖ ద్వారా భీమాను పొందవచ్చు మరియు రుణం పొందని వారు మీ దగ్గరలో ఉన్న బ్యాంకు / కామన్ సర్వీస్ సెంటర్) / మీ సేవ / భీమా కంపెనీ ద్వారా నియమింపబడిన మధ్యవర్తులు యాప్ అప్లికేషన్ ద్వారా కూడా భీమాను పొందావచ్చు అని తెలియచేసారు.

# లబ్ధిదారుల వివరాల అప్‌డేట్‌ను 100 శాతం పూర్తి చేయాలి



**పోస్ట్ మెట్రిక్ హాస్టల్ విద్యార్థులకు**
**వెంటనే బ్యాంకు ఖాతాలు ప్రారంభించాలి**
**ఆధార్ ప్రత్యేక డ్రైవ్‌ను ముమ్మరం చేసి**
**అర్హులందరికీ నమోదు పూర్తి చేయాలి**
**అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి**
**ఫోటోలు తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలి**
**పాఠశాలల్లో పరిశుభ్రత, బోధన నాణ్యత, మధ్యాహ్న**
**భోజనంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి**
**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, జూలై 15(నంది పత్రిక):–** జిల్లాలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో అమలు చేస్తున్న తల్లికి వందనం, ఒడిఎఫ్ +, ఆధార్ ప్రత్యేక డ్రైవ్, పాఠశాలలు – హాస్టళ్ల తనిఖీలు, ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ యోజన, వాట్సాప్ మిత్ర సేవలు తదితర కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ నుండి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంఈఓలు, జిల్లా అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తల్లికి వందనం పథకానికి సంబంధించి జిల్లాలో మొత్తం 2,079 మంది లబ్ధిదారుల వివరాలను పూర్తిస్థాయిలో అప్‌డేట్ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 1,383 మంది వివరాలు మాత్రమే నమోదు చేసారన్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈఓలు, స్వర్ణగ్రామ్ – స్వర్ణవార్డ్ బృందాలు సమన్వయంతో పనిచేసి మిగిలిన వివరాలను గురువారం సాయంత్రంలోపు 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. పోర్టల్‌లో అందుబాటులో ఉన్న వివిధ ఆప్షన్లను సక్రమంగా వినియోగించి తల్లి–బిడ్డ ఆధార్, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పదో తరగతి వరకు చదివే విద్యార్థుల ప్రోత్సాహక నగదు తల్లుల ఖాతాల్లో, ఇంటర్మీడియట్ విద్యార్థులకు నేరుగా వారి ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలోని 1,749 మంది విద్యార్థులకు ఇంకా బ్యాంకు ఖాతాలు ప్రారంభం కాకపోవడం గమనార్హమని, పోస్టాఫీసుల ద్వారా వీలైనంత త్వరగా ఖాతాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ కేసులు అధికంగా ఉన్న మండలాలు, పట్టణ ప్రాంతాల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి గడువులోగా సమస్యలను పరిష్కరించాలని, ఇప్పటికే జీరో పెండింగ్ సాధించిన ప్రాంతాల తరహాలో మిగిలిన ప్రాంతాలు కూడా పనిచేయాలని సూచించారు. ప్రతి నెల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఇతర అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఒకే సచివాలయాన్ని పదేపదే సందర్శించకుండా రొటేషన్ విధానంలో అన్ని సచివాలయాలను పరిశీలించాలని, తనిఖీల ఫోటోలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆధార్ ప్రత్యేక డ్రైవ్‌ను సమర్థవంతంగా నిర్వహించి చిన్నారుల ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్లను వేగవంతం చేయాలని, ఆధార్ లేని అర్హులందరికీ ఆధార్, రైస్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాల విద్యార్థుల ఆధార్ సమస్యలను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈఓలు సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. వెల్ఫేర్ సెక్రటరీలు ప్రతి సోమవారం, గురువారం పాఠశాలలను సందర్శించి టాయిలెట్ల పరిశుభ్రత, మధ్యాహ్న భోజన నాణ్యత, విద్యార్థుల హాజరు, యాప్‌లో నమోదులు తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు. ఎంఈఓలు, హెడ్‌మాస్టర్లు బోధన నాణ్యత, విద్యార్థుల అభ్యాస స్థాయిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, బడి బయట పిల్లల వివరాలపై వాస్తవ సమాచారమే నమోదు చేయాలని ఆదేశించారు. ప్రమాదకరంగా ఉన్న పాఠశాల భవనాల తొలగింపులో ఆలస్యం చేయరాదన్నారు. ఆశ్రమ పాఠశాలలు, రెసిడెన్షియల్ హాస్టళ్లలో తాగునీరు, పారిశుధ్యం, ఆహార నాణ్యత, వార్డెన్ల పనితీరును నిరంతరం పరిశీలించాలని సూచించారు. సచివాలయాల పనితీరుపై ప్రజల అభిప్రాయాలను సేకరించి, సిబ్బంది సమయపాలన, సేవల నాణ్యత, అవినీతి రహిత సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇంటింటి చెత్త సేకరణ, పెన్షన్ పంపిణీ పారదర్శకంగా జరుగుతున్నాయా లేదా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. వాట్సాప్ మిత్ర ద్వారా అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని, ప్రతి సచివాలయం రోజుకు కనీసం ఐదు సేవలను వాట్సాప్ ద్వారానే అందించాలని సూచించారు. ప్రతి స్వర్ణగ్రామ్, స్వర్ణవార్డు సచివాలయంలో క్యూ ఆర్ కోడ్ బోర్డులు ఏర్పాటు చేసి ప్రజల అభిప్రాయాలను సేకరించే విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే కౌశలం కార్యక్రమంపై అధికారులు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని, పరీక్షల నిర్వహణలో డిజిటల్ అసిస్టెంట్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లాలో ఇంకా 258 గ్రామాల్లో ఒడిఎఫ్ + థర్డ్ పార్టీ వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉందని, అధిక పెండింగ్ ఉన్న మండలాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జీరో పెండింగ్ సాధించిన మండలాల పనితీరును ఆదర్శంగా తీసుకుని మిగిలిన మండలాలు కూడా లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ యోజన (పీ ఎంఏ జి వై) కింద కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సకాలంలో వినియోగించి యుటిలైజేషన్ సర్టిఫికెట్లు పంపించాలని, లేనిపక్షంలో తదుపరి నిధుల విడుదలపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ఈ పథకానికి సంబంధించిన పెండింగ్ వ్యయాలను అత్యవసరంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లైబ్రరీ సెస్‌ను ప్రతి నెల నిర్దేశిత గడువులోగా స్వర్ణగ్రామ్ పోర్టల్ ద్వారా చెల్లించేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు ఈ ఆదాయంపైనే ఆధారపడి ఉన్నందున ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నారు.



## శిరివెళ్ల ఈఓగా బాధ్యతలు చేపట్టిన నరసింహ



**శిరివెళ్ల (నంది పత్రిక) :** సిరివెళ్ల మండల కేంద్రంలోని శిరివెళ్ల మేజర్ గ్రామపంచాయతీ ఈఓగా టి నరసింహ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇన్చార్జి ఈవో గా బాధ్యతలు నిర్వహించిన డిప్యూటీ ఎంపీడీవో అశ్విన్ కుమార్ టీ నరసింహ గారికి పదవి బాధ్యతలు అప్పగించి శిరివెళ్ల మేజర్ గ్రామపంచాయతీ భౌగోళిక పరిస్థితులను మౌలిక వసతులను పారిశుధ్యం డ్రైనేజీ డ్రింకింగ్ వాటర్ తదితర అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఈఓ నరసింహ మాట్లాడుతూ మేజర్ గ్రామపంచాయతీలో ఎక్కడైనా పారిశుద్ధ్య లోపం గాని నీటి సమస్య గాని డ్రైనేజీ సమస్య ఉంటే శిరివెళ్ల గ్రామపంచాయతీలో గల కంప్లైంట్ రిజిస్టర్ బుక్ లో ఎంట్రీ చేసి తమ దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. మేజర్ గ్రామపంచాయతీ లో 100% పన్ను వసూళ్లకు కృషి చేస్తానని నూతన భవనం నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించి చేయూతనివ్వాల్సిన అవసరం ఉందని నూతన ఈఓ నరసింహ తెలియజేశారు.

## దళితుల విద్యుత్ మీటర్ల తొలగింపు నోటీసులను ఉపసంహరించుకోవాలి – సీపీఐ



**నంద్యాల ప్రతినిధి. జూలై 15 . (నంది పత్రిక ):**నంద్యాల జిల్లా మహానంది మండలం, పుట్టుపల్లె గ్రామానికి చెందిన దళిత కుటుంబాల వ్యవసాయ విద్యుత్ మీటర్లను తొలగించేందుకు ఇచ్చిన నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం నంద్యాల జిల్లా విద్యుత్ శాఖ ఈఈ (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) ని కలిసి సీపీఐ నంద్యాల జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, సీపీఐ మహానంది మండల కార్యదర్శి సామెలు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి రాజు ఆధ్వర్యంలో నంద్యాల డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యంకి పుట్టుపల్లె గ్రామ దళితులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. పుట్టుపల్లె గ్రామ దళితులు గత నాలుగు దశాబ్దాలుగా (40 సంవత్సరాలుగా) అక్కడి ప్రభుత్వ భూములను నమ్ముకుని, సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. అయితే, కోర్టు ఆదేశాల పేరుతో దళితుల భూముల్లో ఉన్న విద్యుత్ మీటర్లను తొలగించాలని అధికారులు నోటీసులు జారీ చేయడం అత్యంత విచారకరమన్నారు. నోటీసుల్లో పేర్కొన్న సర్వే నంబర్లలోని వివాదాలకు, దళితుల భూములకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. విద్యుత్ అధికారులు ఇచ్చిన నోటీసులకు ప్రభుత్వ రెవెన్యూ, అటవీ శాఖ అధికారులే వివరణ ఇచ్చుకోవాలి తప్ప, పేద దళితులకు ఎలాంటి సంబంధం లేదని, వారు సమాధానం చెప్పాల్సిన అవసరం కూడా లేదన్నారు. తాము వాడుకుంటున్న వ్యవసాయ విద్యుత్ మీటర్ల బిల్లులను దళితులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా కచ్చితంగా చెల్లిస్తున్నారని గుర్తుచేశారు. నాలుగు దశాబ్దాలుగా ఆ భూములపైనే ఆధారపడి బతుకుతున్న పేద దళితులను ఎటువంటి ఇబ్బందులకు గురిచేయవద్దని, విద్యుత్ మీటర్ల తొలగింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మహానంది కార్యదర్శి లక్ష్మణ్..సిపిఐ మండల సహాయ కార్యదర్శి శ్రీనివాసులు. గ్రామ రైతులు. బల రాముడు.బాలరాజు. గాబ్రేలు. హుసేని.జయ్యన్న. నరసింహులు.నాగ శేసుడు.రైతులు పాల్గొన్నారు.

# సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యూడిషల్ మెజిస్ట్రేట్ల నియామకాలు రెండేళ్ల వ్యవధితో చేపట్టాలి

**న్యాయశాఖ మంత్రి ఫరూక్ కు విజ్ఞప్తి చేసిన**
**సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యూడిషల్ మెజిస్ట్రేట్లు**
**న్యాయవాదులకు రక్షణ చట్టం, ఆరోగ్య భీమా**
**కల్పించాలని కోరిన ఐఎల్ఏ ప్రతినిధులు**



**అమరావతి, జులై 15. నంది పత్రిక:**రాష్ట్రంలో వివిధ న్యాయస్థానాల్లో స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ల (సెకండ్ క్లాస్) నియామకాలను రెండేళ్ల కాల వ్యవధితో చేపట్టాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను పలువురు స్పెషల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ లు కోరారు. బుధవారం వెలగపూడి సచివాలయంలోని మూడవ బ్లాక్ లో ఉన్న న్యాయ, మైనారిటీ మంత్రిత్వ శాఖ కార్యాలయంలో మంత్రి ఫరూక్ ను మేజిస్ట్రేట్ లు కలిశారు. ప్రస్తుతం ఒక ఏడాది వ్యవధితో జరుగుతున్న స్పెషల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ల నియామకాల వల్ల కలుగుతున్న ఇబ్బందుల గురించి వారు మంత్రికి వివరించారు. నియామకాలలో, కేసుల నిర్వహణలో జాప్యాన్ని నివారించాలనే ఉద్దేశ్యంతో స్పెషల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ల నియమిత కాలాన్ని ప్రస్తుత ఒక సంవత్సరవ్యవధి నుండి రెండు సంవత్సరాలకు పెంచేందుకు వీలుగా గౌరవ ముఖ్యమంత్రి గారి చొరవతో అసెంబ్లీలో బిల్లు నంబర్ 18/2025 ని తీర్మానించి గౌరవ భారత రాష్ట్రపతి గారి ఆమోదం కోసం రిజర్వు చేయబడినదని త్వరలో ఈ బిల్లు అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

**మంత్రి దృష్టికి న్యాయవాదుల సమస్యలు** ఇండియన్ లాయర్స్ అసోసియేషన్(ఐఎల్ఏ )ప్రతినిధులు న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను కలిసి వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులందరికీ, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఉచితంగా సమగ్ర ఆరోగ్య బీమా కవరేజీని అందించాలని, నగదు రహిత ఆరోగ్య బీమా కార్డులను అందించాలని కోరారు. అర్హులైన జూనియర్ న్యాయవాదులందరికీ, వారు నమోదు చేసుకున్న తేదీ నుండి ఐదు సంవత్సరాల కాలానికి నెలకు రూ.10 వేలు ఆర్థిక సహాయం మంజూరు చేయాలని కోరారు. న్యాయవాదులు తమ వృత్తిపరమైన విధులను నిర్వర్తిస్తున్నప్పుడు, దాడులు, బెదిరింపులకు గురవుతున్నారని ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. న్యాయవాదులకు గృహ స్థలాల కేటాయింపు పై కూడా చర్యలు తీసుకోవాలని మంత్రి ఫరూక్ ను ఐఎల్ఏ ప్రతినిధులు కోరారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ ఆక్ట్ రూపొందించే విషయంలో ఏపీ బార్ కౌన్సిల్ నుండి ప్రతిపాదనలు కోరడమైనదని, మిగతా విషయాలపై న్యాయశాఖ కార్యదర్శితో చర్చించి ప్రణాళిక బద్ధమైన చర్యలు తీసుకుంటామని న్యాయవాదులకు మంత్రి ఫరూక్ హామీ ఇచ్చారు.

## పంటవేసిన ప్రతి రైతు పంట భీమాకు నమోదు చేయండి



**బనగానపల్లె జులై 15నందిపత్రిక** పంటవేసే ప్రతిరైతు తన పంటకు బీమా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయధికారి సుబ్బారెడ్డి రైతులకు తెలిపారు బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా టంగుటూరు కైప మరియు తిమ్మాపురం నందవరం గ్రామంలో నిర్వహించినఈ కార్యక్రమంలో ఏవో రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ముఖ్యంగా ఎల్ ని నో సమస్య వల్ల ఉత్పన్నమయ్యే దుష్పరిమానాలు గురించి వివరించడం జరిగింది మరియు ఏపీ ఐ,ఏపీ ఎంఎస్ ద్వారా ఎరువులు పంపిణీ, గురించి మరియు,కౌలు రైతుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన విధి విధానాల గురించి మరియు పంటల భీమా గురించి, తెలియజేయడం జరిగింది .కార్యక్రమం లో రైతులు గ్రామ పెద్దలు ప్రజా ప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.

## ఇద్దరు దోపిడీ దొంగల అరెస్టు

### చోరీ సొత్తు స్వాధీనం.

**కర్నూలు సిటీ నందిపత్రిక** జూలై 13వ తేదీన నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణానికి చెందిన షఫీ అనే వ్యక్తి హైదరాబాద్ నుంచి కర్నూలుకు వచ్చి, ఆత్మకూరుకు వెళ్లేందుకు బళ్లారి చౌరస్తా వద్ద అర్ధరాత్రి సమయంలో వాహనం కోసం వేచి ఉన్నాడు. ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు అతని వద్దకు వచ్చి గొడవకు దిగడంతో పాటు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారుఅనంతరం అతనిపై దాడి చేసి గాయపరిచి, అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఛార్జర్, మనీ పర్స్‌లో ఉన్న నగదు అపహరించి పరారయ్యారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు దోపిడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను బాలాజీ నగర్‌కు చెందిన మణికుమార్, అరుణ్ కుమార్ లుగా గుర్తించారు. ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది సుబ్బరాయుడు, మురళి కలిసి గాలింపు చేపట్టి నిన్న రాత్రి చెన్నమ్మ సర్కిల్ వద్ద వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకుని, ఇద్దరినీ న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. ప్రాథమిక విచారణలో నిందితులపై గతంలో కూడా పలు కేసులు నమోదైనట్లు గుర్తించారు.మణికుమార్‌పై రెండు, అరుణ్ కుమార్‌పై ఐదు కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.వీటిలో ఇంటి కన్నం దొంగతనాలు, మోటార్‌సైకిల్ దొంగతనం కేసులు ఉన్నాయి. ప్రజలకు విజ్ఞప్తి ఎక్కడైనా నేరం, అనుమానాస్పద వ్యక్తులు లేదా అత్యవసర పరిస్థితులు కనిపించిన వెంటనే డయల్ 112కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కర్నూలు పోలీసులు విజ్ఞప్తి చేశారు.



## ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఆర్ సురేష్ బాబుకు డిగ్రీ లెక్చరర్ గా పదోన్నతి.



**నందికొట్కూరు జూలై 15( నంది పత్రిక )** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు జంతు శాస్త్ర అధ్యాపకునిగా మరియు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గా పని చేస్తున్న ఆర్ సురేష్ బాబు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డిగ్రీ లెక్చరర్ గా పదోన్నతి పొందారు. అధ్యాపకులు ఆర్ సురేష్ బాబు జూపాడు బంగ్లా మండలం భాస్కరపురం గ్రామానికి చెందిన భిలాయి దేవ సహాయం మరియమ్మ దంపతుల కుమారుడు. ఈయన 2008నుండి 2012 వరకు ఇడుపులపాయలోని త్రిబుల్ ఐటీ లో అధ్యాపకుడిగా బాధ్యతలు ఏపీపీఎస్సీ నిర్వహించిన జేఎల్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి 2012లో హొలగుంద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జంతు శాస్త్ర అధ్యాపకుడిగా నియమితులయ్యారు. తర్వాత గోనెగండ్లకు బదిలీ ఆయన అనంతరం 2021లో నందికొట్కూరు ప్రభుత్వ జూనియర్ కాలేజ్ బదిలీపై వచ్చి జంతు శాస్త్ర అధ్యాపకుని గా విధులు నిర్వహిస్తూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గా అనేక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల ఎదుగుదలకు ఎన్నో ప్రోత్సాహకర చేయూతను అందిస్తూ జూనియర్ కళాశాల నందు మారుమూల గ్రామాల విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరేలా శతవిధాలుగా కృషిచేసి జూనియర్ కళాశాల నందు విద్యార్థుల అడ్మిషన్ల పెంపుదలకు ఎంతో కృషి చేశారు. రెండు రోజుల క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కల్పించిన పదోన్నతులలో భాగంగా ఆయన ప్రభుత్వ డిగ్రీ అధ్యాపకునిగా పదోన్నతి పొంది ఆత్మకూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ అయ్యారు. దీంతో పదోన్నతి పొందిన ఆర్ సురేష్ బాబుకు సహచర అధ్యాపకులు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు గ్రామ ప్రజలు పలువురు అభినందనలు తెలిపారు.

## ఎమ్మెల్యే మాతృమూర్తికి ఘన నివాళి...

### ఖాజీపేట టీడీపీ నాయకులు

**ఖాజీపేట నంది పత్రిక ప్రతినిధి** మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాతృమూర్తి పుట్టా పొలమ్మ కు పలువురు బుధవారం ఘనంగా నివాళులు అర్పించారు. పొద్దుటూరులో పుట్టా సుధాకర్ యాదవ్ నివాసం లో ఖాజీపేటకు చెందిన పలువురు నాయకులు పుట్టా పోలమ్మ చిత్రపటం వద్ద పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కలిశారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తో పాటు ఆయన తనయుడు ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్ట మహేష్ కుమార్ యాదవ్ ను కలసి సానుభూతి వ్యక్తం చేస్తూ ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ సీనియర్ నాయకులు సందుల నాగ శివా రెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ ఇట్టేశీ శ్రీరాముల యాదవ్, శ్రీనివాసపురం పాఠశాల విద్యా కమిటీ మాజీ చైర్మన్ కృష్ణ యాదవ్, డీలర్ సుబ్బారెడ్డి, లక్కు పుల్లారెడ్డి , మామిళ్ళ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# అన్ని పంటలకూ ఉచిత బీమా వర్తింపజేయాలి!

### వాతావరణ ఆధారిత బీమా గడువును ఆగస్టు 31 వరకు పొడిగించాలి!

### ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య



**కర్నూలు సిటీ నందిపత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రైతాంగ ప్రయోజనాలను కాపాడేందుకు, అన్ని పంటలకు ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని మరియు రైతుల వాటా బీమా ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలోని దాసరి భవన్ నందు ఆయన అధ్యక్షతన జరిగిన రైతు సంఘం రాష్ట్ర సమితి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆగస్టు 17వ తేదీనరాష్ట్రవ్యాప్తంగా అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల స్థిరీకరణ నిధి కింద రూ.1000 కోట్ల కేటాయించి ప్రభుత్వ ఏజెన్సీ ద్వారానే కిలో పొగాకును సగటు ధర రూ. 250,జంగారెడ్డిగూడెం ఏరియాలోని పొగాకును రూ.300లకు తగ్గకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన రొయ్యల మేతల ధరలు పూర్తిగా తగ్గించాలని, రొయ్యలకు మద్దతు ధర ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని కోరారు జూన్ 1 నుండి నేటి వరకు రాష్ట్రంలో సరాసరి వర్షపాతం మైనస్ 45.1% లోటుగా నమోదైందని, ఇది వర్షాధార పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఈశ్వరయ్య పేర్కొన్నారు. రాష్ట్రంలోని 4 జిల్లాల్లో మైనస్ 60% కంటే ఎక్కువ తీవ్ర లోటు ఉండగా, మిగిలిన అన్ని జిల్లాల్లోనూ మైనస్ 20% నుండి మైనస్ 59% వరకు లోటు వర్షపాతం నమోదైందన్నారు. వ్యవసాయ శాఖ నివేదికల ప్రకారం.. ఈ ఖరీఫ్ సాధారణ సాగులో ఇప్పటివరకు కేవలం 12% మాత్రమే సాగు జరగడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.రాష్ట్రంలో వరి తర్వాత అత్యధికంగా సాగు అయ్యే ప్రత్తి, వేరుశనగ పంటలు పూర్తిగా వర్షాధారంపైనే ఆధారపడి ఉన్నాయి. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు లేక విత్తనాలు వేయడం ఆలస్యమైందని, ఒకవేళ ఇదే పరిస్థితి కొనసాగితే రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లాల్సి వస్తుందని ఆయన అన్నారు. ప్రస్తుతానికి ఈ పంటల వాతావరణ బీమా ప్రీమియం చెల్లింపు గడువు జులై15తోముగుస్తుండటంతో రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉందన్నారు. "దక్షిణ భారతదేశంలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే రోజుల్లోనూ సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ అంచనాలు చెబుతున్నాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రైతుల మానసిక ఒత్తిడిని, ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పంటల బీమా పథకం,వాతావరణ ఆధారిత పంటల బీమా ప్రీమియం చెల్లింపు గడువును ఆగస్టు 31 వరకు పొడిగించాలని కోరారు.ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బీమా గడువును పొడిగించేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆగస్టు 17న జరగబోయే డివిజన్ స్థాయి ఆందోళనల్లో రైతులంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.కాటమయ్య, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిపి.జమలయ్య,ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఉపాధ్యక్షులు ఏ రామానాయుడు, మల్నీడి యలమందారావు, వి.హనుమారెడ్డి,రాష్ట్ర కార్యదర్శులు దేగా ప్రభకర్,చిరుతల మల్లికార్జున,కె. జగన్నాథం,ఉల్వలపూడి రాము తదితరులు పాల్గొన్నారు.

## విజయవిహారం రమణ మూర్తిపై ఆర్ ఎస్ ఎస్ గూండాల దాడిని ఖండిస్తున్నాం

### సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య



**కర్నూలు సిటీ నందిపత్రిక** హైదరాబాద్‌లో ఒక న్యూస్ ఛానల్‌లో జరిగిన చర్చావేదికలో విజయవిహారం ఎడిటర్ రమణ మూర్తిపై ఆర్ ఎస్ ఎస్ గూండాలు దాడి చేయడాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య తీవ్రంగా ఖండించారు.ఈ మేరకు బుధవారం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నక్కి లెనిన్ బాబు తో కలిసి సీ.ఆర్. భవన్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఒక న్యూస్ ఛానల్‌లో జరుగుతున్న చర్చావేదికలో చర్చను ఎదుర్కోలేక విజయవిహారం ఎడిటర్ రమణ మూర్తి పై ఆర్ యస్ యస్ గూండా కశ్యప్‌రెడ్డి చెప్పుతో కొట్టి భౌతికదాడికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు ఇది సభ్య సమాజం తలదించుకునే విషయం. కశ్యప్‌రెడ్డి రమణమూర్తి పై దాడి చేయడం దుర్మార్గం. ప్రధాని నరేంద్రమోడీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా పత్రికల్లో వచ్చినఅడ్వర్టయిజ్‌మెంట్‌లలో శ్రీకృష్ణుడి తల తొలగించి ఆ స్థానంలో మోడీ బొమ్మ వచ్చేటట్లు చేయడాన్ని ప్రజలంతా వీక్షించారు.హిందూ మతంపైనగాని, హిందూ ధర్మంపైనగాని, ధార్మిక వ్యవస్థలపైనగాని ఏమాత్రం నమ్మకం లేని సంస్థ ఆర్ ఎస్ ఎస్ అని చెప్పవచ్చు. దానికి ప్రతిరూపం కశ్యప్‌రెడ్డి లాంటి గూండాలు అనేది తేటతెల్లమవుతోంది. రమణమూర్తి లాంటి వారి మేధోసంపత్తిని ఎదుర్కోలేక భౌతికదాడికి పూనుకోవడం అత్యంత దుర్మార్గం. ఛానల్ వాళ్లు కూడా కశ్యప్‌రెడ్డి లాంటి వ్యక్తులను చర్చకు పిలిచే సందర్భంలో వారి స్థాయి, అర్హత, విజ్ఞానం, ఎదుటివారి ప్రశ్నలను గమనిస్తారా లేదా, వాటిని సమర్థిస్తారా లేదా అనే అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి. అలాకాకుండా కశ్యప్‌రెడ్డి లాంటి వాళ్లను పిలిస్తే ఆయా ఛానళ్ల ప్రతిష్ఠ కూడా దెబ్బతింటుందని తెలియజేస్తున్నాం. రమణమూర్తిపైన జరిగిన దాడిని అభ్యుదయ కాముకులపైన, ప్రజాస్వామిక వాదులపైన, మేధావులపైన జరిగిన దాడిగా భావిస్తున్నాం. ప్రజాతంత్ర వాదులంతా ఈ దాడిని తీవ్రంగా ఖండించాలనికోరుతున్నాం. ప్రశ్నను సహించలేని వ్యవస్థను పెంచిపోషిస్తున్న ఆర్ ఎస్ ఎస్ సంస్థ చర్యలను తప్పుబడుతూ, కశ్యప్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రశ్నించే వారిని గొంతు నొక్కడానికి ఉపా లాంటి చట్టాలను ఉపయోగించడం ప్రశ్నించే వారిని భయాందోళనలకు గురి చేయడమే అని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రశ్నా రావణ్ పై పెట్టిన ఉపా చట్టాన్ని వెంటనేఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు డి .రాజా సాహెబ్, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, షాబీర్ భాషలు పాల్గొన్నారు

# విద్యార్థుల భవిష్యత్తుతో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చెలగాటమాడొద్దు





### ఫీజు రీయింబర్స్‌మెంట్ 6400 కోట్లకు పైగా బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### ప్రభుత్వ బిసి, ఎస్సీ ఎస్టీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

### కర్నూలు నగరంలో మూతపడ్డ హాస్టల్స్ ను తిరిగి ప్రారంభించాలి

### ఉన్నత చదువుకు శాపంగా మారిన జీవో నెం.77ను రద్దు చేయాలి

### పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు పెంచాలి

### ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా

**కర్నూలు సిటీ నందిపత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ 6400 కోట్ల బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఉన్నత చదువుకు శాతంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ కర్నూలు జిల్లా సమితి ఆధ్వర్యంలో సి ఆర్ భవనం నుండి ర్యాలీగా కలెక్టరేట్ కార్యాలయం వద్ద వచ్చి మహాధర్నా కార్యక్రమం నిర్వహించి దాదాపు గంటపాటు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఇస్తూ గేటు ముందర బేటాయించారు అనంతరం డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ ప్రసన్న కుమారి కి వినతిపత్రంఅందజేశారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ కర్నూలు జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శి డి.సోమన్న, యస్ షాబీర్ భాష లు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల సమస్యల పట్ల సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి తీవ్రంగా ఖండిస్తోంది.రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం ఒత్తిడి తెస్తుంటే ప్రభుత్వం మాత్రం ప్రేక్షక పాత్ర పోషించడం దురదృష్టకరం. విద్యార్థుల చదువులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం వారి భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టడంబాధ్యతారాహిత్యానికి నిదర్శనం. ఫీజు రీయింబర్స్మెంట్ అందకపోవడంతో విద్యార్థులు కోర్సు పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందక వచ్చిన ఉద్యోగాలకు వెళ్లలేక ఇబ్బందులుఎదుర్కొంటున్న పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు తీసుకొస్తామని చెబుతున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పరిశ్రమలు వస్తే దానిలో ఉద్యోగాలు చేయడానికి విద్యార్థుల దగ్గర ఈ రాష్ట్రంలో సర్టిఫికెట్లు లేవని మండిపడ్డారు ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో విద్యార్థులు కనీస మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. నాణ్యమైన భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత, వసతి వంటి ప్రాథమిక అవసరాలను కూడా సమకూర్చడంలో ప్రభుత్వం విఫలమైంది. సంక్షేమం గురించి గొప్పలు చెప్పే ప్రభుత్వం, హాస్టళ్లలోని వాస్తవ పరిస్థితులపై వెంటనే దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు 3000 రూపాయలకు పెంచాలన్నారు కాస్మోటిక్ చార్జీలు 300 పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో అద్దె భవనాల్లో ఉంటున్న ప్రభుత్వ హాస్టల్స్ కు నిధులు కేటాయించి సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు కర్నూలు జిల్లాలో కొన్ని మూతబడి ఉన్న ప్రభుత్వ హాస్టల్ కు నిధులు కేటాయించి మరమ్మతులు చేసి ప్రారంభించాలన్నారు పీజీ విద్యార్థుల ఉన్నత విద్యకు అడ్డంకిగా మారిన జీవో నెం.77ను ప్రభుత్వం వెంటనేఉపసంహరించుకోవాలి. యువగలం పాదయాత్రలో మన ప్రభుత్వ అధికారంలోకి వస్తేనే వందరోజుల్లో జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని హామీ ఇచ్చి నేటికి ఈ అంశం పైన విద్యాశాఖ మంత్రి ఏ మాత్రం కూడా మాట్లాడటం లేదని మండిపడ్డారు.రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు 6400కు పైగా విడుదల చేయాలన్నారు ప్రభుత్వ బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ రంగస్వామి, శరత్ కుమార్ , దస్తగిరి, నగర అధ్యక్ష కార్యదర్శి అభిరామ్, అశోక్, నాయకులు శేఖర్, అల్తాఫ్, శ్రీకాంత్, హాజీ, సుధాకర్, అఖిల్ , ఉమామహేశ్వరి, రాజేశ్వరి, భార్గవి, వీరేష్, మహేష్, విద్యార్థిని విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు

## అసాంఘిక కార్యకలాపాలపై కర్నూలు నాల్గవ పట్టణ పోలీసుల వరుస దాడులు

### నలుగురు నిర్వాహకులు అరెస్ట్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని టైలర్స్ కాలనీలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే విశ్వసనీయ సమాచారం మేరకు కర్నూలు నాల్గవ పట్టణ పోలీసులు దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో కర్నూలు జిల్లా సి. బెళగల్ మండలానికి చెందిన మల్లెపోగు ఏసన్న, మల్లెపోగు రాజు, అశోక్‌నగర్‌కు చెందిన అన్నెపోగు రాఘవేంద్ర, ముడుమాలగుర్తి కి చెందిన పోలదాసు మాసమన్నలను నిర్వాహకులుగా గుర్తించి అరెస్టు చేశారు.ఈ ఘటనపై ప్రివెన్షన్ ఆఫ్ ఇమ్మోరల్ ట్రాఫిక్ యాక్ట్ (పిటా ) కింద కేసు నమోదు చేసి, నిందితులను న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా గౌరవ న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు, తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని కర్నూలు నాల్గవ పట్టణ సీఐ విక్రమ్ సింహ తెలిపారు.

**ప్రజలకు విజ్ఞప్తి...** తమ పరిసరాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు లేదా ప్రజలకు ఇబ్బందులు కలిగించే సంఘటనలు జరిగినా, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినా వెంటనే డయల్ 112కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కర్నూలు పోలీసులు ప్రజలను విజ్ఞప్తి చేశారు.

## రాజీవ్ గృహకల్పలో మౌలిక వసతులు కల్పించాలి

### సిపిఐ నగర కార్యదర్శి దంభోళం శ్రీనివాసరావు



**కర్నూలు సిటీ నందిపత్రిక** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కర్నూలు నగర సహాయ కార్యదర్శి దంభోళం శ్రీనివాసరావు రాజీవ్ గృహకల్ప కాలనీలో నెలకొన్న తాగునీరు, పారిశుద్ధ్యం, మురుగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు.మున్సిపల్ కమిషనర్ 36వ వార్డులోని రాజీవ్ గృహకల్ప కాలనీని సందర్శించిన సందర్భంగా, స్థానిక ప్రజలతో కలిసి దంభోళం శ్రీనివాసరావు కాలనీలోని పలు సమస్యలను ప్రత్యక్షంగా చూపించి వినతిపత్రం అందజేశారు. కాలనీలో కొన్ని బోర్లు చెడిపోవడంతో కొన్ని బ్లాకుల ప్రజలకు తాగునీరు అందడం లేదని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే సెప్టిక్ ట్యాంకులు నిండిపోవడంతో మురుగు బయటకు వస్తోందని, వాటిని అత్యవసరంగా శుభ్రం చేయాలని విజ్ఞప్తి చేశారు.మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో మురుగునీరు నిలిచిపోయి, ఈగలు, దోమలు, క్రిమికీటకాలు పెరిగి డెంగ్యూ, మలేరియా, చర్మవ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు.వినతిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ కాలనీలోని సమస్యలన్నింటినీ త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎన్. ఆంజనేయులు, రాందాసు, చంద్ర, బన్నీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# దానయ్య కుటుంబానికి ఏం సమాధానం చెప్తావు జగన్

### ఉమ్మడి కర్నూలు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మరియు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై నాగేశ్వరావు యాదవ్

**కర్నూలు సిటీ నందిపత్రిక** 18 ఏళ్ల కుర్రాడు చంపేస్తే తప్పు లేదా మరి వారి కుటుంబానికి నీవు పోషిస్తావా జగన్ అంటూ ధ్వజమెత్తిన వై. నాగేశ్వరరావు యాదవ్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ పోతురాజు రవికుమార్ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమార్ టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప బుధవారం వై. ఎన్.ఆర్. కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శుక్రవారం రాత్రి పలాసలో మాజీమంత్రి అప్పలరాజుపెద్దకుమారుడు ఆరవ్ వర్మ బుల్లెట్ ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా నడుపుతూ.. రోడ్డుపై వెళ్తున్న గొర్రెల కాపరి దుబ్బ దానయ్యనుఢీకొట్టాడు.ప్రమాదంలో నిరుపేద ప్రాణం పోవడానికి కారకుడైన తన కుమారుడిని చట్టం నుంచి తప్పించేందుకు మాజీమంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజు ఆడిన నాటకం బట్టబయలైంది. వ్యవస్థలను తప్పుదారి పట్టించి, తన ప్రధాన అనుచరుడితో నేరం ఒప్పించాలని పన్నిన కుయుక్తులు బెడిసికొట్టాయి. అన్నీ తెలిసిన జగన్ దానయ్య కుటుంబాన్ని పరామర్శించక పోగా, కేవలం 18 సంవత్సరాల అబ్బాయికి తెలిసి తెలియని వయసు, కావాలని ఆక్సిడెంట్ చేయలేదని మాజీ మంత్రి కొడుకును వెనుకేసుకొని వచ్చిన జగన్ కి సిగ్గుందా అని ఈ సందర్భంగా ప్రశ్నిస్తున్నాం. జగన్ మాట్లాడే విధానం ఎలా ఉందంటే ఎవర్నైనా చంపొచ్చు మా పార్టీలో అది తప్పుకాదు అన్నట్టు ఉంది. సిగిరి అప్పలరాజును దండించాల్సింది పోయి, జగన్ సమర్థించాలని ప్రయత్నించడం సిగ్గుచేటు జగన్ కు యాదవులంటే చిన్నచూపు అని ఆయన మాటలలో తేలిపోయింది. డబ్బు లేని నిరుపేద ప్రాణానికి విలువ లేదా జగన్. దానయ్య కుటుంబం పక్షాన నిలబడేది పోయి, అప్పలరాజు కొడుకు తప్పులేదు అన్నట్లు మాట్లాడుతున్న నీ మాటలు రాష్ట్ర ప్రజలు మరియు యాదవులందరూ చూస్తూ వ్యతిరేకిస్తున్నారని తెలుసుకో బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోగా వారి కుటుంబానికి అండగా ఉంటామంటూ భరోసా ఇవ్వకపోగా వారిది ప్రాణమే కాదన్నట్టు మాట్లాడుతున్న జగన్ అప్పలరాజు కుమారుడిని శిక్షించే వరకు యాదవులందరం వదిలిపెట్టమని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నాం. ఎన్డీఏ ప్రభుత్వం ఎల్లప్పుడూ దానయ్య కుటుంబానికి అండగా ఉంటుందని, వారి కుటుంబానికి టీడీపీ ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇవ్వడం జరిగిందని ఈసందర్భంగాముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి లోకేష్ బాబు కి పవన్ కళ్యాణ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు యాదవులందరూ తరుపున తెలియజేయడం జరిగింది .



## ట్రాక్టర్ ప్రమాదంలో ధ్వంసమైన మోటార్ సైకిల్.

### శిరివెళ్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన రిపోర్టర్

### దేశ పోరాటం న్యూస్ సిరివెళ్ల

**శిరివెళ్ల(: నంది పత్రిక)** మండల కేంద్రంలోని కాపు పేటకు చెందినటువంటి గంతి వెంకటసుబ్బయ్య అను విలేకరి ట్రాక్టర్ ప్రమాదంలో తను తృటిలో తప్పించుకొని ప్రాణాలతో బయటపడగా మోటార్ సైకిల్ ధ్వంశమైన సంఘటనలో ఆయన బుధవారం శిరివెళ్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మోటార్ సైకిల్ మరమ్మత్తులకు గురి అయినప్పటికీ ప్రమాదానికి కారణమైన వారు స్పందించకపోగా దురుసుగా ప్రవర్తించడం పట్ల విలేకరి ఆవేదన వ్యక్తం చేస్తూ కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణం అయిన ట్రాక్టర్ను సీజ్ చేసి న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించాడు.



# ఆదోనిలో బాల్య వివాహాన్ని అడ్డుకున్న శక్తి టీం: నిలిచిపోయిన 8వ తరగతి బాలిక పెళ్లి

**కౌన్సెలింగ్‌తో మనసు మార్చుకున్న తల్లిదండ్రులు - చట్టపరమైన నిబంధనలు వివరించి బాలిక భవిష్యత్తును కాపాడిన అధికారులు**




ఆదోని నంది పత్రిక ప్రతినిధి కర్నూలు జిల్లా, ఆదోని మండలంలోని ఇస్వి గ్రామంలో జరగబోతున్న ఒక బాల్య వివాహాన్ని 'శక్తి' టీం సభ్యులు సకాలంలో స్పందించి అడ్డుకున్నారు. 8వ తరగతి చదువుతున్న బాలికకు వివాహం చేసేందుకు కుటుంబ సభ్యులు చేస్తున్న ఏర్పాట్లను గుర్తించిన అధికారులు, సమన్వయంతో ఆ వివాహాన్ని రద్దు చేయించి బాలికా విద్యకు భరోసా కల్పించారు.

**ఘటన నేపథ్యం:** ఇస్వి గ్రామంలో మైనర్ బాలికకు నిశ్చితార్థం జరిగి, త్వరలో వివాహం జరిపించేందుకు కుటుంబీకులు సిద్ధమవుతున్నట్లు శక్తి టీంకు విశ్వసనీయ సమాచారం అందింది. సమాచారం అందుకున్న వెంటనే శక్తి టీం సభ్యులు రాజేశ్వరి, వీరాంజినేయులు తక్షణమే స్పందించి, సంబంధిత అధికారులతో కలిసి గ్రామానికి వెళ్లారు. బాలిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో సమావేశమైన అధికారులు, బాల్య వివాహం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, ఇది శిక్షార్హమని స్పష్టం చేశారు. చిన్న వయసులో వివాహం చేయడం వల్ల బాలిక ఆరోగ్యంపై పడే ప్రభావాలు, చదువు ఆగిపోవడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ.. బాలికను ఉన్నత చదువులు చదివించి, ఆమె భవిష్యత్తును బంగారుమయం చేయాలని తల్లిదండ్రులకు హితబోధ చేశారు. అధికారుల వివరణతో వాస్తవాలను గ్రహించిన కుటుంబ సభ్యులు, వివాహాన్ని రద్దు చేసుకునేందుకు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు రాజేశ్వరి, వీరాంజినేయులు, ఇస్వి పోలీస్ స్టేషన్ సిబ్బంది షేక్ సత్, పీసీ నాగరాజు, ఐసీడీఎస్ సూపర్వైజర్ పుష్పవతి, వీఆర్వో, సచివాలయం డిజిటల్ వెల్ఫేర్ & ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, సీహెచ్‌వో పద్మావతి, అంగన్‌వాడీ టీచర్ మమత తదితరులు పాల్గొన్నారు. బాల్య వివాహాలు లేని సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు కోరారు. ఎక్కడైనా మైనర్ బాలికల వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే, వెంటనే సంబంధిత పోలీసు, అంగన్‌వాడీ, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఐటీ హబ్ గా పశ్చిమ గోదావరి జిల్లా భవన యజమానులు ముందుకు రావాలి:

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

భీమవరం బ్యూరో చీఫ్ జూలై 15 నంది పత్రిక పశ్చిమ గోదావరి జిల్లాను ఐటీ హబ్ గా అభివృద్ధి చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లాలో ఐటీ పరిశ్రమల స్థాపనకు అనువైన కమర్షియల్ భవనాలు, కార్యాలయ స్థలాలు, ఖాళీ భూముల వివరాలను ప్రభుత్వం రూపొందించిన ttt.ap.gov.in పోర్టల్లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఐటీ రంగ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా జిల్లాలో అందుబాటులో ఉన్న కమర్షియల్ భవనాలు, కార్యాలయ స్థలాలు, ఖాళీ భూముల వివరాలను పోర్టల్లో నమోదు చేయడం ద్వారా పెట్టుబడులను ఆకర్షించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. భవన యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం జిల్లా ఐటీ అధికారి కావ్యను 7207702737 సంప్రదించాలని సూచించారు.



# ఆర్టీసీ బస్టాండ్‌లో దాడి ఘటన . ముగ్గురు నిందితులు అరెస్టు.



కర్నూలు సిటీ నందిపత్రిక గోరంట్ల గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి కర్నూలు ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్‌లో టీ స్టాల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. జూలై 13వ తేదీ అర్ధరాత్రి సమయంలో కర్నూలు ఇందిరానగర్‌కు చెందిన ఉదయ్ కుమార్, వినోద్, నవీన్ టీ స్టాల్ వద్దకు వచ్చి టీ, సిగరెట్లు ఇవ్వాలని కోరారు. సిగరెట్ల ధర విషయంలో టీ స్టాల్ యజమాని నాగరాజు, నిందితుల మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారితీసింది. ఈ క్రమంలో నిందితులు మరుగుతున్న వేడి టీ ఉన్న పాత్రను నాగరాజుపైకి విసరడంతో అతని ఛాతి భాగంలో బొబ్బలతో కూడిన కాలిన గాయాలయ్యాయి. వెంటనే బాధితుడిని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులైన ఉదయ్ కుమార్, వినోద్, నవీన్ లను అరెస్టు చేసి, న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా గౌరవ న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

**ప్రజలకు విజ్ఞప్తి...** చిన్నచిన్న విషయాలకు గొడవలకు దిగకుండా సంయమనంతో వ్యవహరించాలని, ఎక్కడైనా నేరాలు, గొడవలు, అనుమానాస్పద వ్యక్తులు లేదా అత్యవసర పరిస్థితులు కనిపించిన వెంటనే డయల్ 112కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కర్నూలు పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# పేకాట ఆడుతున్న వ్యక్తులు అరెస్ట్

**- ఎస్సై జయ శేఖర్**

కొత్తపల్లె – నంది పత్రిక : నలుగురు పేకాటరాయిలను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయ శేఖర్ తెలిపారు బుధవారం మండల కేంద్రంలోని ఆర్ఎస్ఆర్ దాబా సమీపంలో అందరు బహార్ జూదం ఆడుతున్న రామకృష్ణకోట మల్లికార్జున రెడ్డి, కొత్తపల్లె, ఎర్ర మల్లారెడ్డి, బావాపురం, రామకృష్ణకోట వెంకటస్వామి రెడ్డి, కొత్తపల్లె, భూమిరెడ్డి రామకృష్ణారెడ్డి, వీరాపురం గ్రామం వారిని పేకాట ఆడుచుండగా, అరెస్టు చేసి వారి వద్ద వున్న 10,200/- నగదు ను స్వాధీనపరచుకొని కేసు నమోదు చేసామని ఎస్సై జయ శేఖర్ తెలిపారు

# టీ బి వ్యాధి పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కోడూరు సహకార సంఘం చైర్మన్ దానమయ్య



కర్నూల్ సిటీ నంది పత్రిక కర్నూలు జిల్లా గూడూరు మండలంలో బుధవారం అనగా 15-07-2026 క్షయవ్యాధి (టీబీ)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కేడీసీసీ చైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆధ్వర్యంలో గూడూరు సహకార సంఘం చైర్మన్ బొంగు దానమయ్య మరియు టీ.బి ఆఫీసర్ మహేంద్ర, మల్లికార్జున్ సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, టీబీ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సరైన వైద్యసేవలు పొందడం ఎంతో అవసరమని తెలిపారు. చికిత్సను మధ్యలో ఆపకుండా పూర్తిగా తీసుకోవాలని, అలాగే ప్రజల్లో టీబీపై అవగాహన పెంచడం ద్వారా వ్యాధి నియంత్రణ సాధ్యమని అన్నారు. ఆరోగ్య సిబ్బంది టీబీ లక్షణాలు, వ్యాప్తి, నివారణ మార్గాలపై ప్రజలకు వివరించారు. నిరంతర దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రజలు ప్రభుత్వం చేపడుతున్న టీబీ నిర్మూలన కార్యక్రమాలకు సహకరించి, ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి తోడ్పడాలని నాయకులు పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన ఆరోగ్య శాఖ సిబ్బందిని వారు అభినందించారు.

# సాధనలో సమ్మిళితం - భారత ప్రగతి పథంలో అందరి భాగస్వామ్యం



న్యూఢిల్లీ, నంది పత్రిక జూలై 15. ఏటా భారత అత్యున్నత పౌర పురస్కారాల ప్రకటన కేవలం ఒక జాబితా మాత్రమే కాదు; అది మన దేశ ప్రాధాన్యతలు, విలువలు మరియు ఆకాంక్షలను ప్రతిబింబించే ఒక అద్దం. పద్మ పురస్కారాలు మరియు ఇతర జాతీయ గౌరవాలు, లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపి, దేశాభివృద్ధికి విశేష కృషి చేసిన వారిని సత్కరిస్తాయి. ఈ క్రమంలో, తమ అపారమైన ప్రతిభతో, నిబద్ధతతో గుర్తింపు పొందుతున్న పలువురు ముస్లిం విశిష్ట వ్యక్తుల విజయాలు.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ప్రతిభకు, ప్రజా సేవకు ఉన్న గౌరవాన్ని చాటిచెబుతున్నాయి. భారతదేశం నేడు ప్రపంచ ఆర్థిక మరియు వ్యూహాత్మక శక్తిగా ఎదుగుతున్న తరుణంలో, ఈ పురస్కారాలు ఒక ముఖ్యమైన నిజాన్ని గుర్తుచేస్తున్నాయి : "దేశ నిర్మాణం అనేది ఒక సమిష్టి ప్రయత్నం." వివిధ ప్రాంతాలు, భాషలు, సంస్కృతులు మరియు విశ్వాసాలకు చెందిన వ్యక్తుల సమ్మిళిత శక్తితోనే మన దేశం ముందుకు సాగుతోంది. ఈ పురస్కారాలు కేవలం ఒక వర్గానికి పరిమితమైనవి కావు; ఇవి కులమతాలకతీతంగా, కేవలం మెరిట్ (ప్రతిభ) మరియు సేవలను మాత్రమే ప్రామాణికంగా తీసుకునే మన దేశ ఉదారవాద దృక్పథానికి నిదర్శనం. ప్రొఫెసర్ ఫైజ్ షేక్ వంటి విద్యావేత్త సేవలను గుర్తించడం ద్వారా, విద్యకు మన దేశం ఇస్తున్న ప్రాముఖ్యత వ్యక్తమవుతోంది. అలాగే, గఫారుద్దీన్ మేవాతి జోగీ (జానపద కళాకారుడు), మీర్ హాజీ కాసం (ఢోలక్ విద్వాంసుడు) మరియు నూరుద్దీన్ అహ్మద్ (శిల్పి) వంటి వారు తమ కళా నైపుణ్యంతో భారతీయ సంస్కృతిని కాపాడుతున్న తీరు అభినందనీయం. వీరు తమ అసాధారణ ప్రతిభతో కళ, సంగీతం మరియు జానపద సంప్రదాయాలకు ప్రాణం పోస్తున్నారు. ఈ పురస్కారాల ప్రాముఖ్యత కేవలం వ్యక్తులకు దక్కిన గుర్తింపుతో ఆగిపోదు. పారిశ్రామికవేత్తలు ఆర్థిక వృద్ధిని వేగవంతం చేస్తే, ఉపాధ్యాయులు యువతను తీర్చిదిద్దుతారు. శాస్త్రవేత్తలు జ్ఞానాన్ని విస్తరిస్తే, సామాజిక కార్యకర్తలు అణగారిన వర్గాల అభ్యున్నతికి బాటలు వేస్తారు. ఇలా వివిధ రూపాల్లో దేశానికి సేవ చేస్తున్న ప్రతి ఒక్కరినీ ఈ పురస్కారాలు గౌరవిస్తాయి. భారతదేశం తన సుదీర్ఘ ప్రయాణంలో ప్రతి రంగంలోనూ ముస్లిం మేధావుల భాగస్వామ్యాన్ని చూసింది. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారు మనందరికీ ఒక స్ఫూర్తిప్రదాత. "ప్రజల రాష్ట్రపతి"గా ఆయన చూపిన బాట, విద్య విజ్ఞానాల పట్ల ఆయనకున్న అంకితభావం నేటి యువతకు ఎప్పటికీ ఒక దిశానిర్దేశం. అలాగే, ఏఆర్ రెహమాన్ వంటి సంగీత ప్రపంచ దిగ్గజాలు మన దేశ కీర్తిని అంతర్జాతీయ వేదికలపై ఇనుమడింపజేశారు. నేడు భారత్ ప్రపంచంలోనే అత్యంత యువ జనాభా కలిగిన దేశం. డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి ప్రతిష్టాత్మక పథకాలతో దేశం దూసుకుపోతోంది. ఈ అభివృద్ధి యాత్రలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం కీలకం. ఆ విజయపథంలో నడవాలనుకునే యువతకు, ఈ పురస్కార గ్రహీతల జీవితాలే ఆదర్శం. ఏ నేపథ్యం నుంచి వచ్చామన్నది ముఖ్యం కాదు, మనం దేశానికి చేస్తున్న సేవ, సాధిస్తున్న ప్రగతి మాత్రమే శాశ్వత గుర్తింపునిస్తుందని వీరు నిరూపిస్తున్నారు. ఈ విజయాలను మనం సంకుచిత దృష్టితో చూడకూడదు. ఒక కళాకారుడు తన కళతో దేశ గౌరవాన్ని పెంచినా, ఒక శాస్త్రవేత్త కొత్త ఆవిష్కరణ చేసినా, అది యావత్ భారత దేశానికి గర్వకారణం. మన దేశ వైవిధ్యమే మనకు బలం. భాషలు, సంస్కృతులు వేరైనా, దేశాభివృద్ధి అనే ఉమ్మడి లక్ష్యం మనందరినీ ఒక్కటిగా నిలబెడుతుంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌గా అవతరించాలనే లక్ష్యం వైపు మనం అడుగులు వేస్తున్నాం. సాంకేతికత, విద్య, వైద్యం, ఆవిష్కరణల రంగాల్లో ప్రతి పౌరుడి కృషి మనకు అవసరం. ఈ పురస్కారాలు ప్రతిభావంతులను ప్రోత్సహించడమే కాకుండా, దేశ సేవలో అందరిని భాగస్వాములను చేస్తాయి

# జీవో నెంబర్ 396 కు వ్యతిరేకంగా ఆళ్లగడ్డలో దస్తావేజు లేఖరుల నిరసన



ఆళ్లగడ్డ ప్రతినిధి జూలై 15 నంది పత్రిక రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ప్రైవేటీకరణ చేయాల ని, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు ఏర్పా టు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణం ఉప సంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం పిలుపుమేరకు ఆళ్లగడ్డలో బుధవారం దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణంలో దస్తావేజు లేఖరుల సమావేశంలో సంఘం నాయకులు పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ దీకరణతో ఆస్తులకు భద్రత లేకుండా పోతుందన్నారు. ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ శాఖ అప్పజెప్పడం దుర్మార్గమని మండిపడ్డారు. రిజిస్ట్రే షన్ చేసుకునే ప్రతి డాక్యుమెంట్కు రిజిస్ట్రేషన్ చార్జీలతో పాటు అదనం గా ప్రైవేటు వ్యక్తులకు ప్రతి దాక్యు మెంట్కు 2వేల రూపాయలు చెల్లిం చాలని నిర్ణయించడం పెట్టుబడిదారులకు దోచిపెట్టడమే నన్నారు. ఈ పీపీపీ విధానం వల్ల రిజిస్ట్రేషన్ శాఖలో అనేక గందరగోళాలు నెలకొంటాయని దాని మూలంగా ప్రజల ఆస్తులకు, ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం రిజిస్ట్రేషన్ శాఖ ప్రైవేటీకరణ, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు ఏర్పాటు నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జూలై 20 నుంచి 31వ తేదీ వరకు ఆళ్లగడ్డ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు పరిధిలో రిజిస్ట్రేషన్లు, అగ్రిమెంట్లు రాయడం వంటి సేవలన్నీ పూర్తిగా నిలిపివేస్తున్నాం. కక్షిదారులు, ప్రజలు ఈ అసౌకర్యాన్ని ముందుగానే గమనించి తమ నిమ్మెకు సహకరించాలని ఏపీ రాష్ట్ర దస్తావేజులేఖరుల సంఘం పిలుపు మేరకు ఆళ్లగడ్డ తాలూకా దస్తావేజులేఖరుల సంఘం శాఖ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, కె.బాబు, రాజేంద్రప్రసాద్, సంజీవరాయుడు, రామసుబ్బయ్య, కరిముల్లా, విశ్వం, నాగేంద్ర, మహబూబ్ భాష, నగరం భాష, షాబుద్దీన్, స్టాంపు వెండర్లు, ఈశ్వర చైతన్య గురుమూర్తి మెహరాజ్, సాయి, డీటీపీ ఆపరేటర్లు మద్దిలేటి, పుల్లయ్య తదితరులు ఉన్నారు

# మున్సిపల్ శాఖ పని తీరుపై ఎమ్మెల్యే రోషన్ కుమార్ సమీక్ష



విజయవాడ బ్యూరో చీఫ్ జూలై 15 నంది పత్రిక జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ లోని వివిధ శాఖల పనితీరుపై చింతలపూడి శాసనసభ్యులు శ్రీ సొంగా రోషన్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం, పన్నుల వసూలు తీరు, ఇతర ఆదాయం వనరులు ప్రభుత్వానికి సమకూర్చడం, పారిశుధ్యం, ప్రజారోగ్యం, ఇంజనీరింగ్ విభాగం, పట్టణ ప్రణాళికా విభాగం, జనన, మరణాలు తదితర విభాగాల ప్రభుత్వం వ నిధులను సమీక్షించి పలు సూచనలు చేశారు. మెప్మా పట్టణ పేదరిక నిర్మూలన పథకం ద్వారా 52 గ్రూపులకు 9.50 కోట్ల రూపాయల ఆర్థిక చేయూత అందించడం జరిగిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఆర్థిక చేయూత లక్ష్యసాధన గా ముందుకు సాగాలని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అధికారులకు సూచించారు

# అభివృద్ధి ఎజెండా గా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

**ప్రజలకు అందుబాటులో బిజీబిజీగా ఎమ్మెల్యే రోషన్ కుమార్**



విజయవాడ (చింతలపూడి) జూలై 15 నంది పత్రిక చింతలపూడి నియోజక వర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేయాలన్న ఏకైక లక్ష్యంతో ముందడుగు వేస్తున్నట్లు శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ స్పష్టం చేశారు. చింతలపూడి క్యాంప్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గం పరిధిలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలను ప్రతి ఒక్కరినీఆప్యాయంగా గా పలకరిస్తూ వారి నుండి అర్జీలు స్వీకరించి వారికి పరిష్కార మార్గం చూపుతూ ,అధికారుల వద్దకు గ్రీవెన్సులపైన ఆదేశాలు జారీ చేస్తూ బిజీబిజీ గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలని, అభివృద్ధి పనులను శరవేగంతో అమలు చేయాలని ఆయన సూచించారు. నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు, ఆలోచనలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# జంగారెడ్డిగూడెంలో రూ.101 కోట్ల మంచినీటి పథకానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

**- ఏఐఐబీ నిధులతో జంగారెడ్డిగూడెం మంచినీటి ప్రాజెక్టు ప్రారంభం**

**- ఎర్రకాలువ నుంచి ఇంటింటికీ నీరు:**

**సొంగా.రోషన్ కుమార్ చేతుల మీదుగా భారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన**



విజయవాడ (జంగారెడ్డిగూడెం,) బ్యూరో చీఫ్ జూలై 15 నంది పత్రిక జంగారెడ్డిగూడెం పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చేపట్టిన భారీ మంచినీటి పథకానికి బుధవారం శంకుస్థాపన జరిగింది. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పనులను ప్రారంభించారు

**రూ.101.16 కోట్లతో మెగా ప్రాజెక్టు** ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) నిధులతో ఈ పథకాన్ని చేపడుతున్నారు. మొత్తం అంచనా వ్యయం రూ.101.16 కోట్లు. ఇందులో రూ.85.38 కోట్లు పథకం నిర్మాణానికి, మిగిలిన రూ.15.78 కోట్లు 7 సంవత్సరాల పాటు నిర్వహణకు జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీకి కేటాయించారు. కొంగువారిగూడెం వద్ద ఉన్న ఎర్రకాలువ జలాశయం నుంచి నీటిని తీసుకుని శుద్ధి చేసిన అనంతరం పట్టణంలోని ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సరఫరా చేయనున్నారు. ఈ పనులను హైదరాబాద్‌కు చెందిన సి-వెట్ కంపెనీ చేపట్టింది. 2019లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకానికి అప్పటి టిడిపి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఏఐఐబీ రూ.80.35 కోట్లు మంజూరు చేసింది. అయితే ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో వైసీపీ హయాంలో పనులు నిలిచిపోయాయి. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని రీ-ఎస్టిమేట్ చేసి నిధులు పెంచి, నేడు మళ్లీ పనులు ప్రారంభించారు.

**ప్రజల హర్షం** ఏళ్లుగా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న జంగారెడ్డిగూడెం ప్రజలు ఈ పథకం ప్రారంభంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. పథకం పూర్తయితే పట్టణానికి సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారులు, సి-వెట్ కంపెనీ ప్రతినిధులు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.



# దామగట్ల లో "ఆత్మా" ఆధ్వర్యంలో సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం.

నందికొట్కూరు జూలై 15( నంది పత్రిక)మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో బుధవారం ఆత్మా సౌజన్యంతో రైతులకు ఆర్‌పీఎల్ ఆధారిత పూర్వాభ్యాస గుర్తింపు శిక్షణ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి షేక్షావలి ఆధ్వర్యంలో నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బాలాజీ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఖరీఫ్ పంట కాలంలో ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల యాజమాన్య పద్ధతులు, ఎరువుల సమర్థ వినియోగం గురించి అవగాహన కల్పించారు. అలాగే ఆర్ డబ్ల్యు బి సి ఐ ఎస్ మరియు పంట బీమా పథకాల ప్రాధాన్యం, పంటల ప్రస్తుత స్థితిగతులు, క్రాపింగ్ ప్యాటర్న్, ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ విధానం, హెచ్ డి పి ఎస్ పద్ధతిలో పత్తి సాగు వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు వివరించారు. రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించి, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.



# అర్హులైన ప్రతి లబ్ధిదారునికి కేంద్ర సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా అధికారులు పనిచేయాలి







## అధికారులుప్రజాప్రతినిధుల సమన్వయంతోనే జిల్లా అభివృద్ధి సాధ్యం

## కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

**భీమవరం బ్యూరో చీఫ్: జూలై 15, నంది పత్రిక** కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు జిల్లాలోని అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో చేరేలా అధికారులు అంకితభావంతో పనిచేయాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే జిల్లా అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి, సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి కేంద్ర మంత్రి అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, డీఆర్ఓ పి. ప్రభాకర్, జిల్లా పరిషత్ సీఈఓ పి. జగదాంబతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, ప్రస్తుత పురోగతి, ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతపై సమగ్రంగా సమీక్షించారు. జల్ జీవన్ మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, వైద్య ఆరోగ్యం, గృహ నిర్మాణం, ఇరిగేషన్, తాగునీరు, విద్యుత్, రహదారులు తదితర శాఖల పనితీరును శాఖల వారీగా పరిశీలించారు. గత దిశ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ పనుల నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనంతో నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని, మంజూరైన నిధులను శాఖలు సకాలంలో వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు నిర్వహించే దిశ సమావేశాలకు జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, ఈ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యల నివేదికతో తదుపరి సమావేశానికి రావాలని ఆదేశించారు. జల్ జీవన్ మిషన్ పనులపై సమీక్ష సందర్భంగా ఆచంట, నర్సాపురం నియోజకవర్గాల్లో పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. తాగునీటి పైప్‌లైన్ పనుల వల్ల రహదారులు దెబ్బతినకుండా ఆర్అండ్‌బీ శాఖతో సమన్వయం చేసుకుని పనులు వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. గృహ నిర్మాణ శాఖ సమీక్షలో జిల్లాలో నిర్మించాల్సిన 50,619 ఇళ్లలో 36,398 ఇళ్లు పూర్తయ్యాయని, మరో 14 వేల ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని అధికారులు తెలిపారు. గృహ నిర్మాణ పురోగతిలో జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో ఉందని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో ఆచంట, భీమవరం ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొత్త డయాలసిస్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. విద్యాశాఖ సమీక్షలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు, 27 పీఎం శ్రీ పాఠశాలల్లో విద్యాబోధన, మౌలిక సదుపాయాలపై అధికారులు వివరించారు. వ్యవసాయ శాఖ సమీక్షలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ లబ్ధిదారుల వివరాలు, ఆన్‌లైన్ ద్వారా ఎరువుల సరఫరా అంశాలను అధికారులు వివరించారు. విద్యుత్ శాఖ సమీక్షలో పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ యూనిట్ల ఏర్పాటు, విద్యుత్ ఉత్పత్తి, మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేసే అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పి.ప్రభాకర్, జిల్లా పరిషత్ సీఈఓ పి జగదాంబ, డిపిఓ కె.అనురాధ, సిపిఓ కె.శివ పార్వతి, డ్వామా పీ.డి డాక్టర్. కెసిహెచ్ అప్పారావు, పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి రెడ్డి, డీఈవో ఈ నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్. రవిబాబు, డి సి హెచ్ ఎస్ పి సూర్యనారాయణ, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, ఎల్ డి ఎం నాగేంద్రప్రసాద్, ఆర్ అండ్ బి ఎస్.ఇ ఎ.శ్రీనివాస్, జిల్లా లేబర్ ఆఫీసర్ ఎ.లక్ష్మి, తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా అధికారులు ప్రజల నుండి వచ్చిన అర్జీలను పరిష్కరించడానికి దృష్టి పెట్టాలి

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం, బ్యూరో చీఫ్ జూలై 15 నంది పత్రిక** జిల్లాలో ప్రజాసమ స్యలపరిష్కార వేదిక కార్యక్రమంలోప్రజలనుండి వచ్చిన ఆర్జీలను పరిష్క రించడానికి దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని పి.జి.ఆర్.ఎస్ హాల్ నుండి జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులతో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపైజిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల ద్వారా ప్రజల నుండి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి స్థాయిలో పరిష్క రించాలని అధికారు లకు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ప్రజల సంతృప్తి మేరకు పరిష్కరించా లన్నారు. పరిష్కరించడానికి వీలు కానీ సమస్య లను అర్జీదారులకు ఎండార్స్మెంట్ ద్వారా తెలియజే యాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు ప్రి ఆడిట్ మరియు ఆడిట్ తప్పనిసరిగా చేయాలని కలెక్టర్ చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేద కార్యక్రమంలో వచ్చిన అర్జీలు తిరిగి రీఓపెన్ కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పీజీ ఆర్ఎస్ నోడల్ అధికారి దోశిరెడ్డి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కే సిహెచ్ అప్పారావు డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్ గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పిచ్చయ్య జిల్లా పంచాయతీ అధికారి అనురాధ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.




# జూలై 17న మున్సిపల్ కార్యాలయం భీమవరంలో నియోజకవర్గ స్థాయి ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం

## ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారమే లక్ష్యం

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ జులై 15 నంది పత్రిక** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటిని వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా భీమవరం నియోజకవర్గంలో నాల్గవ ప్రత్యేక పీ.జీ.ఆర్.ఎస్ కార్యక్రమాన్ని ఈ నెల 17వ తేదీ శుక్రవారం భీమవరం మున్సిపాలిటీ కార్యా లయంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించబడుతుందని ఆమె వెల్లడించారు.ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి వినతిని సంబంధితశాఖల అధికారులు క్షుణ్ణం గాపరిశీలించి, ప్రభుత్వ నిబంధ నలు, మార్గదర్శకాల మేరకు పరిష్క రించేందుకు తగిన చర్యలు తీసుకుంటా మని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్ర మంలో జిల్లా, డివిజన్, మండల స్థాయిలకు చెందిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారనిఆమె చెప్పారు.ప్రజా సమస్యల పరిష్కా రంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే ఈ ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. భీమవరం నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కా రం పొందాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# కడప జిల్లాలో దాల్మియా సిమెంట్ రెండో ప్లాంట్ విస్తరణ పనులకు మంత్రి లోకేష్ శంకుస్థాపన







## రూ.3,100 కోట్ల పెట్టుబడి పెట్టనున్న దాల్మియా భారత్ సిమెంట్

**జమ్మలమడుగు బ్యూరో చీఫ్ జూలై 15 నందిపత్రిక** కడప జిల్లా మైలవరం మండలం చిన్నకొమెర్లలో దాల్మియా భారత్ సిమెంట్ పరిశ్రమ రెండో ప్లాంట్ విస్తరణ పనులకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ముందుగా ప్లాంట్ ఆవరణకు చేరుకున్న మంత్రి లోకేష్ కు దాల్మియా భారత్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పునీత్ దాల్మియా, కంపెనీ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. ముందుగా దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ లో రోబో ల్యాబ్, సెంట్రల్ కంట్రోల్ రూమ్ ను మంత్రి సందర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్, ఏవీని వీక్షించారు. కార్మికులను పలకరించి వారితో కలిసి సెల్ఫీ దిగారు. అనంతరం పునీత్ దాల్మియాతో కలిసి దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్ లైన్-2 విస్తరణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రూ.3,100 కోట్ల పెట్టుబడి పెట్టనున్న దాల్మియా భారత్ సిమెంట్ దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్ లైన్-2 విస్తరణను రూ.3,100 కోట్ల వ్యయంతో చేపట్టనుంది. మైలవరం మండలంలోని చిన్నకొమెర్లలో ప్లాంటులో దాల్మియా సిమెంట్ ఏడాదికి 2.5 మిలియన్ టన్నుల క్లింకర్, 3.6 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి చేస్తోంది. కొత్తప్లాంట్ విస్తరణతో క్లింకర్ సామర్థ్యం 6.1 మిలియన్ టన్నులు, సిమెంట్ ఉత్పత్తి 9.6 మిలియన్ టన్నులకు చేరనుంది. ప్లాంట్ విస్తరణతో కొత్తగా 1000 మందికి ఉద్యోగాల కల్పన జరగనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీ.జీ. భరత్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, జమ్మలమడుగు నియోజకవర్గ ఎమ్మెల్యే సీ.ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్యేలు రెడ్డప్పగారి మాధవి రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ సీహెచ్ భూపేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, దాల్మియా భారత్ లిమిటెడ్ గ్రోత్ అండ్ ఎక్స్ పాన్షన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేసీ బిర్లా, నేషనల్ మ్యానుఫ్యాక్చరింగ్ హెడ్ గణేష్ వామనరావు జిర్కుంత్వార్, ప్లాంట్ హెడ్ అర్పున్ పరేఖ్, ప్రాజెక్ట్ హెడ్ అనుపమ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.








# సుమారు.రూ. 11లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు అందజేసిన రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్థసారథి

**ఏలూరు బ్యూరో చీఫ్ జూలై:15 నంది పత్రిక** ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామ సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్థసారధి ఇటీవల వైద్యం చేయించుకున్న సుమారు.20మంది బాదిత కుటుంబాలకు సుమారు. రూ.11లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసిన మంత్రివర్యులు కొలుసు పార్థసారధి. మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి సంజీవని వంటిదని అన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుందని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో 104 వాహనం మాదిరిగా 109వాహనం గ్రామంలోని ప్రతి ఒక్కరికకీ ఆరోగ్య పరీక్షలు చేసి ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తుందని అన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదని. కానీ కూటమి ప్రభుత్వంలో నూజివీడు నియోజకవర్గములో ఇప్పటి వరకూ సుమారు.రూ15కోట్లు విలువైన ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులు అందించామన్నారు.ప్రభుత్వ ఆసుపత్రిలోని మెరుగైన వైద్యం కోసం మెరుగైన వైద్య పరికరాల ఏర్పాటుకు వేలకోట్ల ఖర్చు చేసిందని తద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు.కూటమి ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్య భద్రతతో సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,ఎన్, వేణు,తహశీల్దార్, ఇతర ప్రభుత్వ అధికారులు, ,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులు ఆధునిక సమాజానికి అనుగుణంగా తమను తాము నవీకరించుకోవాలి



ఉపాధ్యాయులు ఇప్పుడు వస్తున్న నూతన పోకడలను అందిపుచ్చుకొని ఆధునిక సమాజానికి అనుగుణంగా తమను తాము నవీకరించుకోవాలి అని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఈరోజు స్థానిక ఓల్డ్ హైస్కూల్లో గత మూడు రోజులుగా ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ టీచర్స్ ట్రైనింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయులు కృత్రిమ మేధను ఉపయోగించేలా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారని ప్రతి వారు వారి వృత్తిలో వారి నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటారని, ఉపాధ్యాయులు కూడా మెరుగుపరుచుకుంటేనే బోధన సులువుతుందని ఆన్నారు,దానికి వారి వైద్య వృత్తిని ఉదాహరణగా చెప్పారు తమను తాము నిరంతరం నైపుణ్యాలను పెంచుకుంటేనే వైద్య రంగంలో రానిస్తామని అలాగే ఉపాధ్యాయులు కూడా నిరంతరం ఈ శిక్షణ కార్యక్రమాల ద్వారా బోధన మెలకువలను మెరుపరచుకోవాలని పిలుపునిచ్చారు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న బడుగు బలహీన వర్గాల పిల్లలకు మంచి విద్యను అందించి వారి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఓటమికి నిరాశపడకుండా ఉండేలా విద్యార్థులలో ఉపాధ్యాయులు ఆత్మ స్థైర్యాన్ని నింపాలని ,తాను పదవ తరగతిలో ఫెయిల్ అయినా కూడా తర్వాత పెద్ద డాక్టర్ ను కాగలిగానని తెలిపారు గత ఎస్ఎస్సి ఫలితాలు జిల్లా నాలుగవ స్థానం రావడం మరియు ప్రైవేటు పాఠశాలల నుండి విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో మన జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చేరుతున్నందుకు ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు పాఠశాలలోనే భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము,మండల విద్యాధికారి చంద్రకళ,అకాడమిక్ మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి,జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్,పిఆర్టియు టిఎస్ జిల్లా అధ్యక్షులు బోయిని పెల్లి ఆనంద్ రావు,రిసోర్సెస్ పర్సన్స్ పరమేశ్వర్,జగదీశ్వర్,రాజకుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## నవజాత శిశువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



నవజాత శిశువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సంకల్ప్ లో భాగంగా నవజాత శిశువుల మరణాల నివారణ తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల గైనకాలజిస్టులు, చిన్న పిల్లల వైద్య నిపుణులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గత మూడు నెలల్లో నవజాత శిశువుల మరణాలు, కారణాలపై సుదీర్ఘ సమీక్ష చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వేములవాడ ఏరియా ఆస్పత్రిలో ఎస్ఎన్ సీ యూలో సేవలపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. నవ జాత శిశువుల మరణాల శాతం జాతీయ సగటు కంటే తక్కువగా ఉందని తెలిపారు. జిల్లాలో మరణాలు సున్న శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు క్రమం తప్పకుండా అన్ని ఆరోగ్య పరీక్షలు చేయాలని ఆదేశించారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. అందరి వైద్య పరీక్షల వివరాలు భద్రపర్చాలని స్పష్టం చేశారు. గర్భిణులతో అవసరమైన వ్యాయామం. యోగా ఆసనాలు వేయించాలని, నార్మల్ డెలివరీ తో లాభాలు తెలియజేస్తూ ప్రోత్సహించాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నార్మల్ డెలివరీలు ఎక్కువ సంఖ్యలో అయ్యేలా చూడాలని ఆదేశించారు. హై రిస్క్ గర్భిణులకు మాత్రమే సీ సెక్షన్ ఆపరేషన్లు చేయాలని స్పష్టం చేశారు. బాలింతలు అప్పుడే పుట్టిన పిల్లలకు పాలు ఇవ్వడం, ఇతర జాగ్రత్తలపై వైద్యులు, సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే పుట్టిన బిడ్డను మొదటి గంటలోగా తల్లి వద్దకు చేర్చాలని తెలిపారు. నెలలు నిండని, తక్కువ బరువుతో పుట్టిన నవ జాత శిశువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, డీ సీ హెచ్ ఎస్ రవీందర్, మెడికల్ ఆఫీసర్లు, గైనకాలజిస్ట్, పిల్లల వైద్య నిపుణులు, ఐఎంఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం... పల్నాడు యువతి మక్కెన ప్రసన్న దుర్మరణం

ఉన్నత చదువులు చదివి, ఉజ్వల భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఓ తెలుగు యువతి జీవితం రోడ్డు ప్రమాదం రూపంలో విషాదాంతమైంది. పల్నాడు జిల్లాకు చెందిన మక్కెన ప్రసన్న (27) అమెరికాలోని న్యూజెర్సీలో జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందింది. ఈ ఘటనతో ఆమె స్వగ్రామం ఉమ్మడివరంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే.. వినుకొండ మండలం ఉమ్మడివరం గ్రామానికి చెందిన రైతు దంపతులు మక్కెన వెంకటేశ్వర్లు, గోవిందమ్మల పెద్ద కుమార్తె ప్రసన్న. 2022లో ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లిన ఆమె, ఇటీవలే ఎంఎస్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంది.

# ఏపీలో బయటపడ్డ మరో బంగారు గని..
# రామగిరి గోల్డ్ మైన్స్ పునరుద్ధరణకు సర్కార్ సన్నద్ధం

ఆంధ్రప్రదేశ్ స్వరాంధ్రగా మారుతోంది. మరో బంగారు గని వెలుగులోకి వచ్చింది. రాయలసీమ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద స్వర్ణ హబ్‌గా మార్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇప్పటికే కర్నూలు జిల్లా జొన్నగిరిలో భారతదేశపు మొట్టమొదటి భారీ ప్రైవేట్ బంగారు గనిలో ఉత్పత్తి ప్రారంభమైంది. తాజాగా చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో బంగారు నిక్షేపాల అన్వేషణ, వేలం ప్రక్రియ వేగవంతం చేసింది. ఆంధ్రప్రదేశ్ స్వరాంధ్రగా మారుతోంది. మరో బంగారు గని వెలుగులోకి వచ్చింది. రాయలసీమ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద స్వర్ణ హబ్‌గా మార్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇప్పటికే కర్నూలు జిల్లా జొన్నగిరిలో భారతదేశపు మొట్టమొదటి భారీ ప్రైవేట్ బంగారు గనిలో ఉత్పత్తి ప్రారంభమైంది. తాజాగా చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో బంగారు నిక్షేపాల అన్వేషణ, వేలం ప్రక్రియ వేగవంతం చేసిందిఈ క్రమంలోనే శ్రీ సత్యసాయి జిల్లాలోని



చారిత్రాత్మక రామగిరి గోల్డ్ మైన్స్ (బంగారు గనులు) పునఃప్రారంభానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి బుధవారం రామగిరి గోల్డ్ మైన్స్ పరిధిలోని ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కర్నూలు జిల్లా స్వర్ణగిరి తరహాలోనే రామగిరి గోల్డ్ మైన్స్‌ను కూడా అత్యాధునిక సాంకేతికతతో త్వరలోనే తిరిగి ప్రారంభిస్తామని మంత్రి ఈ సందర్భంగా కీలక ప్రకటన చేశారు. గనుల పరిశీలన అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో అపారమైన ఖనిజ సంపద ఉందని, వాటిని సద్వినియోగం చేసుకొని రాష్ట్రానికి ఆదాయం తేవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. “కర్నూలు జిల్లా జొన్నగిరి మైనింగ్‌లో ఒక టన్ను మట్టిని ప్రాసెస్ చేస్తే ఒక గ్రాము బంగారం వస్తోంది. కానీ శాస్త్రవేత్తల అంచనా ప్రకారం రామగిరి గోల్డ్ మైన్స్‌లో టన్ను మట్టికి ఏకంగా 4 గ్రాముల బంగారం లభించే అవకాశం ఉంది. 416 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ గనులపై ఇప్పటికే సర్వేలు పూర్తయ్యాయి. త్వరలోనే అంతర్జాతీయ ప్రమాణాలతో టెండర్లు పిలిచి మైనింగ్ పనులు ప్రారంభిస్తాం” అని మంత్రి స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లా చిగురుగుంటతో పాటు రాష్ట్రంలో మరో మూడు ప్రాంతాల్లో బంగారు నిక్షేపాలను గుర్తించినట్లు ఆయన వెల్లడించారు.

# పల్లెల అభివృద్ధినే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

గ్రామాల అభివృద్ధినే లక్ష్యంగా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల రాకపోకల ఇబ్బందులను శాశ్వతంగా తొలగించే లక్ష్యంతో, మధిర మరియు ఎర్రుపాలెం మండలాల్లో ఎంపీ లాడ్స్ నిధులు రూ.60 లక్షలతో నూతనంగా నిర్మించిన మొత్తం 14 సీసీ రోడ్లను ప్రారంభించారు. మధిర మండలం మాటూరు గ్రామం నుండి ప్రారంభమైన ఈ పర్యటన, ఎర్రుపాలెం మండలంలోని రామన్నపాలెం, ఇనగాలి, తక్కెళ్లపాడు,బనిగండ్లపాడు, మీనవోలు, ఎర్రుపాలెం మండల కేంద్రం మరియు రేమిడిచర్ల గ్రామాల్లో కొనసాగింది. వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల ప్రారంభోత్సవాలకు ఎంపీ శ్రీకారం చుట్టారు. తక్కెళ్ళపాడు గ్రామంలో ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైస్సార్ విగ్రహానికి పూలమాల వేసి



నివాళులర్పించారు.?ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ..ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం, ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నానన్నారు. నేడు ప్రారంభించిన ఈ రోడ్లు గ్రామాల్లోని ప్రజల రాకపోకలకు ఇబ్బందులను తొలగిస్తాయని చెప్పారు.ఎంపీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తన పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ కోటా రాంబాబు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, మాజీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ చైర్మన్ మదన్మోహన్ రెడ్డి, అంకిరెడ్డి, సర్పంచులు ముక్కరి రామకృష్ణారెడ్డి, కూరపాటి రమేష్, అప్పారావు, నంద్రు అశ్విని, బలుసుపాటి జయరావు, కొత్తపల్లి ప్రశాంత్, పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో నయా జోష్..
# రిజిస్ట్రేషన్ల జోరు.. కొత్త వెంచర్ల హవా!

యాదాద్రి భువనగిరి, వికారాబాద్ తదితర ప్రాంతాల్లో భూములపై డిమాండ్ పెరుగుతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మౌలిక సదుపాయాలే ప్రధాన బలం. హైదరాబాద్ అభివృద్ధిలో రవాణా మౌలిక సదుపాయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. మెట్రో రైలు రెండో దశ విస్తరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వస్తున్నాయి.

**రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టు వేగం పుంజుకుంటోంది.**

రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్లు, మల్టీ లెవెల్ జంక్షన్లు నగర ప్రయాణాన్ని సులభతరం చేస్తున్నాయి. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు దీర్ఘకాలిక పట్టణాభివృద్ధికి దోహదం చేయనున్నాయని అధికారులు చెబుతున్నారు.

**ప్రభుత్వ నిర్ణయాలతో పెరుగుతున్న పెట్టుబడుల విశ్వాసం**

ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఆస్తుల మార్కెట్ విలువలను సవరించడం, రిజిస్ట్రేషన్ విలువల్లో మార్పులు తీసుకురావడం, నిర్మాణ అనుమతుల కోసం దీబఙశ్రీఎచీశీష వంటి డిజిటల్ వ్యవస్థలను అందుబాటులోకి తేవడం వంటి చర్యలు రియల్ ఎస్టేట్ రంగాన్ని మరింత పారదర్శకంగా మార్చే దిశగా ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతు న్నారు.

**ప్రపంచ కంపెనీలకు హైదరాబాద్ హబ్**

హైదరాబాద్ ఐటీ, ఫార్మా రంగాలతో పాటు డేటా సెంటర్లకు కూడా ప్రధాన కేంద్రంగా మారుతోంది. అమెజాన్ హైపర్‌స్కేల్ డేటా సెంటర్ వంటి భారీ పెట్టుబడులు నగరంలో ఉద్యోగ అవకాశాలు, కమర్షియల్ స్పేస్, నివాస అవసరాలను మరింత పెంచనున్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి చెబుతున్నారు.

**ప్రభుత్వ నిర్ణయాలతో పెరుగుతున్న పెట్టుబడుల విశ్వాసం**

ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఆస్తుల మార్కెట్ విలువలను సవరించడం, రిజిస్ట్రేషన్ విలువల్లో మార్పులు తీసుకురావడం, నిర్మాణ అనుమతుల




కోసం దీబఙశ్రీఎచీశీష వంటి డిజిటల్ వ్యవస్థలను అందుబాటులోకి తేవడం వంటి చర్యలు రియల్ ఎస్టేట్ రంగాన్ని మరింత పారదర్శకంగా మార్చే దిశగా ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రపంచ కంపెనీలకు హైదరాబాద్ హబ్**

హైదరాబాద్ ఐటీ, ఫార్మా రంగాలతో పాటు డేటా సెంటర్లకు కూడా ప్రధాన కేంద్రంగా మారుతోంది. అమెజాన్ హైపర్‌స్కేల్ డేటా సెంటర్ వంటి భారీ పెట్టుబడులు నగరంలో ఉద్యోగ అవకాశాలు, కమర్షియల్ స్పేస్, నివాస అవసరాలను మరింత పెంచనున్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి

**అందుబాటు ధరలే మరో ప్లస్**

బెంగళూరు, ముంబై, గురుగ్రామ్ వంటి నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో మెరుగైన మౌలిక సదుపాయాలతో కూడిన ఇళ్ల ధరలు ఇంకా పోటీ స్థాయిలో ఉండటం కొనుగోలుదారులకు అనుకూల అంశంగా మారింది. అదే సమయంలో మంచి అద్దె ఆదాయం, దీర్ఘకాలిక విలువ పెరుగుదల అవకాశాలు పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

**నిపుణుల అభిప్రాయం**

రియల్ ఎస్టేట్ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఉద్యోగాల సృష్టి, ఐటీ రంగ విస్తరణ, డేటా సెంటర్లు, మెరుగైన కనెక్టివిటీ, ప్రభుత్వ మౌలిక సదుపాయాల పెట్టుబడులు కలిపి హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌కు దీర్ఘకాలిక బలాన్ని ఇస్తున్నాయి. అయితే కొనుగోలు చేసే ముందు నమోదు, ఎవీణూ లేదా సంబంధిత అనుమతులు, చట్టపరమైన పత్రాలు, అభివృద్ధి పురోగతి వంటి అంశాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచిస్తున్నారు. గత దశాబ్దంలో ఐటీ రాజధానిగా ఎదిగిన హైదరాబాద్, ఇప్పుడు మౌలిక సదుపాయాలు, డిజిటల్ పెట్టుబడులు, ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలు, నగర విస్తరణతో దేశంలోని అత్యంత ఆశాజనక రియల్ ఎస్టేట్ గమ్యస్థానాల్లో ఒకటిగా నిలుస్తోంది. మార్కెట్‌లో తాత్కాలిక మార్పులు సహజమే అయినప్పటికీ, దీర్ఘకాలిక దృష్టితో చూస్తే హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం పెట్టుబడిదారులకు, గృహ కొనుగోలుదారులకు విశేష అవకాశాలను అందించే నగరంగా కొనసాగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com